అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 8-3-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 69 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ప్రజాస్వామ్యం తలదించుకుంటున్నది




జనంలో భయాందోళనలు సృష్టిస్తున్న ఆరెస్సెస్, బీజేపీ

- 'త్రిపుర' ఘటనలపై వామపక్ష నేతలు
- ఐక్యంగా తిప్పికొడతామని హెచ్చరిక
- బషీర్‌బాగ్‌లో నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతోన్మాదుల చర్యలతో దేశంలో ప్రజాస్వామ్యం తలదించుకుంటున్నదని వామపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసే క్రమంలో అగ్రవర్ణ హిందూత్వ వాదులు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తద్వారా ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. విశాల ప్రజా మద్దతును కూడగట్టటం ద్వారా ఇలాంటి చర్యలను తిప్పికొడతామని వారు హెచ్చరించారు. త్రిపురలో లెనిన్ మహాశయుని విగ్రహాలను కూల్చి.. విధ్వంసం సృష్టించిన ఆరెస్సెస్, బీజేపీ చర్యలను నిరసిస్తూ ...9లో



ఆసరాకు నిధుల్లేవు

అత్తెసరు విదిలింపు..!!

- పండుటాకుల ఎదురుచూపులు
- వందల కోట్లు పెండింగ్
- ఆవేదనలో వృద్ధులు, వితంతువులు
- పూర్తిస్థాయిలో పంపిణీ కాని పింఛన్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్ సంస్థలు, బహుళ జాతి కంపెనీలకు ప్రభుత్వ భూములను ఉచితంగా ఇవ్వడంలో, మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం చూపించినంత ఉత్సాహం, నిరుపేద లబ్ధిదారుల పింఛన్లకు నిధులు కేటాయింపులో కనిపించడం లేదు. దీంతో నెలల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. పింఛన్లు వచ్చాయా ? వస్తే ఏ నెలవి ? వాటిని పంపిణీ చేశారా ? ఎంత ఇచ్చారు ? అనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికీ స్పష్టత లేదు. గతంలో ఎన్నడూలేనివిధంగా మూడు నెలలుగా సామాజిక పింఛన్లకు నిధులను విడుదల చేయడంలో సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. గ్రామీణ పేదల పట్ల అలక్ష్యంగా ఉంటున్నది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ రోగులు, ఒంటరి మహిళలకు ఆసరా పథకాన్ని అమలుచేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో దాదాపు 38 లక్షల మంది లబ్ధిదారులు ఆసరా పథకానికి అర్హత సాధించారు. వికలాంగులు, రూ. 1500 చొప్పున, ఇతరులకు రూ. 1000 చొప్పున పింఛన్లను ఇవ్వాలని ఆసరా పథకం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇదిలావుండగా ఇటీవల సర్కారు పింఛన్లకు నిధులు ఇవ్వడంలో తీవ్ర ఆలస్యం చేస్తున్నది. ప్రతినెలా ఏడో తేదీలోగా లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. అలా పథకం ప్రారంభమైన దగ్గర నుంచి ఏనాడూ సక్రమంగా సర్కారు అమలు చేయలేకపోయింది. ఎప్పుడూ ప్రతి నెలా మూడు లేదా నాలుగో వారంలోనే అందిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ...9లో





కర్ణాటక లోకాయుక్తకు కత్తి పోట్లు

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


వివరాలు 2లో

జాతీయ స్థాయి పరీక్షలకు ఆధార్ తప్పని సరికాదు

- నీట్ కేసులో తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు

వివరాలు 2లో

కేంద్ర క్యాబినెట్ నుంచి టీడీపీ బయటకు..



- నేడు మంత్రుల రాజీనామా
- ఎన్డీఏతో కటీఫ్‌పై తర్వాత నిర్ణయం : చంద్రబాబు

అమరావతి : కేంద్ర క్యాబినెట్ నుంచి టీడీపీ బయటకు వచ్చేందుకు నిర్ణయం తీసుకున్నది. కేంద్ర క్యాబినెట్‌లో కొనసాగుతున్న టీడీపీ చెందిన ఇద్దరు మంత్రులు సుజనా చౌదరీ, అశోక గజపతి రాజు నేడు(గురువారం) ఉదయం రాజీనామా చేస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అయితే.. ఎన్డీఏ కూటమితో మైత్రి బంధం కొనసాగించాలా? లేదా? అన్నది తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన ప్రకటించారు. బుధవారం రాత్రి జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రాన్ని తామెక్కడా గొంతెమ్మ కోర్కెలు కోరలేదని తెలిపారు. ప్రధానికి ...9లో

ప్రశ్నిస్తే.. దాడులు

నాకూ 'ఐటీ' హెచ్చరికలు



- ఆ రెండు పార్టీలు నన్ను వాడుకొని వదిలేశాయి
- విలేకరుల ఇష్టాగోష్టిలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్
- 14న పార్టీ సభలో భవిష్యత్ కార్యాచరణ

వివరాలు 9లో

అర్హత లేకున్నా అందలం

స్క్రీనింగ్ కమిటీ వద్దన్నా సెలక్షన్స్

- హెచ్‌సీయూ నియామకాల్లో తవ్వినకొద్దీ అక్రమాలు

వివరాలు 9లో



యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. దుండగుల దుశ్చర్యను ఖండిస్తూ స్థానికంగా ఉన్న దళితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ దురాగతానికి పాల్పడింది బీజేపీ నేతలే అని వారు ఆరోపించారు. రాష్ట్రంలోని మీరుట్ జిల్లా మవానా ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలికి చేరుకొని భద్రతను కట్టుదిట్టం చేశారు. విగ్రహం కూల్చివేతను నిరసిస్తూ స్థానికులు బుధవారం ఉదయం నిరసన చేపట్టారు. మవానా రహదారిని దిగ్బంధించడంతో వాహనాలు ఎక్కడికక్కడ ...9లో

2

నాయకుల విగ్రహాలకు రక్షణ కల్పించండి : మద్రాస్ హైకోర్టు

పెరియార్ విగ్రహాలను తమిళులు కాపాడుకుంటారు- కమల్

రుణాలు ఎగ్గొట్టడంలో కళాకారుడివి..

గౌతం అదానీపై సుబ్రమణ్యస్వామి సంచలన వ్యాఖ్యలు వివరాలు 9లో

కాక్కొరొకో..



మీ ప్రసంగం అద్భుతంగా వుంది సార్..
కానీ పోయిన ఏడాది ప్రసంగమే
మళ్లీ చదివారు...!!

పరిపాలనలో ప్రత్యేక ముద్ర

ప్రగతి పథంలో మహిళామణులు

- మెజార్టీ అధికారులుగా వారే..
- దేశంలో టాప్ టెన్‌లో హైదరాబాద్

సమాజంలో మహిళా అభివృద్ధిని ఆచారాలు, సంప్రదాయాలు శతాబ్దాలుగా అడ్డుకుంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో సాధికారికత వైపు అడుగులు వేసేందుకు చదువు, ఉద్యోగాలతో పాటు చట్టసభల్లోనూ రిజర్వేషన్లు కావాలని మహిళలు దశాబ్ద కాలంగా నిరీక్షిస్తున్నారు. ఈ బిల్లుకు మద్దతుగా అన్ని రాజకీయ పక్షాలు మద్దతు చెబుతున్నా చట్టరూపం దాల్చకుండా అడ్డుకుంటున్న వారెవ్వరనే ప్రశ్నకు సవాలక్ష సమాధానాలు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ గుండెను దిటవుగా చేసుకుంటూ సాహోసోపేతమైన సవాళ్లను అధిగమిస్తున్నారు మహిళలు. పురుషులతో సమానంగా ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుంటూ ప్రగతి పథంలో పయనిస్తున్నారు. ఇందుకు నిదర్శనం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సగానికిపైగా మహిళా అధికారులే ఉండటం. ఇచ్చిన బాధ్యతలే కాదు అదనపు బాధ్యతలనూ పూర్తి చేస్తూ జిల్లాను ప్రగతిపథం వైపు నడిపిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం.



మన పిల్లలకు ఏం నేర్పుతున్నారు?

● విగ్రహాల కూల్చివేతపై నటుడు ప్రకాష్‌రాజ్ ఆగ్రహం



బెంగుళూరు : త్రిపుర, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్, హిందూత్వ మూకలు జరుపుతున్న విగ్రహాల కూల్చివేతపై నటుడు ప్రకాష్‌రాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాల కూల్చివేతతో మన పిల్లలకు ఏం నేర్పుతున్నారు ? అని ప్రశ్నించారు. హింసను రేపి రాజకీయ లబ్ది పొందాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తద్వారా దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను తీసుకురావాలన్నది దీనివెనుకున్న వ్యూహమని తెలిపారు. కమ్యూనిస్టు విప్లవ నేత లెనిన్, సామాజిక ఉద్యమవేత్త పెరియార్ విగ్రహాల కూల్చివేత ఘటనలపై బుధవారంనాడు ఆయన ట్విట్టర్‌లో స్పందించారు.

"లెనిన్, పెరియార్ విగ్రహాలు కూల్చారు. దీనిద్వారా మన పిల్లలకు ఏం నేర్పాలనుకుంటున్నారు. మీ ఎజెండా ఏంటి ? విగ్రహాల కూల్చివేత రాజకీయాల్ని వెంటనే ఆపండి. హింస...మరో హింసాత్మక ఘటనకు దారితీస్తుంది. మీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏం చెప్పారు ? అభివృద్ధి గురించి చెప్పారా ? గూండాయిజం, రాజకీయ ప్రత్యర్థిలను కడతేర్చటం గురించి చెప్పారా?"అన్న ట్విట్టర్ సందేశాన్ని ప్రకాష్‌రాజ్ పోస్ట్ చేశారు. త్రిపుర, తమిళనాడులో జరుగుతున్న ఘటనలపై దేశవ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ హింసా రాజకీయాల్ని వారంతా ఖండించారు.

నాగాలాండ్‌లో బీజేపీ - ఎన్‌డీపీపీకి షాక్

మద్దతు ఉపసంహరించుకొన్న ఎన్‌పీపీ

కొహిమా : నాగాలాండ్ రాజకీయంలో మరొక నాటకీయ పరిణామం చోటు చేసుకుంది. బీజేపీ - ఎన్‌డీపీపీ కూటమికి నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) మద్దతును ఉపసంహరించుకొంది. ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు అటో ఎప్తోమి సంతకంతో గవర్నర్‌కు లేఖ అందింది. గవర్నరుకు ఇచ్చిన లేఖలో ఇంతకు ముందు మద్దతిస్తున్నట్టు ఇచ్చిన లేఖను పట్టించుకోవద్దని కోరారు. దీనికి ముందు ఎన్‌డీపీపీ-బీజేపీ కూటమికి 'లెటర్ ఫర్ సపోర్ట్' విరమించుకున్నట్టు పార్టీ హై కమాండ్ నుండి సరైన అధికార పత్రం సమర్పించాలని గవర్నర్ కార్యాలయం కోరింది. ఎన్‌పీపీ జాతీయ అధ్యక్షుడు కన్రాడ్ సంగ్మా ప్రస్తుతం మేఘాలయ సిఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో చాలా బిజీగా గడుపుతున్నారు. దీనితో ఈ కూటమిపై సరైన చర్చలు జరగడం లేదని అధికారిక వర్గాలు తెలిపాయి. నాగాలాండ్ ఎన్నికల్లో 2 సీట్లను ఎన్‌పీపీ గెలుచుకోగా, ఎన్‌డీపీపీ-బీజేపీ అలియన్స్ 29 స్థానాల్లో గెలిచింది. దీనికి జేడీయూ (1 స్థానం) ఇండిపెండెంట్ (1 స్థానం) మద్దతు తెలుపడంతో మొత్తం బలం 31కి చేరుకుంది.

కర్నాటక లోకాయుక్తకు కత్తి పోట్లు

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బెంగళూరు : కర్నాటకలో దారుణం చోటు చేసుకున్నది. ఆ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ విశ్వనాథ్ శెట్టిపై ఓ వ్యక్తి కత్తితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో తీవ్ర గాయాలైన విశ్వనాథ్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని తుమ్‌కూర్ జిల్లాకు చెందిన తేజస్ శర్మ బుధవారం మధ్యాహ్నం బెంగళూరులోని లోకాయుక్త కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. తాను లాయర్‌నని చెప్పి లోపలికి ప్రవేశించిన అతడు.. నేరుగా విశ్వనాథ్ శెట్టి దగ్గరకు వెళ్లాడు. ఓ కేసు విషయమై శర్మ మాట్లాడుతూనే.. తన వెంట తెచ్చుకున్న కత్తితో విశ్వనాథ్‌ను మూడుసార్లు పొడిచాడు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది.. నిందితుడు శర్మను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన విశ్వనాథ్‌ను మాల్యా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనను కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాష్ట్ర హోంశాఖ మంత్రి రామలింగారెడ్డి పరామర్శించారు. విశ్వనాథ్ క్షేమంగానే ఉన్నారని రామలింగారెడ్డి వెల్లడించారు. కర్నాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన విశ్వనాథ్.. గతేడాది జనవరి నుంచి లోకాయుక్తగా పని చేస్తున్నారు. ఓ టెండర్ల ప్రక్రియకు సంబంధించిన కేసును లోకాయుక్త కొట్టివేసిన విషయమై మాట్లాడేందుకు శర్మ వచ్చి, దాడికి పాల్పడినట్టు పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

రాజస్థాన్ స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు

మెజారిటీ స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్

జైపూర్: ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోయే రాజస్థాన్‌లో.. స్థానిక-సంస్థల ఉప ఎన్నికల ఫలితాల్లో అధికార బీజేపీకి భంగపాటు ఎదురైంది. ప్రతిపక్ష కాంగ్రెస్ గట్టిపోటీనిచ్చి మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బుధవారం వెల్లడించిన ఫలితాల్లో ఆరు జిల్లా పరిషత్ సీట్లకు గాను కాంగ్రెస్ నాలుగు సీట్లను కైవసం చేసుకోగా, బీజేపీకి ఒక్క స్థానం మాత్రమే దక్కింది. 20 పంచాయతీ సీట్లకుగాను కాంగ్రెస్12 స్థానాల్లో గెలుపొందగా, బీజేపీ ఎనిమిది సీట్లకే పరిమితమైంది. ఆరు మున్సిపల్ స్థానాలకు గాను కాంగ్రెస్ నాలుగింటిని చేజిక్కించుకోగా, బీజేపీ కేవలం రెండిటికే పరిమితమైంది. నాగేండ్లుగా ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలను పీడిస్తున్న బీజేపీకి ఈ ఫలితాలు వీడ్కోలులాంటివని రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ సచిన్ పైలట్ అన్నారు.

ఈ మూడు రైల్వే స్టేషన్లలోనూ మహిళలే

హైదరాబాద్ : ప్రపంచ మహిళా దినోత్సం సందర్భంగా దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్‌లోని మూడు రైల్వే స్టేషన్లను గురువారం నుంచి పూర్తిగా మహిళా సిబ్బందితో నిర్వహించనున్నారు. మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం ఇచ్చే ఉద్దేశ్యంతో దీన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్‌సీఆర్ అధికారులు తెలిపారు. గుంతకల్ డివిజన్‌లోని చంద్రగిరి రైల్వే స్టేషన్, సికింద్రాబాద్ డివిజన్‌లోని బేగంపేట్, గుంటూరు డివిజన్‌లోని ఫిరంగపురం రైల్వే స్టేషన్లను గురువారం నుంచి మహిళా సిబ్బంది నిర్వహించనున్నారు.

ఐటీబీపీలో తొలి మహిళా అధికారి

న్యూఢిల్లీ: ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)లో తొలిసారిగా ఒక మహిళ ఉన్నతాధికారిగా ఎంపికయ్యారు. బీహార్‌కు చెందిన ప్రకృతి(25) యూపీఎస్‌సీ, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లు నిర్వహించిన పరీక్షలలో అర్హత సాధించి ఈ గౌరవాన్ని పొందారు.

జాతీయ స్థాయి పరీక్షలకు అధార్ తప్పనిసరికాదు

నీట్ కేసులో తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ నెంబర్ తప్పనిసరి చేయవద్దని సుప్రీంకోర్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కు ఆదేశాలు జారీచేసింది. నీట్-2018తో పాటు ఇతర జాతీయ స్థాయి పరీక్షలకు కూడా అధార్‌ను తప్పనిసరి చేయవద్దని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోర్టు సీబీఎస్ఈకి సూచించింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం బుధవారం కేసు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా నీట్-2018 పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ఆధార్‌నెంబర్ తీసుకునే అధికారం సీబీఎస్ఈకి ఇవ్వలేదని యూఐడీఏఐ కోర్టుకు నివేదించింది. అలాగే జమ్మూకాశ్మీర్, మేఘాలయ, అస్సాం రాష్ట్రాల వలే పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీకార్డు, రేషన్‌కార్డు వంటి ఇతర గుర్తింపు కార్డులు విద్యార్థులు ఉపయోగించవచ్చని సీబీఎస్ఈకి సూచించినట్టుగా అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. నీట్ పరీక్షకు ఆధార్ నెంబర్ తప్పనిసరి చేస్తూ తీసుకున్న సీబీఎస్ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్ నమోదయిన నేపథ్యంలో యూఐడీఏఐ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుకు సంబంధించి తొలుత దాఖలు చేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు గత నెల 27న కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

శ్రీధరాయనమ్

ఈశాన్యపు మాణిక్యం పేద ముఖ్యమంత్రి
ఓడాడని ఈనాడున మీటె హాస్యతంత్రి

లేనివాళ్ల బాగుకొరకు అంకితమా నేత
రెండు దశాబ్దాలనడత మచ్చలేని ఘనత
చవకబారు చూపులకు బోధపడనిగీత
చీచీలకు లోనాయెను శ్రీధరేఖ రోత

అపజయాలు విజయాలు లెక్కించని ఆశయం
అరుణారుణమై వెలుగును చైతన్యం అహరహం
ప్రజల తీర్పు గౌరవించి నేర్చుకునే సంస్కారం
వున్నదిలే వలసినంత చెల్లదు ఏ వెటకారం

నవ్వన్నది గొప్పగుణం నవ్వించుట గొప్పతనం
తొవ్వతప్పిపోవడం దుర్భర అవలక్షణం
వేలకోట్లు కాజేసే వంచకులను వదలి
నేలతల్లి బిడ్డలపై కార్టూనిస్టు కాహళి

ఆదర్శాలను చూడని చవకబారు హాస్యం
అనుచితమై ప్రవహించే అసందర&భ లాస్యం

- తెర

ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉన్నాం..

దయచేసి మమ్మల్ని కాపాడండి.. ప్లీజ్

సామాజిక మాధ్యమంలో త్రిపుర యువతి పోస్టు

త్రిపుర అసెంబ్లీ ఫలితాలు వెలువడిన నాటి నుంచి.. హిందూత్వమూకలు చెలరేగిపోతున్నాయి. సీపీఐ(ఎం) కార్యకర్తలను, నాయకులను, ఆ పార్టీకి మద్దతిచ్చిన వారిని లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్నాయి. తమను రక్షించండంటూ ఓ యువతి సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టు రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితులకు అద్దం పడుతున్నది.

'హల్లో.. నేను త్రిపురలోని కోవై ప్రాంతానికి చెందిన యువతిని. నా మామయ్య సీపీఐ(ఎం) కోవై సబ్ డివిజనల్ కమిటీ సభ్యులు. మా కుటుంబసభ్యులంతా కమ్యూనిజానికి, కమ్యూనిస్టు పార్టీకి మద్దతునిస్తాం. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి మమ్మల్ని వేటాడుతున్నారు... వాళ్ళు రైతులను, కూలీలను కొడుతున్నారు. సాధారణ ప్రజలను సైతం వారు హింసిస్తున్నారు. కిరాతకంగా కొడుతున్నారు. పార్టీ నాయకుల కోసం వేటాడుతున్నారు. పార్టీ కార్యాలయాలను, ప్రజాసంఘాల కార్యాలయాలను తగులబెడుతున్నారు. నా మామయ్య తన గది నుంచి కూడా బయటకు రావడం లేదు. నేను మా తల్లిదండ్రులు కూడా బయటకువచ్చే పరిస్థితిలేదు. అల్లర్లు ప్రతి చోట ఉన్నాయి... వాళ్ళు రైతులను, కూలీలను కొడుతున్నారు. నాకు 19 ఏండ్లు. నా ఈ చిన్న జీవితంలో తొలిసారి... ఆదివారం రాత్రి... కంటిమీద కునుకులేకుండా రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉన్నాను. ప్రమాదంలో పడిన నా జీవితం, నా తల్లిదండ్రులు, నా గ్రామస్తులు, పొరుగింటివారి గురించి ఆలోచిస్తూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయపడుతూ ఉన్నాను. కంటిమీద కునుకులేదు. ఇప్పుడు నిత్యావసర వస్తువులు కూడా లేవు. వస్తువులు కొనుక్కోవడానికి... మేము ఇంటి నుండి బయటకు వెళ్లే పరిస్థితిలో లేం. నేను ఏం చెయ్యాలి? దయచేసి మమ్మల్ని కాపాడండి... ప్లీజ్'

సోషల్ లొల్లి

నరేంద్ర మోడీ ప్రభుత్వం



విజయ్ మాల్యా - పరార్
లలిత్ మోడీ - పరార్
సంజయ్ బండారి - పరార్
జతిన్ మెహతా - పరార్
నిరవ్ మోడీ - పరార్
మెహుల్ భాయ్ - పరార్

నా భారత దేశం వెలిగి పోతుంది

సిద్ధాంతాలను కూల్చలేరు

గుజరాత్‌లో ఎస్‌యూసీఐ ఆందోళన

అహ్మదాబాద్ : త్రిపురలో లెనిన్ విగ్రహాల కూల్చివేతకు నిరసనగా (సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా-కమ్యూనిస్టు) ఎస్‌యూసీఐ(సి) కార్యకర్తలు గుజరాత్‌లో నిరసన ప్రదర్శన చేశారు. అహ్మదాబాద్‌లోని కమర్షియల్ హబ్ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు లెనిన్ విగ్రహాల కూల్చివేతను ఖండిస్తూ నినాదాలు చేశారు. విగ్రహాలనైతే కూల్చగలిగారుగానీ, సిద్ధాంతాలను మాత్రం కాదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని రకాల భావజాలానికి స్థానం ఉందన్నారు.

'విగ్రహాలకు రక్షణ కల్పించండి'

చెన్నై: తమిళనాడులో పెరియార్ రామస్వామి విగ్రహం ధ్వంసం అనంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలపై మద్రాస్ హైకోర్టు స్పందించింది. రాష్ట్రంలో ఉన్న 'నాయకులందరి' విగ్రహాలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిపింది. పాఠశాల విద్యార్థుల భద్రత చాలా ముఖ్యమని స్పష్టంచేసింది. 'నిన్న లెనిన్.. తదుపరి లక్ష్యం పెరియార్ విగ్రహాలను ధ్వంసం చేయడమే' అంటూ బీజేపీ నాయకుడు హెచ్.రాజా వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే వేల్లూరు జిల్లాలో కొంతమంది దుండగులు ఇ.వి.ఆర్. రామస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరుతూ.. చెన్నైకి చెందిన న్యాయవాది సూర్యప్రకాశ్ కోర్టులో పిల్ దాఖలు చేశారు.

పెరియార్ విగ్రహాలను తమిళులు కాపాడుకుంటారు : కమల్ హాసన్

పెరియార్ గౌరవాన్ని, ఆయన విగ్రహాలను తమిళులు కాపాడుకుంటారని.. రక్షణ అవసరం లేదని ముక్కల్ నీది మయ్యామ్ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. కావేరి నీటి సమస్యను పక్కదారి పట్టించడానికే బీజేపీ ఈ నాటకమాడుతోందని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బీజేపీ నాయకుడు హెచ్.రాజా వ్యాఖ్యల పట్ల తీవ్రంగా మండిపడ్డారు. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

త్రిపురలో ఆర్ఎస్ఎస్, బీజేపీలు హింసను ఆపాలి

ఆల్ ఇండియా కిసాన్ సభ

న్యూఢిల్లీ: త్రిపురలో ఆర్ఎస్ఎస్, బీజేపీలు చేస్తున్న హింసను ఆపాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కి చెందిన కాషాయమూకలు చేస్తున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా ఖండించింది. అసెంబ్లీ ఫలితాలు వెలువడినప్పటి నుంచి కాషాయమూకల హింసాత్మక దాడులు సహ పార్టీ కార్యకర్తలు, నాయకుల ఇండ్లను, పార్టీల, వివిధ ప్రజాసంఘాల కార్యాలయాలను దోచుకోవడం, తగలబెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకోవడంపట్ల ఆందోళన వ్యక్తం చేసింది. వేర్పాటువాద ఐపీఎఫ్‌టీతో చేతులు కలిపిన హిందూత్వ మూకలు దాడులకు తెగబడుతున్నాయని తెలిపింది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి నైతిక విలువలు లేవని, ప్రజల దృష్టి మరల్చేందుకే త్రిపురలో వామపక్ష కార్యకర్తల పై దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. అమాయక ప్రజల పై అమానవీయ, అప్రజాస్వామిక దాడులను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. బీజేపీ-ఆర్ఎస్ఎస్ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని ఏఐకేఎస్ పిలుపునిచ్చింది

ఐద్వా ఖండన

త్రిపురలో ఆర్ఎస్ఎస్-బీజేపీ కార్యకర్తల దాడులను ఐద్వా ఖండించింది. మహిళలు, పిల్లల పై జరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. రాజకీయ ప్రత్యర్థుల పై హింసను ప్రేరేపించి పరిస్థితిని వారికి అనుకూలంగా మలచుకోవడమే బీజేపీ నైజమని మండిపడింది. త్రిపురలో దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలకు సంఘీభావం తెలిపింది. దాడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో మహిళలందరు పాల్గొనాలని ఐద్వా పిలుపునిచ్చింది

అవకాశవాద రాజకీయాలు

మమత తృతీయ ఫ్రంట్ ప్రయత్నాలపై సీపీఐ(ఎం)

కోల్‌కతా : తృతీయ ఫ్రంట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇచ్చిన ప్రకటన, ట్వీట్లను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎంపి మహ్మద్ సలీం విమర్శించారు. మొదటనుండి తృతీయ ఫ్రంట్ ఆలోచననే అలక్ష్యం చేస్తూ వచ్చిన మమత అందులో ఎలా భాగస్వామి అవుతారని ఆయన ప్రశ్నించారు. వి.పి.సింగ్, ఐ.కె.గుజ్రాల్, దేవెగౌడ హయాంలో తృతీయ ఫ్రంట్ ఆలోచనలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో మమతా బెనర్జీ వాటిని అపహాస్యం చేయడమో లేదా వ్యతిరేకంగా ప్రచారమో చేసేవారని, బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఏదో ఒకటి లేకుండా భారతదేశ రాజకీయాలకు భవిష్యత్ లేదని చెప్పేవారని గుర్తు చేశారు. ఆ సమయాల్లో ఆమె అటు కాంగ్రెస్‌లో వుండడమో లేదా బీజేపీ వైపు వుండడమో జరిగిందన్నారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని తెలిసి తృతీయ ఫ్రంట్‌ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సలీం విమర్శించారు. ఇది పచ్చి అవకాశవాద రాజకీయమని ఆయన పేర్కొన్నారు. లెనిన్ విగ్రహంపై దాడి, ఇతర విగ్రహాలపై దాడులు వంటి చర్యలన్నింటినీ చాలా పకడ్బందీగానే బీజేపీ తెరపైకి తెస్తోందని అన్నారు. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీల కుంభకోణాలు ప్రజల మనస్సులోంచి పోవడానికే ఈ విగ్రహ దాడుల వార్తలు వస్తున్నాయని అన్నారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం ఆ వ్యక్తికి జరిగిన అగౌరవం కాదని, ఆ సిద్ధాంతాలకు సంబంధించిన అంశమని సలీం పేర్కొన్నారు. కార్మిక వర్గం సిద్ధాంతాలను బలవంతంగా పారద్రోలడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించాలని ఆయన పిలుపిచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంత మాత్రమూ విశ్వసనీయమైన మిత్రపక్షం కాదని, ఆ పార్టీ సిద్ధాంతాలు కూడా బీజేపీ సిద్ధాంతాల వంటివేనని సలీం వ్యాఖ్యానించారు.

ఆగని ఎస్ఎస్‌సీ అభ్యర్థుల నిరసనలు

న్యూఢిల్లీ : గత నెలలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పరీక్షలోని ఓ పేపర్ లీకేజీపై అభ్యరులు నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించామని బుధవారం తెలిపిన అనంతరం కూడా వారు ఎస్ఎస్‌సీ కార్యాలయం ముందు నిరసనలు తెలుపుతున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన దీపక్ ప్రజాపతి అనే అభ్యర్థి మాట్లాడుతూ తన తండ్రి ఒక రైతని, ఎస్ఎస్‌సీ కోచింగ్ కోసం తన స్నేహితుల నుండి రుణం తీసుకున్నానని, మూడు సంవత్సరాలు పరీక్షల కోసం సిద్ధమైయ్యానని, కాని కొంత మంది విద్యార్థులు డబ్బును ఉపయోగించి మోసానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న అభ్యర్థుల డిమాండ్లను అంగీకరించామని, సీబీఐ విచారణకు ఆదేశించామని, విద్యార్థులు నిరసనలు ఆపేయాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. కాగా, సీబీఐ దర్యాప్తులో ప్రభుత్వ వ్రాతపూర్వకమైన నిర్ధారణ ఉంటేనే నిరసన విరమిస్తామని అభ్యర్థులు తెలిపారు.

మొక్కవోని దీక్షతో సాగుతున్న

నాసిక్ టు ముంబయి లాంగ్ మార్చ్

ముంబయి : రుణమాఫీ, గిట్టుబాటు ధర, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుతోపాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పాలిత రాష్ట్రం మహారాష్ట్రలో రైతులు మంగళవారం చేపట్టిన 'లాంగ్ మార్చ్' మొక్కవోని దీక్షతో కొనసాగుతోంది. మధ్య నాసిక్‌లోని సీబీఎస్ చౌక్ నుంచి మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఈ యాత్ర రాత్రి వల్దేవి నది సమీపంలో విరామం తీసుకుంది. బుధవారం ఉదయం నుంచి ముంబయి - ఆగ్రా జాతీయ రహదారి మీద గుండా సాగుతున్నది. ఈ నెల 12 వరకూ దాదాపు 180 కిలో మీటర్లు పాదయాత్రగా సాగి అసెంబ్లీని ముట్టడించనున్నారు. ఈ లాంగ్ మార్చ్ అసెంబ్లీ వద్దకు చేరుకునే సరికి పాదయాత్రికుల సంఖ్య లక్షకుపైనే చేరుతుందని భావిస్తున్నారు. మా సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ అసెంబ్లీ ముందు బైఠాయిస్తామని ఈ యాత్రకు నేతృత్వం వహిస్తున్న ఏఐకేఎస్ నేత సునీల్ మలుసరే చెప్పారు. 'సూపర్ హైవే, బుల్లెట్ రైళ్ల వంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కోవడాన్ని ప్రభుత్వం తక్షణమే ఆపాలి' అని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజు దేశ్లే చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. గతేడాది జూన్‌లో ప్రభుత్వం షరతులతో కూడిన రుణమాఫీ ప్రకటించిన తర్వాత కూడా రాష్ట్రంలో 1,753 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావల్లే, స్థానిక సీపీఐ(ఎం) ఏత జెపి గవిట్, ఇతర నేతలు ఈ లాంగ్ మార్చ్‌కు నేతృత్వం



వహిస్తున్నారు. మధ్యవయస్కులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొనడం విశేషం.


'మూడు దశాబ్దాల నుంచి సాగుచేసుకుంటున్న ఆ భూమిని మా పేరిట బదిలీ చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. ఐదెకరాల భూమిని మేం సాగుచేస్తుంటే, 1.5 ఎకరాలకు మాత్రమే జిల్లా అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ చిన్న భూ భాగంలో మేం ఏం వ్యవసాయం చేయగలం? దశాబ్దాలుగా మేం సాగుచేసుకుంటున్న భూమిని మాకు ఇవ్వాలని మేం డిమాండ్ చేస్తున్నాం' అని నాసిక్ జిల్లా ఖెద్గావ్ గ్రామ రైతు బిబిబై కొకటే చెప్పారు.

'ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. పింక్‌బొలో కీటకాలతో ఇటీవల పంటలు మొత్తం నాశనమయ్యాయి. నష్టాల ఊబిలో కూరుకుపోతున్న తమకు ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం' అని పర్భానీ ప్రాంతానికి చెందిన రైతు విలాస్ బబర్ డిమాండ్ చేశారు.

'ఈ డిమాండ్ల సాధన కోసం రెండేండ్ల నుంచి పోరాడుతున్నాం. హామీ ఇస్తున్నారు... గమ్మునుంటున్నారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతీ లేదు. ప్రకటనలు మాకొద్దు... చేతలు కావాలి. 12 నుంచి అసెంబ్లీ ముందు కూర్చుంటాం. మా సమస్యలు పరిష్కారమయ్యేవరకూ అసెంబ్లీని వీడే ప్రసక్తే లేదు' అని కిసాన్ సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిత్ నవాలే స్పష్టం చేశారు.

అంతర్జాతీయం

ట్రంప్ ఆర్థిక సలహాదారు రాజీనామా !



గ్యారీ కోహెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. తాజాగా ట్రంప్ ఆర్థిక సలహాదారు గ్యారీ కోహెన్ రాజీనామా చేశారు. వాణిజ్య విధానాలలో అధ్యక్షుడితో విబేధాల కారణంగా ఆయన పదవి నుంచి తప్పుకున్నట్టు అమెరికా మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇటీవల ట్రంప్ ఉక్కుపై 25శాతం, అల్యూమినియంపై 10శాతం దిగుమతి సుంకాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వైట్‌హౌస్ నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్‌గా ఉన్న గ్యారీ కోహెన్ ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసినట్టు ప్రకటించారు. అయితే, వైట్‌హౌస్ మాత్రం గ్యారీ రాజీనామాకు గల కారణాన్ని వెల్లడించలేదు. ఇక్కడి నుంచి మారిపోవాల్సిన సమయం వచ్చిందని గత కొద్ది రోజులుగా గ్యారీ అధ్యక్షుడితో చర్చలు జరుపుతున్నారని, ఆయన మరికొన్ని వారాల్లో బాధ్యతల నుంచి తప్పుకొంటారని, అయితే ఆయన వైదొలిగే తేదీ నిర్ణయించాల్సి ఉందని వైట్‌హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇటీవల ట్రంప్ బృందం నుంచి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ హోప్ హిక్స్, అంతకుముందు మరో ఉన్నత స్థాయి అధికారి రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే.

'నా ఆర్థిక సలహాదారుగా గ్యారీ చక్కగా పనిచేశారు. మా అజెండాను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా పనిచేశారు. పన్నుల తగ్గింపు, ఇతర సంస్కరణలు చేపట్టేందుకు సహకరించారు. ఆయనకు చాలా అరుదైన ప్రతిభావంతుడు. అమెరికా ప్రజల కోసం కష్టపడి పనిచేశారు' అని ట్రంప్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ట్రంప్ యంత్రాంగంలో మొదటి నుంచి గ్యారీ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్‌గా పనిచేశారు. గ్యారీ పోర్ట్‌ఫోలియోలో.. పన్నులు, మౌలిక వసతులు, ఆర్థిక వ్యవస్థ, ఎనర్జీ, పర్యావరణం, ఆరోగ్య రక్షణ, వ్యవసాయం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, టెలికమ్యూనికేషన్స్, సైబర్ సెక్యూరిటీ ఉన్నాయి. గ్యారీ కోహెన్ గతలంలో గోల్డ్ మెన్ సాచ్స్ బ్యాంక్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. స్వేచ్ఛా వాణిజ్య విధానాల పట్ల అమితమైన ఆసక్తి కనబర్చేవారు.

సముద్రంలోకి కుంగిపోతున్న ఇండోనేషియా తీరం

లక్షలాది మంది ప్రజల ఆందోళన

జకార్తా: ఇండోనేషియా తీర ప్రాంతం క్రమంగా సముద్రంలోకి కుంగిపోతుండటం అక్కడి లక్షలాది మంది ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావంతో సముద్ర తీరంలో ఉన్న రాజధాని జకార్తా నగరంతో సహా అనేక పట్టణాలు, గ్రామాలు సముద్రంలోకి కుంగిపోతున్నాయి. ఇందుకు వాతావరణ మార్పులతో పాటు మానవ కల్పిత పర్యావరణ విధ్వంసం కూడా కారణమని నిపుణులు చెబుతున్నారు. జకార్తా నగరంలో 40 శాతం మేర ఇప్పటికే సముద్రంలోకి కుంగిపోగా తీరం వెంట రక్షణ కోసం ప్రభుత్వం బలమైన గోడను నిర్మించింది. వేలాది దీవుల సముదాయం అయిన ఇండోనేషియాకు దాదాపు 81,000 కి.మీ సముద్ర తీర ప్రాంతం ఉంది. వాతావరణ మార్పులు, పర్యావరణ విధ్వంసంతో ఇది పెను ముప్పును ఎదుర్కొంటోంది. జకార్తా నగర ఉత్తర ప్రాంతంలోని అనేక ప్రాంతాలు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలతో రద్దీగా ఉన్నాయి.



ఇప్పుడు నగరంలోని అనేక ప్రాంతాలో సముద్రంలోకి కుంగిపోతుండటంతో ప్రజలు తమ రక్షణ కోసం ఇసుకబస్తాలను నిల్వ చేసుకోవడం గమనార్హం.

ట్రంప్‌తో అక్రమ సంబంధం

● కాలిఫోర్నియా కోర్టులో దావా వేసిన అమెరికా నటి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై స్టోర్మీ డేనియల్స్ అనే నటి న్యాయ పోరాటానికి సిద్ధమైంది. కాలిఫోర్నియాలోని కోర్టులో ట్రంప్‌పై ఆమె దావా వేసింది. ట్రంప్‌తో తనకు అక్రమ సంబంధముందని ఆరోపించింది. ఈ విషయాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు అధ్యక్ష ఎన్నికల ముందు ట్రంప్ న్యాయవాది తనను బెదిరించాడని పేర్కొన్నది. అక్రమ సంబంధం విషయం బయటకు పొక్కకుండా ఉంచేలా తనతో బలవంతంగా సంతకం చేయించాడని ఆరోపించింది. 2016లో తాను ఓ ఒప్పంద పత్రంపై బలవంతంగా సంతకం చేశానని పేర్కొన్నది. అయితే, స్టోర్మీ చేసిన ఆరోపణలను ట్రంప్ ఖండించారు. మీడియాకు స్టోర్మీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ట్రంప్‌తో అఫైర్‌ను బయటపెట్టకుండా ఉండేందుకు ఆయన న్యాయవాది మైకేల్ కోహెన్ తనకు 1,30,000డాలర్లు చెల్లించారని ఆమె దావాలో పేర్కొన్నది.

మీరున్నా ఏం ఉపయోగం..?

- నియామకాల నోటిఫికేషన్ ఇప్పటికీ ఇవ్వలేదు
- మీ అలసత్వాన్ని సహించం • వీసీల సమావేశంలో డిప్యూటీ సీఎం కడియం ఆక్రోశం
- ఈనెలాఖరులోగా పోస్టులభర్తీకి నోటిఫికేషన్
- జూన్ నాటికి భర్తీ చేయాల్సిందేనని ఆదేశం



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

" వీసీలు ఉన్నప్పటికీ...లేనప్పటి పరిస్థితి ఉంది. ఎలాంటి మార్పులేదు. గతంలో గవర్నర్ సమావేశంలో వీసీలకున్న నిర్ణయాలను ఎందుకు అమలు చేశాం..? ఆయన మళ్లీ సమావేశం పెడితే ఏం చెబుతారు..? గతంలో యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చాం. ఇప్పటి వరకూ దానికి సంబంధించిన ప్రాసెస్ ఎందుకు ప్రారంభించలేదు..? మీ అలసత్వాన్ని సహించే స్థితిలో ప్రభుత్వం లేదు.." అంటూ వైస్‌చాన్స్‌లర్స్(వీసీ)పై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని రూసా కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీసీల తీరుపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో వసతుల కోసం రూ.420 కోట్ల బడ్జెట్ ఇచ్చామని , అందులోనూ ఏడు యూనివర్సిటీలకు మాత్రమే పనులు గుర్తించి, టెండర్లు పిలిచి పనులు అప్పగించామని అన్నారు. కానీ ఇచ్చిన నిధుల్లో 10 శాతం కూడా ఖర్చు చేయలేదని, ఎందుకు చేయలేదో వీసీలు చెప్పాలని కోరారు. లేదా యూజీసీ మార్గదర్శకాలను ముందుకు తీసుకెళ్లి, అధ్యాపకుల నియామక ప్రక్రియను ఆపేశారని, నియామకాలు ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలని ఆదేశించారు. ఓయూలో 400 పోస్టుల భర్తీకి అనుమతించామని, అవి భర్తీ చేస్తే అభ్యర్థులు వీసీ రామచంద్రం ఫొటో ఇంట్లో పెట్టుకుంటున్నారు కదా..? అని అన్నారు. వర్సిటీ వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదనీ, అయినా ఈ అవకాశాన్ని ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదని మండిపడ్డారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల విషయమై అన్ని యూనివర్సిటీల్లో గొడవ జరుగుతున్నాయనీ, ఎలాంటి తప్పు చేయనప్పుడు మెరిట్ లిస్టు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 'ఇంటర్వ్యూల్లో మార్కులు వేసేటప్పుడు ఎందుకు పక్షపాతం వహిస్తున్నారు..? ఎవరన్న అడ్మిషన్లు ఇవ్వమని అడుగుతున్నారా..? నేనయితే అడగడం లేదు కదా..?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా యూనివర్సిటీల్లో ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేయొద్దని చెప్పినా అధికారులు వినడం లేదని కడియం శ్రీహరి అసహనం వ్యక్తం చేశారు.

నెలాఖరులోగా నోటిఫికేషన్: కడియం శ్రీహరి

వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదల చేయాలని వీసీలను ఆదేశించినట్టు డిప్యూటీసీఎం కడియం శ్రీహరి తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ప్రక్రియ కొనసాగించి, జూన్ చివరి నాటికి ఈ నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. కొన్ని పోస్టుల మార్పుల విషయంలో వీసీలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టు చెప్పారు. వీసీల సమావేశం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. 2017-18 సంవత్సరంలో కేటాయించిన రూ.420 కోట్లను ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెలాఖరులోగా పనులు గుర్తించి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. యూనివర్సిటీ కేంద్రాలతో పాటు అనుబంధ కాలేజీల్లోనూ సీసీకెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్సిటీల పరిధిలో వందల ఎకరాల స్థలం ఉందని, ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రహారీగోడలు నిర్మించాలని సూచించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో గందరగోళం లేకుండా చేసేందుకు గానూ కఠిన నిబంధనలు రూపకల్పన చేయాలని, ఆ బాధ్యతను ఉన్నత విద్యామండలికి అప్పగిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, 14 యూనివర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

మహేందర్ కుటుంబానికి న్యాయం జరగపోతే...

ప్రగతి భవన్ ముట్టడిస్తాం : ముత్తినేని వీరయ్య

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఉద్యోగం రాదనే కారణంతో కలత చెంది ఆత్మహత్యకు పాల్పడిన బొమ్మకంటి మహేందర్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య హెచ్చరించారు. వికలాంగు నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుంటే కనీసం పరామర్శించే సమయం కూడా మంత్రులకు లేదని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు జరుగుతుండగానే వికలాంగులు కూడా ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి టీఆర్ఎస్ పాలనలో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 వికలాంగుల హక్కుల చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. వికలాంగుల శాఖలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న మహేందర్ కుటుంబానికి రూ 25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు.

విభజన హామీలను ఎందుకు అడగడం లేదు : పొంగులేటి ప్రశ్న

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని విభజన హామీలను టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఎందుకు అడగడం లేదని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి అనేక సదుపాయాలను ఎందుకు ప్రస్తావించ లేకపోతున్నారని నిలదీశారు.

నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి జరగబోతున్న తరుణంలో గవర్నర్ ప్రసంగానికి, బడ్జెట్‌కూ తుదిరూపు ఇచ్చేందుకు గురువారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశం కాబోతుంది. సాయంత్రం నాలుగు గంటలకు ఈ సమావేశం జరగనుంది. సమావేశాలు ఎన్ని రోజులు జరపాలి, బడ్జెట్ ఏ రోజు ప్రవేశపెట్టాలి, శాఖల వారీగా మంత్రులు సిద్ధం కావడం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం తదితర అంశాలపై సీఎం కేసీఆర్ మంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు.

ఉభయసభలు ఉక్కిరిబిక్కిరి

- హోదా కోసం టీడీపీ, వైసీపీ పోరు

నవతెలంగాణ–న్యూఢిల్లీబ్యూరో

పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళనలతో ఉభయసభలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. వరుసగా మూడో రోజూ ఎలాంటి సభా కార్యక్రమాలు నిర్వహించకుండానే లోక్‌సభ, రాజ్యసభలు గురువారానికి వాయిదా పడ్డాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ఎంపీల పోరు కేంద్రానికి ముచ్చెమటలు పట్టిస్తోంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర ఎంపీలు అటు పార్లమెంట్ లోపల, బయటా తమ డిమాండ్లపై ఆందోళనలను తీవ్రతరం చేశారు. తమ డిమాండ్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకూ పోరాటం కొనసాగుతుందని అన్ని పక్షాలూ స్పష్టం చేశాయి. ప్రధానంగా కావేరీ నదీ నిర్వహణ బోర్డు ఏర్పాటు కోసం తమిళనాడుకు చెందిన అన్ని పక్షాలు ఏకమయ్యాయి. అన్నాడీఎంకే, డీఎంకే, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలకు చెందిన ఎంపీలు లోక్‌సభలో ఐక్యంగా నిరసన గళం వినిపించారు. విపక్షాల ఆందోళనల ఫలితంగా బుధవారం సైతం ఉభయసభల్లో వాయిదాల పర్వం నెలకొంది. ఇక తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద టీఆర్ఎస్ ఎంపీలు బైఠాయించారు.

ప్రారంభమైన నిమిషానికే...

వివిధ అంశాలపై విపక్షాల ఆందోళనతో లోక్‌సభ ప్రారంభమైన నిమిషంలోపే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభానికి ముందే టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే, డీఎంకే, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన ఎంపీలు తమ డిమాండ్లతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. వాయిదా అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ఎంపీలు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభను గురువారానికి వాయిదా వేశారు. ఇదే సమయంలో పీఎన్‌బీ కుంభకోణంపై మోడీ సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు తమ స్థానాల్లో నిల్చోని నినాదాలు చేశారు.

విగ్రహాలు కూల్చడంపై సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్ ఆందోళన

రాజ్యసభ ఉదయం ప్రారంభమైన వెంటనే తమిళనాడులోని పెరియర్ రామస్వామి, త్రిపురలో లెనిన్ విగ్రహాలు కూల్చడంపై సీపీఐ(ఎం) సీనియర్ ఎంపీ టీకే రంగరాజన్ ప్రశ్నించారు. చైర్మనుద్దేశించి మాట్లాడుతూ.. 'సార్, తమిళనాడులో పెరియర్ విగ్రహాన్ని కూల్చారు. త్రిపురలో లెనిన్ విగ్రహం కూలిస్తే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్ సమర్థించారు' అని విమర్శించారు. రంగరాజన్ లేవనెత్తిన అంశానికి కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ మద్దతు పలికారు. ఇది చాలా ముఖ్యమైన అంశమని, చర్చకు అనుమతించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఛైర్మన్ వెంకయ్యనాయుడు స్పందిస్తూ.. విగ్రహాలు కూల్చడం పిచ్చి చర్యగా అభివర్ణించారు. 'తమిళనాడు, బెంగాల్, త్రిపుర ఎక్కడైనా ఈ విగ్రహాలు కూల్చడం పిచ్చి చర్య' అని పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై ఛైర్మన్ ప్రకటన చేస్తున్న సమయంలో వివిధ అంశాలపై విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ తరువాత సభ ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పులేకపోవడంతో సభను డిప్యూటీ ఛైర్మన్ గురువారానికి వాయిదా వేశారు.

పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసన..

తెలంగాణలో రిజర్వేషన్ కోటాను పెంచాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, కవిత, బాల్క సుమన్, మల్లారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వరరెడ్డి, సీతారాంనాయక్, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ టీడీపీ ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వైసీపీ ఎంపీలు ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేశారు. మరాఠీభాషకు శాస్త్రీయహోదా ప్రకటించాలని శివసేన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేపట్టారు. కావేరి నదీ జలాల బోర్డు విషయంపై డీఎంకే, సీపీఐ(ఎం), సీపీఐ ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాలో డీఎంకే ఎంపీ కనిమొళి, తిరుచ్చి శివ, ఆర్ఎస్ భారతితో పాటు సీపీఐ(ఎం) ఎంపీ రంగరాజన్, సీపీఐ ఎంపీ డీ రాజా తదితరులు పాల్గొన్నారు.

మహిళ చరిత్ర అంటే.. శతాబ్దాల తరబడి పురుషులు స్త్రీలపై విశ్వవ్యాప్తంగా కొనసాగించిన అణచివేత.. స్త్రీ చైతన్యం అంటే.. ఆమెకు సమాన హక్కుల్ని తిరిగి అందించడం. - టెన్నిస్ క్లాఫ్లిన్

సంపాదకీయం

మూడవ ఫ్రంట్

జాతీయ స్థాయిలో మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. మంచిదే, మోడీ పాలన ఈ దేశానికి పట్టిన చీడ. రాష్ట్ర పాలకులకే కొంచెం ఆలస్యంగా అర్థమైంది. ధరలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం ఎప్పుడూ లేనంత స్థాయికి పెరిగింది. రైతుల ఆత్మహత్యలూ పెరిగాయి. కార్మికుల హక్కులు హరిస్తున్నారు. ప్రయివేటీకరణ విధానాలు వేగంగా అమలు చేస్తున్నారు. మహిళలమీద లైంగికదాడులు పెరిగాయి. రోజుకో నిర్భయ వార్త వినవల్సి వస్తున్నది. దళితుల మీద దాడులూ పెరిగాయి. ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారు. కాంగ్రెస్ విధానాలే బీజేపీ కూడా అమలు చేస్తున్నది. వీటికి తోడు సమాజంలో అసహనం పెంచి పోషిస్తున్నారు. ఏమి తినాలో, ఏమి మాట్లాడాలో, ఎలాంటి దుస్తులు వేసుకోవాలో కూడా సంఘపరివార్ నిర్ణయిస్తున్నది. ప్రజలను మతపరంగా విభజించి పబ్బం గడుపుకుంటున్నారు. అందుకే మోడీ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారు.

ఎన్నికల విధానంలో సంస్కరణలు చేపట్టాలి. శ్రామికుల హక్కులు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి. నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల కోసం నికరంగా నిలబడాలి. ధరల పెరుగుదలను అదుపు చేయాలి. విధానాలను విస్మరించి, అధికారం గురించి మాత్రమే మాట్లాడటం కాదు. విధానాలతో ముందుకు రావాలి.

70వ దశకంలో బెంగాల్‌లో కాంగ్రెస్ భయానక దాడులతో ప్రారంభించి దేశంలో ఎమర్జెన్సీ నిరంకుశ పాలన ప్రకటించింది. నేడు మోడీ ప్రభుత్వం త్రిపురలో విధ్వంసకర దాడులతో మరో ఎమర్జెన్సీకి, నియంతృత్వ పాలనకు బాటలు వేస్తున్నది. త్రిపురలో దాడులు చేస్తున్న వారంతా నిన్నటిదాకా కాంగ్రెస్ నేతలే! ఇప్పుడు బీజేపీ ముసుగులో, సంఘపరివార్ ఆశీర్వాదంతో దాడులకు తెగబడ్డారు. అందువల్ల కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ పాలనకు భిన్నమైన పాలన అవసరమే. ఈ ప్రయత్నాలు ఫలిస్తాయా? అన్న చర్చ నడుస్తున్నది. ఫలించాలనే కోరుకోవాలి. కానీ, ఈ రెండు పార్టీలకు భిన్నంగా, కేసీఆర్ ఫ్రంట్ చూపించే ప్రత్యామ్నాయ విధానాలేమిటన్నది అసలు ప్రశ్న.



కేవలం బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడిస్తే చాలునని ప్రజలు భావించటం లేదు. వారి జీవితాలలో మార్పు చూపించే విధానాలు కోరుకుంటున్నారు. గతంలో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెసేతర, బీజేపీయేతర సంకీర్ణ ప్రభుత్వాలు కూడా ఆ రెండు పార్టీల ఆర్థిక విధానాలనే అమలు చేసాయి. ఆ అనుభవంతోనే ప్రజలిప్పుడు విధానాలు మారాలని కోరుకుంటున్నారు.

ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని కాదని మోడీ ఏకపక్షంగా పెద్దనోట్లు రద్దు చేశారు. ఆర్థిక వనరులు తమ చేతుల్లో కేంద్రీకరిస్తూ జీఎస్‌టీ ప్రవేశపెట్టారు. సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులు కోత విధించారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసారు. నితిఆయోగ్ పేరుతో రాష్ట్రాలను అడుక్కునేవిగా మార్చారు. బడ్జెట్‌లో కేటాయించిన మేరకు కూడా రాష్ట్రాలకు రావాల్సిన నిధులు విడుదల చేయలేదు. కేంద్రమే నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామంటున్నది. అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరఖండ్, తమిళనాడు వంటి ఎన్నికైన ప్రభుత్వాల మీద దాడులు చేసింది. అన్ని సందర్భాలలోనూ రాష్ట్ర పాలకులు కేంద్ర బీజేపీ సర్కారుతో అంటకాగారు. అందుకే టీఆర్ఎస్ నేతలు చూపించే ప్రత్యామ్నాయం ఏమిటన్నది ప్రజల ప్రశ్న.

ప్రజాస్వామ్యం, లౌకిక విలువల కోసం ప్రాంతీయ పార్టీలు గతంలో గట్టిగానే నిలబడ్డాయి. కానీ ఆర్థిక విధానాల విషయంలో బీజేపీ, కాంగ్రెసుల దారిలోనే నడిచాయి. తర్వాత కాలంలో ప్రాంతీయ పార్టీల నాయకత్వాలలో అవకాశవాదం పెరిగింది. మూడవ ఫ్రంట్ గురించి మాట్లాడుతూనే, అది సాధ్యం కానప్పుడు బీజేపీ కాంగ్రెస్‌లలో ఎవరితో జతకట్టడానికైనా వీరు సిద్ధపడుతున్నారు. అందుకే ఇప్పుడు మూడవ ఫ్రంట్ గురించి మాట్లాడితే... మూడవఫ్రంట్ విధానాలేమిటన్న ప్రశ్న అడగాలి. ప్రజల సమస్యలూ, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు వదిలిపెట్టి పదవుల కోసం పాకులాడటాన్ని ప్రజలు తిరస్కరించాలి. అందుకే.... కేవలం మూడవ ఫ్రంట్ అధికారంలోకి రావటం కాదు. ప్రజల జీవితాలలో వెలుగునింపే విధానాలు కావాలి. సంకీర్ణాలు నిలబడవనీ, సుస్థిర పాలన అందించజాలవనీ ఎద్దేవా చేసే వారి అసలు ఉద్దేశం బీజేపీ లేదా కాంగ్రెస్ చేతుల్లో అధికారం పెట్టాలన్న తాపత్రయమే. సరైన విధానాల ప్రాతిపదికగా ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వాలు నిలబడగలవనీ, సుస్థిరపాలన అందించగలవనీ భారత దేశ అనుభవమే రుజువు చేసింది. వామపక్ష సంకీర్ణ ప్రభుత్వాలే బెంగాల్‌లో 34ఏండ్లు... త్రిపురలో 25ఏండ్లు సుస్థిర పాలన అందించాయి. ఇప్పుడు కేరళలో ఆదర్శ పాలన అందిస్తున్నది.

ఇప్పటివరకు కేంద్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ, అమలు జరిపింది బడాబాబుల ప్రయోజనాలు కాపాడే విధానాలే. ఇప్పుడు కావల్సింది ప్రజల సమస్యలు పరిష్కరించే విధానాలు. రైతుల ఆత్మహత్యలకు పరిష్కారం చూపాలి. ఉపాధి అవకాశాలు పెంచాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నాలను తిరస్కరించాలి. కులవివక్ష, కుల దురహంకారాన్ని అరికట్టాలి. మైనారిటీలకు, బడుగు బలహీన వర్గాలకు భద్రత కల్పించాలి. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ఏకాభిప్రాయ సాధన పేరుతో బీజేపీ, కాంగ్రెస్ నేతల్లాగా కుంటిసాకులు వెతకవద్దు. మహిళలపై లైంగిక దాడులు అరికట్టాలి. ఎన్నికల విధానంలో సంస్కరణలు చేపట్టాలి. శ్రామికుల హక్కులు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి. నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల కోసం నికరంగా నిలబడాలి. ధరల పెరుగుదలను అదుపు చేయాలి. విధానాలను విస్మరించి, అధికారం గురించి మాత్రమే మాట్లాడటం కాదు. విధానాలతో ముందుకు రావాలి.

చరిత్ర తిరగరాయడమే లక్ష్యం!



ఎస్. పుణ్యవతి

చరిత్రలో వర్గ పోరాటాలకు ఎంత గొప్ప స్థానం ఉందో, పోరాటాల్లో మహిళ పాత్రకి కూడా అంతే స్థానం ఉంది. మహిళా లోకం తెగువ చూపకుండా ఏ ఒక్క సామాజిక విప్లవం జయప్రదం కాలేదంటాడు కారల్ మార్క్స్. ఫ్రెంచి విప్లవం మన కండ్ల ఎదుటి సాక్ష్యం. రెక్కాడితే గాని డొక్కాడని పేద శ్రామిక మహిళలు తిరగబడి పోరాడారు. ప్రజల తిరుగుబాట్ల ఫలితంగా రాచరికం కుప్పకూలింది. రాజు తల తెగిపడింది. స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం నినాదాలకు ఫ్రెంచి విప్లవం నాంది పలికింది. అందులో స్త్రీల పాత్ర అమోఘం. అంతకన్నా గొప్పది అక్టోబరు విప్లవం. బానిసల తిరుగుబాట్లతో బానిస యుగం అంతరించింది. ఫ్రెంచి విప్లవంలో భూస్వామ్యం రద్దయి ఆధునిక పెట్టుబడిదారీ యుగం ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ వర్గంతో పాటే కార్మిక వర్గం ఉనికిలోకొచ్చింది. దివాళాతీసిన రైతాంగం, స్త్రీలతో సహా ఫ్యాక్టరీల్లో పనికి కుదిరారు. కార్మిక వర్గ సైన్యంలో చేరారు. ఇక ఈ కష్టాలు పడలేమనీ.. కలిసికట్టుగా ప్రతిఘటించారు. సంఘాలు పెట్టుకొని సంఘటితమయ్యారు.

నాటి సారా ఉద్యమంతో కాంగ్రెసు ప్రభుత్వం గద్దె దిగింది. ఎన్‌టీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇది మొన్నటి కథ. భారత మహిళలు పువ్వులు కాదు నిప్పురవ్వలు, పోరాడతారు. బతుకు మీద దాడిని తిప్పికొడతారు. అధికార పీఠాలనే మార్చగల సత్తా మహిళలకు ఉంది. అదే మార్చి 8 దిశా నిర్దేశం!

పెరుగుతున్న మహిళా కార్మికుల కోసం, వారి పోరాటాలు ఉధృతం చేయడం కోసం సోషలిస్టు మహిళా నేతలు ముందుంటారు. క్లారాజట్కిన్ నేతృత్వంలో 1910లో జమికూడి ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి / మార్చి నెలల్లో ఒక రోజు అన్ని దేశాల్లో మహిళా శ్రామికుల కోర్కెల దినం జరపాలని తీర్మానించారు. కనీస వేతనాలు, పని గంటల తగ్గింపు, ఓటు హక్కు వారి డిమాండ్లుగా ఉన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు కమ్ముకొంటున్న రోజులవి. యుద్ధం వద్దు.. శాంతి కావాలనీ.. డిమాండు చేశారు.


రష్యాలో కూడా కొల్లంతాయ్ నేతృత్వంలో మహిళా ఉద్యమం సాగుతూ వచ్చింది. 1917లో మొదటి ప్రపంచ యుద్ధం సాగుతోంది. చక్రవర్తి నిషిద్ధాజ్ఞలను ధిక్కరించి మహిళలు ప్రదర్శనలు చేశారు. రష్యన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23, కొత్త క్యాలెండర్ ప్రకారం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. వేల సంఖ్యలో మహిళలు వీధుల్లోకొచ్చారు. రొట్టె కోసం దుకాణాలపై దాడులు చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా శాంతిని కోరుతూ 'సైనికులారా! మీ తుపాకులు కింద పడేయండి! మాలో చేరండి' అంటూ పిలుపు నిచ్చారు. సైన్యం కూడా తిరగబడింది. శతాబ్దాల చరిత్ర గల రోమనోవ వంశం కుప్పకూలింది. అదే ఫిబ్రవరి విప్లవంగా రష్యన్ విప్లవ చరిత్రలో నిలిచిపోయింది. అక్టోబరు విప్లవానికి నాంది పలికింది. చరిత్ర పునరావృతమవుతుందా! అన్నట్టుంది ప్రస్తుత పరిస్థితి. నరేంద్రమోడీ ప్రభుత్వ విధానాలు, దాని వెనక నుండి నడిపిస్తున్న ఆర్‌ఎస్ఎస్ భావజాల దాడి మహిళలతో సహా మొత్తం ప్రజలను ఆందోళనలోకి నెడుతోంది. పోరుబాట పట్టేలా చేస్తోంది. ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

ప్రణాళికా సంఘం రద్దు చేశారు. ఆ స్థానంలో నితిఆయోగ్ ప్రతిష్ఠించారు. దాని విష ఫలితాల్లో దళిత, గిరిజన సంక్షేమానికి అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం వంటి స్కీమ్‌లకు కూడా నిధులు తగ్గించేశారు. పేద తల్లులు, పిల్లల నోట్లో మట్టి కొట్టారు. తల్లులు, చెల్లెళ్లు అంటూ ఆకాశానికెత్తుతూనే స్కీమ్ వర్కర్ల చేత చాలీ చాలని జీతాలలో గాడిద చాకిరీ చేయించుకుంటున్నారు. మరో వైపు రైతులను భూముల నుండి వెళ్లగొట్టి లక్షల ఎకరాలు గుంజుకుంటున్నారు. కార్మికులు ఎంత నైపుణ్యం గల వారైనా సరే, కనీస వేతనాలివ్వరు. రాజధాని ఢిల్లీతో సహా ఐదారు వేల రూపాయలకు మించి జీతం లేదు.

మోడీ, ఆయన్ను నడిపే సంఘీయుల సూక్తులు మహాద్భుతంగా ఉంటాయి. ఆడవాళ్లు బయటికొచ్చి పని చేయరాదట! ఇంటి పట్టునే ఉండి భర్తనీ, పిల్లల్ని చూసుకోవాలట. సనాతన ధర్మం చెప్పిందట. మొగుడికి సరిపడు జీతమిచ్చి, భార్యా పిల్లల్ని అపురూపంగా చూసుకోగలిగితే బయటికి పోయి చాకిరీ చేయాల్సిన ఖర్మ, యజమానులు, తోటి కార్మికుల వేధింపులు, అవమానాలు, అఘాయిత్యాలు భరించాల్సిన ఖర్మ ఎవరికి పట్టింది. బ్రాండెక్సు కార్మికురాలు ఏం పాపం చేసిందని? అంటూ జాలి కురిపించారు. అసలు రాజకీయమేమంటే ఆడది అబల అని చెప్పి ఆమె ఆత్మ విశ్వాసాన్ని దెబ్బగొట్టి మరింత తక్కువ కూలి ఇచ్చి, చాకిరీ చేయించుకోవాలనే కుట్ర దీన్లో దాగి ఉంది.

ఇకపోతే గో రక్షణ, దాని వెనకాల చెప్పే శ్రీరంగ నీతులు చూద్దాం. ఒక వైపు గోమాత, గోరక్షణ నినాదాలు, ముస్లింలు, దళితులు ఆవు మాంసం తింటారంటూ సమాజంలో 40శాతం జనాన్ని వెలివేసినంత పని చేసి వాళ్ల మీద దాడులు చేయించేది కేవలం గోమాత మీద ప్రేమ అని ఏ రైతుగానీ, ఏ ఆడ కూతురు గానీ అనుకుంటే అంతకన్నా అమాయకత్వం, వెర్రిబాగులతనం మరొకటి ఉండదు. అసలు కారణమేమంటే మన వ్యవసాయాన్ని దెబ్బకొట్టడం. దివాళా ఎత్తిన రైతుల నుండి భూములను కారు చౌకగా గుంజుకొని పందికొక్కుల్లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టడం.

ఇప్పుడు చూడండి అసలు కథ. మధ్య ప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది. తాజాగా ఒక చట్టం తేవాలని ప్రయత్నిస్తోంది. అదేమంటే, ఆవుల్ని పోషించకుండా ఎవరైనా గాలికి వదిలేస్తే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలనీ, శిక్షించాలని. హర్యానాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాట పట్టింది. మన దేశంలో ఇప్పటికీ 60 నుండి 70శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. వ్యవసాయమంటే స్త్రీలే. అప్పులు పెరిగిపోయి, తీర్చేదారిలేక మనస్తాపంతో తనువు చాలించిన రైతు కుటుంబాల్లో, మహిళలే మొత్తం కుటుంబ భారాన్ని తమ భుజస్కందాలపై మోస్తున్నారు. వ్యవసాయం తరువాత పశుపోషణ అతిపెద్ద ఆదాయ వనరు. వ్యవసాయానికి పనికిరాని, పాలు ఇవ్వని వట్టి పోయిన పశువుల్ని మాంసానికి అమ్మడం ఎక్కడైనా ఆనవాయితీ. వ్యవసాయంలో కుటుంబ పోషణ సాధ్యం కాక, పని దొరకక, ఇప్పటికే స్త్రీలు అసంఘటిత కార్మికుల జాబితాలో చేరిపోయారు. అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నదదే.



గతంతో పోల్చితే వ్యవసాయేతర కార్మికుల సంఖ్య వేతనం మీద ఆధారపడే ఫ్యాక్టరీ కార్మికులు కావచ్చు, ఇండ్లల్లో ఉండి దుస్తులు ఇతర పరిశ్రమల్లో పని చేసే గృహ కార్మికులు కావచ్చు, నిర్మాణరంగం ఇంకా ఇతర సేవా రంగాలలోకి మహిళా కార్మికుల సంఖ్య పెరిగింది. జీడిపప్పు పరిశ్రమ, రొయ్యల పరిశ్రమ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్, గార్మెంటు వంటి పలు రంగాల్లోనూ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా తదితర స్కీమ్ వర్కర్లు, విద్య, వైద్య రంగాల్లో లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరు కాక చింతపండు, అగర్‌బత్తి, జీన్స్ ప్యాంట్లు వంటి గార్మెంట్లలో కూడా లక్ష వరకు ఉన్నారు. ఔషధ తయారీ రంగంలోనూ మహిళా శ్రామికులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. పని కోసమే గావచ్చు, ఒకసారి కార్మికులు ఒక గొడుగుకింద పని చేయడం ప్రారంభించాక సంఘాలు పెట్టుకోక మానరు. పోరాటాల్లోకి దిగక మానరు. తమ బతుకు మీద జరిగే దాడిని తిప్పి కొడతారు. ఆధార్‌కార్డు అనుసంధానం పేరుతో లక్షల సంఖ్యలో రేషను కార్డులను ప్రభుత్వం రద్దు చేసింది. అదేమంటే వేలిముద్రలు పడలేదంటారు. ధరలు పెరుగుతూనే ఉంటాయి. ప్రభుత్వం నుండి సహకారం శూన్యం.

హింస పెరుగుతోంది. 'భారత్ మాతాకీ జై' నినాదం ఇవ్వకుంటే నేరం. కానీ మాతలకీ రక్షణ లేదు. బిడ్డలకీ రక్షణ లేదు. దేశమంతా హోలీ రంగుల్లో మునకలేస్తుంటే రాజధాని ఢిల్లీలో, కాలేజీ విద్యార్థినులపై బెలూన్లలో వీర్యం నింపి ఆడపిల్లలపైకి గురి చూసి కొట్టారు. ఏడవ తరగతి పిల్లవాడు నాల్గవ తరగతి పిల్ల మీద అత్యాచారం చేశాడు. నెలల బిడ్డ మీద లైంగిక దాడి జరిగినా ప్రభుత్వానికి చీమూ నెత్తురూ ఉన్నట్టా, లేనట్టా! ఉన్నదో లేదో తెలియాలి. రాణి పద్మావతి 'సతి మంటల'పై ఉన్న శ్రద్ధ స్త్రీల రక్షణకి ఎందుకు లేదు. మహిళా రిజర్వేషను బిల్లు అటక దిగనంటోందేం!

చరిత్ర పునరావృతమవుతోంది. స్త్రీలు బాధితులు మాత్రమే గాదు. అవసరమైతే చీపురు పుచ్చుకుని చెంగు కుచ్చిళ్లు దోపి తిరగబడగలరు. స్త్రీ అంటే రవివర్మ చిత్రాల్లోని సౌందర్య రాశి మాత్రమే కాదు. బతుకు మీద దాడి జరిగితే దాన్ని తిప్పికొట్టే భద్రకాళి కూడా. అదే జరుగుతోంది.

ఇప్పుడదే జరుగుతోంది. హింసకు వ్యతిరేకంగా వర్నిక కుందు తిరగబడింది. గుర్మెహర్ కౌర్ నిలబడింది. బెనారస్ హిందూ యూనివర్సిటీ అమ్మాయిలు లాఠీ దెబ్బలను కూడా లెక్క చేయలేదు. నేడు రాష్ట్రంలో మహిళలు తిరగబడుతున్నారు. ఆడదాన్ని అంగడి సరుకుగా చిత్రించే రామ్ గోపాల్ వర్మను అరెస్టు చేస్తే గాని శాంతించమని, హింసను అరికట్టాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

బ్రాండిక్సు మహిళా కార్మికులు అంతా ఒక్కటై ఉవ్వెత్తున సంఘటితమయ్యారు. జీతాల కోసం పోరాడారు. వేతనాలు సాధించారు. బెంగుళూరులో వస్త్ర పరిశ్రమ కార్మికులు లక్షల సంఖ్యలో రోడ్లమీదకొచ్చారు. బీజేపీ ప్రభుత్వ మెడలు వంచారు. కార్మికులను దోచుకొనే పెన్షన్ పథకాన్ని తిప్పికొట్టారు. అంగన్‌వాడీ పేరు చెబితేనే పాలకవర్గాలకు పెరపెరలు. లాఠీలు, టియర్‌గ్యాస్‌లు, చివరికి గుర్రాలు, అధికార పార్టీ బెదిరింపులు, లొంగదీతలు... ఏవీ అంగన్‌వాడీ, స్కీమ్ వర్కర్ల మిలిటెన్సీని తగ్గించలేకపోయాయి. ఇది నిన్నటిమాట.

నాటి సారా ఉద్యమంతో కాంగ్రెసు ప్రభుత్వం గద్దె దిగింది. ఎన్‌టీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇది మొన్నటి కథ. భారత మహిళలు పువ్వులు కాదు నిప్పురవ్వలు, పోరాడతారు. బతుకు మీద దాడిని తిప్పికొడతారు. అధికార పీఠాలనే మార్చగల సత్తా మహిళలకు ఉంది. అదే మార్చి 8 దిశా నిర్దేశం! ■

కృతక విమర్శ.. మృతక మాటలు



తోకల రాజేశం

ఒకానొక సిద్ధాంతం గురించి మాట్లాడాలంటే ఆ సిద్ధాంతానికి సంబంధించిన కనీస జ్ఞానం ఉండి తీరాలి. అదే ఒక సిద్ధాంతాన్ని విమర్శించాలంటే దానికిసంబంధించిన పరిపూర్ణమైన జ్ఞానం ఉండాలి. తిట్టాలనుకునే వాళ్లకు ఆ జ్ఞానం ఉండనక్కరలేదు. బహుశా! సిద్ధాంతానికి సంబంధించిన పరిమిత జ్ఞానం కూడా లేనివాడే పుక్కిలించటమే విమర్శ అనుకుంటే అంతకంటే అవివేకం ఉండదు. "మార్క్సిజం ఓ మృతక వ్యవహారం" అంటూ ఒక దినపత్రిక రాసిన పుప్పల నరసింహం వ్యాసం విమర్శకు తిలోదకాలిచ్చి.. మార్క్సిజం మీద ద్వేషాన్ని వెళ్లగక్కింది.

కేవలం మార్క్సిజాన్ని తిట్టడానికే నరసింహం ఈ వ్యాసాన్ని రాసినట్టు స్పష్టంగా అర్థమవుతోంది. ఆయన వ్యాసం నిండా మార్క్సిజం మీద చేసిన చిల్లర మల్లర ఆరోపణలు అనేకం ఉన్నాయి గానీ, ప్రధానంగా మూడు విమర్శలను చర్చ పరిధిలోకి తీసుకోవటం అవసరమనిపించింది. మొదటిది, మార్క్సిజం నూటయాభై ఏండ్ల క్రితందని కాబట్టి ఇప్పుడు దాన్ని అనుసరించటం మూఢవిశ్వాసం. మార్క్స్ మౌలిక విశ్లేషణ అజ్ఞానంలో కూడుకున్నది అనేది రెండవ ఆరోపణ. మూడవది, రష్యా విప్లవ విఫలం. మావోయిస్టుల నేపథ్యంలో మార్క్సిజం మీద విమర్శ. మార్క్సిజం మీది విమర్శలలో ఈ మూడవ విమర్శ పాతదే కానీ మొదటి రెండూ కొత్తవి. వింతైనవి కూడా.

మార్క్స్‌కు ముందున్న తత్వవేత్తలు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు. కానీ మార్క్స్ మాత్రమే ప్రపంచాన్ని మార్చే ఆలోచనా విధానాన్ని అందించగలిగాడు. ప్రజల జీవితాలను రకరకాల కోణాల్లో వ్యాఖ్యానించటం వరకే అప్పటిదాకా వచ్చిన సిద్ధాంతాలు. పరిమితమైతే.. మార్క్సిజం ఆ ప్రజల జీవితాలకు మధ్య గల బేధాలను గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఒక ఆచరణాత్మక కార్యక్రమాన్ని నిర్దేశిస్తుంది. తద్వారా సమసమాజ స్థాపనను సాకారం చేస్తుంది. అయితే వంద, నూటయాభై ఏండ్ల కింద పుట్టింది కాబట్టి మార్క్సిజానికి ఆయువు తీరిపోతుందా? ఏ సిద్ధాంతానికైనా ప్రాసంగికత దానికి గల అధిక వయస్సు వల్ల తగ్గిపోతుందా? తక్కువ వయస్సు వల్ల పెరిగిపోతుందా? సిద్ధాంతం పాతదా.. కొత్తదా? అన్న కోణంలో తప్పిస్తే.. అది చేసే విషయం మీద ఆధారపడి దాని సామర్థ్యాన్ని విలువగట్టటం తప్పవుతుందా? అలా అయితే దాదాపు రెండువేల ఏండ్ల క్రితమే పుట్టినవిగా చెబుతున్న వేదాలను ఈనాటికీ ప్రామాణికమే అని మొత్తుకోవటంలో అర్థం లేదు. వేదాలను విమర్శిస్తున్నవాళ్లు.. వాటిని చదివి, ఈనాటి జీవితాలకు ఉపయోగపడే విషయాలేవీ అందులో లేకపోవటం వల్ల విమర్శిస్తున్నవాళ్లయితే.. అందుకు భిన్నంగా మార్క్సిజాన్ని అవహేళన చేస్తున్నవాళ్లు దానికి చెందిన నాలుగు పేజీలు కూడా చదవనివాళ్లే. నాకో న్యాయం.. నీకో న్యాయం.. అనేవాడు సమసమాజమనే ఆదర్శం కోసం కట్టుబడిన సిద్ధాంతాన్ని ఎలా ఆమోదించగలడు. ప్రపంచ దేశాల్లోని ఆర్థిక దోపిడీని కుల్లం కుల్లం వివరించి చెప్పగలిగే సిద్ధాంతాన్ని.. కాలం చెల్లిందని కండ్లు మూసుకుంటే ఎవరైనా చేయగలిగింది ఏమీలేదు. పురాణకాలంలోనే కండ్లు మూసుకుపోయిన వాళ్లకు ఆధునిక జీవితమూ, పోరాటమూ.. వాటి చలన సూత్రాలు అర్థమయ్యేవి కావు. అలా అర్థం కావాలంటే కండ్లు తెరిచి మార్క్సిజం చదవాల్సిందే. చెరువులోకి దిగకుండా.. దాని లోతు తెలుసుకోకుండా.. తాపీగా ఒడ్డుమీద కూర్చొని డాంబికాలు కొడుతూ.. వారంలోగా అది ఎండిపోవటం ఖాయం అని శకునాలు చెప్పే పనిలేని వానిలాగా.. మార్క్సిజం గురించి మాటమాత్రమైనా తెలియకుండా దాని బలాబలాలను దాని వయస్సుతో కొలిచి చూడాలనుకునే అజ్ఞాన దురహంకారుల వల్ల మార్క్సిజానికి వచ్చే నష్టమేమీ లేదు. ప్రజల మీద దోపిడీ కొనసాగినంత కాలం మార్క్సిజం అక్కడ యుద్ధం చేస్తూనే ఉంటుంది.

ఈ సమాజం మొత్తం శ్రమ చేసేవాళ్లమీద ఆధారపడి జీవిస్తుంది. అయితే ఆ శ్రమ దోపిడీకి గురవుతోంది. భూస్వాములు, పెట్టుబడిదారులు ఏ శ్రమా చేయకుండా శ్రమ జీవుల అదనపు శ్రమని దోచుకొని జీవిస్తున్నారు. కాబట్టి, శ్రమ దోపిడీ నుంచి విముక్తి చెందే దాకా శ్రామికవర్గం పోరాటాలను చెయ్యాలి. శ్రమ దోపిడీ అంతమైన తరువాతనే అంటే దోచుకున్న ఆదాయంతో జీవించే యజమానివర్గం కూడా శ్రమ చెయ్యటం కొనసాగినప్పుడే యజమానీ, శ్రామిక సంబంధాలు అంతమవుతాయి. ప్రతీ మనిషీ శ్రమ చేసే సమాజంలో వర్గ బేధాలు అంతమై మానవ సంబంధాల్లో సమానత్వం ఏర్పడుతుంది. అదే సమ సమాజం అవుతుంది. ఇదీ మార్క్స్ మౌలిక విశ్లేషణ. దీన్ని అజ్ఞానంతో కూడుకున్న విశ్లేషణ అంటున్నారు నరసింహం. మరి సమ సమాజం గురించి ఆయన సొంత విజ్ఞానంతో కూడుకున్న విశ్లేషణ అందిస్తే చదివి తరించాలని ఉంది. ప్రపంచానికి అంతటి మహత్ భాగ్యాన్ని ఎప్పుడు కలిగిస్తారో మరి? మార్క్సిజంలో.. ఇదిగో ఈ లోపాలున్నాయి.. నా అవగాహన మేరకు వీటిని గుర్తించాను. వీటి మీద చర్చ చేయండి అని సవాల్ విసిరినా అర్థం చేసుకోవచ్చు. లేదా పరిమితులేమైనా ఉన్నాయని భావిస్తే వాటిని లేవదీసి చర్చకు అవకాశం కల్పించినా అర్థం చేసుకోవచ్చు. మార్క్సిజం అర్థం కాక, అర్థం చేసుకునే శక్తిలేక అది అజ్ఞానపు సిద్ధాంతమని అరిస్తే.. దాన్ని నరసింహం అజ్ఞానంగానే పాఠకులు అర్థం చేసుకుంటారు.

రష్యా, చైనాల్లో సోషలిస్టు ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. కమ్యూనిస్టు పార్టీలు చేసే తప్పులకు రెండు ప్రధానమైన కారణాలను వివరించారు రంగనాయకమ్మ (మార్క్సిజమే తెలియకపోతే అన్న పుస్తకంలో, పుట:75). అందులో మొదటిది అసలు కమ్యూనిజం అంటే సమాజంలో ఎన్ని రకాల మార్పులు జరగాలో ఎందుకు జరగాలో తెలియకపోవటం. రెండవది, కమ్యూనిస్టు సిద్ధాంతంలో కార్మికవర్గ నియంతృత్వం అనే సూత్రం ఉండాలి. కాబట్టి కమ్యూనిస్టు పార్టీ ఎంత నియంతృత్వంగానైనా ప్రవర్తించవచ్చు. విదేశీ రచయితలు వెళ్లి రాసిందే కానీ. అక్కడ కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చిన సమాచారం వల్ల తెలిసింది కాదని కూడా ఆమె పేర్కొన్నారు. ఆచరణలో భాగంగా జరిగిన తప్పులకు అక్కడ సోషలిజం కుప్పకూలింది. ఆ తప్పులను గుర్తించి.. మనుపటిలాంటి ఉద్యమాలను నిర్మించేటట్టయితే మళ్లీ సోషలిజం పురుడు పోసుకుంటుంది. ఒకదేశంలో సోషలిజం విఫలమైనంత మాత్రాన అది మార్క్సిజం ఓటమి అని అనుకోవటంలో సోషలిజం మీద, మార్క్సిజం మీద అకారణ ద్వేషం కనిపిస్తుంది. 'అందరూ శ్రమ చెయ్యాలని' ఈ సిద్ధాంతాలు చెప్పాయి. వీటిని వ్యతిరేకించే వాళ్ల సిద్ధాంతం ప్రకారం అందరూ శ్రమ చేయకూడదు. కొందరు కూర్చుని తినాలి. శ్రమజీవులు వాళ్లను మేపుతూ ఉండాలి. వీళ్లు తేరగా తిని కూర్చుని.. కర్మ సిద్ధాంతాల కుట్రలు రచిస్తుంటారు. అందరూ సమానమేననటాన్ని వీళ్ల పవిత్ర గ్రంథాలు అంగీకరించవు. అందుకే మార్క్సిజం మీద ఇలాంటి నీచమైన దాడికి పూనుకుంటారు. అది వాళ్ల తత్వం.

మార్క్సిజం మీద మనసులో కోపం పెట్టుకొని.. కేవలం తిట్టాలనుకొని మాత్రమే రాయటం వల్ల విమర్శ మరీ కృతకంగా తయారయింది. మార్క్సిజం గురించి ఆయన ఏదయితే అన్నాడో.. అవే మృతక మాటలు తప్పితే వ్యాసంలో సారమూ, సారాంశమూ శూన్యం.

సెల్: 9676761415

గతం.. వర్తమానం.. భవిష్యత్తూ లెనినే...



ఎం. విప్లవకుమార్


వ్యక్తి స్వతస్సిద్ధ స్వాతంత్ర్య దాత
పతిత నిర్గతిక ప్రపంచ త్రాత
కోటిగొంతులు నిన్ను కోరి రమ్మన్నాయి
కోటి చేతులు నిన్ను కౌగిలిస్తున్నాయి...

అంటూ గర్జించు రష్యా కవితలో లెనిన్ ఆలోచనలతో నిర్మించబడిన రష్యా లాంటి స్వేచ్ఛా పరిపాలన మన దగ్గర ఏర్పడాలని శ్రీశ్రీ కోరుకున్నాడు. వ్యక్తి స్వాతంత్ర్యానికి మానవజాతి పురోగమనానికి లెనిన్ నాయకత్వంలోనే రష్యా సాగింది. ఆ స్వాతంత్ర్యస్ఫూర్తిని ప్రపంచ మానవాళి మొత్తానికి అందించింది. ఆ స్ఫూర్తే భారత స్వాతంత్ర్యోద్యమ ఉద్యమానికి ఇంధనం అవ్వాలని శ్రీశ్రీ ఆకాంక్షించారు. ప్రపంచ ప్రఖ్యాత కవులకు, రచయితలకు, చరిత్రకారులకు లెనినిజం ఒక్క చూపునే కాదు.. మానవాళి విముక్తాక్షరాలకు బలమైన ఊపునిచ్చింది. మాక్సింగోర్కీ, టాల్‌స్టాయ్, పాబ్లోనెరోడా నుంచి మన సినారే, శివారెడ్డి, గోరేటి వెంకన్న వరకూ లెనిన్ భావజాలం ఆలింగనం చేసుకోనిది ఎవరిని? అలాంటి లెనినిజం పునాదులపై సీపీఐ(ఎం) రెండున్నర దశాబ్దాల పాలనతో త్రిపుర లోయల్లో అక్షరాల విత్తులు జల్లి చదువుల మొక్కలను పెంచింది. 94.65 శాతం అక్షరాస్యతతో భావి మేధావులను తయారుచేసుకుంటున్న తరుణంలో కాషాయ వేరుపురుగు అక్రమ పొత్తులతో అంతులేని ధన ప్రవాహంతో గెలిచి ఇన్నేండ్లు నెలకొల్పిన శాంతిని, చైతన్యాన్ని, కార్మికవర్గ స్ఫూర్తి ప్రదాతల విగ్రహాలను బీజేపీవారు కూల్చేస్తున్నారు. భారతీయ తాలిబాన్లలాగా తమకెదురు లేదని ఉన్మాదంతో ఊగిపోతున్నారు. మతపిచ్చి, కమ్యూనిస్టు వ్యతిరేకత, వేర్పాటువాదం, ఉగ్రవాదం నిలువెల్లా జీర్ణమైన దేశద్రోహులు ఈ నాలుగు రోజుల్లోనే 514 మందిపై దాడి చేశారు. బాంబులు వేసి, కత్తులతో నరికి ఇద్దర్ని చంపారు. 1539 ఇండ్లను ధ్వంసం చేసి 196 ఇండ్లను తగులబెట్టారు. 134 సీపీఐ(ఎం) ఆఫీసులను లూటీ చేసి 64 ఆఫీసులకు నిప్పుపెట్టారు. 90 ఆఫీసులను ఆక్రమించుకున్నారు. ఇంకా ఎంత భయంకరమైన పరిస్థితులు సృష్టిస్తున్నారో కళ్యాణి దత్త అనే 19 ఏండ్ల అమ్మాయి ఫేస్‌బుక్ పోస్టింగ్ చూస్తే అర్థమవుతున్నది. 'పార్టీ కుటుంబానికి చెందిన మేము గత రాత్రి నిద్ర అన్నదే ఎరుగం. నాయకుల్ని వేటాడుతున్నారు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవటానికి బయటకు వెళ్లలేని స్థితిలో ఉన్నాం. ఇక్కడ హింసను తట్టుకోలేకపోతున్నాం. రక్షించండి' అని తన పోస్టింగ్ ద్వారా ప్రపంచానికి విన్నవించింది. పైగా దక్షిణ త్రిపుర, బెలోనియా, సబ్రూమ్ పట్టణాల్లోని లెనిన్ విగ్రహాలను జేసీబీతో ధ్వంసం చేయడంతో బీజేపీ తాలిబాన్ చర్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి.

90వ దశకంలోపు విద్య, జ్ఞాపకశక్తి, యవ్వనత్వం సిద్ధించిన వారికి లెనిన్ తెలియకుండా ఉండడు. అక్టోబర్ విప్లవం గురించి వినకుండా ఉండరు. అగ్రకులాల్లో పుట్టాల్సివచ్చినా లెనిన్ తండ్రి చదువుకున్నాడు కాబట్టి ఆ పేరు పెట్టవచ్చు. కానీ, దళిత, రజక కుటుంబాల్లో పుట్టిన మిత్రులకు కూడా ఆ చదువు లేని తండ్రి లెనిన్ పేరే పెట్టాడు. లెనినిజం పునాదులు, విఐ లెనిన్ విప్లవ పదజాలం, విఐ లెనిన్ కార్మికవర్గ అంతర్జాతీయత పుస్తకాలు చదువుతూ పెరిగాం. లెనిన్ నాయకత్వంలో అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో రష్యా ప్రపంచ దేశాల స్వాతంత్ర్య పోరాటాలకు ఆత్మవిశ్వాసం అందించటమే కాదు. సహకారం చేయడం లాంటి విషయాలు వింటూ పెరిగాం.

లెనిన్ కేవలం విగ్రహం కాదు విరగ్గొట్టడానికి. విలువ గట్టలేనంత ఆకాశమంత ఆశయం. విశ్వమంత విశాలమైన భావజాలం. జీవకోటి నోటికాడి కూడు. సమస్త జీవజాలం నిలబడ్డ నేల. ప్రాణాధార నీరు. ప్రాణవాయువు. మానవాళి మనస్సులో మండే మహాజ్వాల లెనిన్.

మాట్లాడుకుంటూ తిరిగాం. ఇప్పటికీ మాసోలియంలో భద్రపరిచిన లెనిన్ దేహాన్ని చూడాలని భారతదేశంలో ఎదురుచూస్తున్న కండ్లు కోట్లల్లోనే ఉంటాయి. సోవియట్ యూనియన్ కూలిపోయినప్పటికీ 2015 తర్వాత పుట్టిన అనేక మందికి, నాకు తెలిసిన



వారి పిల్లలకు కూడా లెనిన్ అని పేరు పెట్టుకున్నారు. మా ఇంట్లోనూ మూడున్నరేండ్ల లెనిన్ ఉన్నాడు అనే ప్రస్తావన లెనిన్ మన దేశంలో, మనలో, బంధానుబంధాల్లో ఎంతగా జీవిస్తున్నాడో అర్థం చేసుకోవాలి. అందుకే.. నా గతం లెనిన్.. వర్తమానం లెనిన్.. భవిష్యత్ లెనినే అని ఈ ఘటనా సందర్భంలో అనేక మంది దృఢంగా, గర్వంగా ప్రకటిస్తున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో నవజవాన్ భారత్‌సభ, హిందూస్థాన్ సోషలిస్టు ఆర్మీ ఏర్పాటుకు సైద్ధాంతిక స్ఫూర్తి లెనిన్. మన యువ విప్లవ వీరుడు, ఇండియన్ యూత్ ఐకాన్ భగత్‌సింగ్‌లో లెనినిజం అణువణువునా నిండి ఉన్నదంటే ఆశ్చర్యం లేదు. ఉరి సిద్ధం చేసి తీసుకెళ్లడానికి జైలు అధికారులు భగత్‌సింగ్ వద్దకు వచ్చినప్పుడు 'ఒక విప్లవకారుడు, మరో విప్లవకారుడితో మాట్లాడుతున్నాడు. రెండు నిమిషాల్లో పూర్తి అవుతుంది. వస్తున్నాను పదండి' అని పంపిస్తాడు. ఆ సమయంలో భగత్‌సింగ్ చదువుతున్నది 'ఏం చేయాలి' అనే లెనిన్ రాసిన పుస్తకం. 1931 నాటికే ఆయన లెనినిజాన్ని ఆమోదించి మరింత అర్థం చేసుకోవడం కోసం చనిపోయే ముందు సైతం అధ్యయనం చేస్తున్నాడన్న ప్రాధాన్యతను మనం గుర్తించాలి.

'లెనిన్ పరదేశంవాడు కాబట్టి ఈ దేశంలో విగ్రహాలు ఎందుకు? అందుకే కూల్చివేస్తున్నారు' అని వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రులు హన్సరాజ్ గంగారం, గిరిరాజ్ సింగ్, ఈ దేశ ప్రజలు ఇంకో విషయం కూడా తెలుసుకోవాలి. 1970లో లెనిన్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రంతో భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. అప్పుడు అధికారంలో ఉన్నది వామపక్షాలు కావు. మరి లెనిన్ భారతీయుడు కానప్పుడు అదెలా విడుదల చేశారు. ఎందుకంటే భారత స్వాతంత్ర్యోద్యమానికే కాదు, బానిసత్వంలో మగ్గుతున్న ప్రపంచ దేశాల ప్రజలకు లెనిన్ ఒక విముక్తి రూపం. విప్లవ దీపం. అరుణారుణ కిరణాల ప్రవాహ మూలం. స్వేచ్ఛలేక యుగయుగాలుగా చెమ్మగిల్లుతున్న జాతుల పోరాట గీతం. వెట్టిచాకిరీ చీకట్లో బందీలు అయిన కార్మిక వర్గానికి ఐక్యత నేర్పించి అడుగులేయించిన తిరుగుబాటు నిర్వచనం. మార్క్స్ స్వప్నించిన మానవాళి విముక్తి సిద్ధాంతాన్ని నేల మీద నడిపించి భూతల స్వర్గాన్ని స్థాపించిన నిర్మాత. స్వేచ్ఛా పిపాస వ్యవసాయ భారతానికి ఆశల నేస్తం లెనిన్. ఆయన అనంతరం భారత, రష్యాలు అన్నదమ్ముల్లా మెలిగారని చరిత్ర తెలియనివాళ్లకు ఎలా అర్థమవుతుంది. దక్షిణాఫ్రికాలోని జోహన్స్‌బర్గ్ గాంధీస్క్వేర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లలో అంబేద్కర్ విగ్రహాలు, అనేక దేశాల్లో బుద్ధుడి విగ్రహాలున్నాయి. మరి ఆ దేశాల్లో మన వారి విగ్రహాలు కూల్చివేయొచ్చా? అది సరిగాదు కదా! అందుకే మనిషి ప్రపంచమంత విశాలంగా ఉండాలి. ప్రకృతంత స్వేచ్ఛగా ఆలోచించాలి. ఈ స్వచ్ఛత లేని వారు కేంద్రమంత్రులవ్వటం మన దేశాన్ని పట్టిపీడిస్తున్న దౌర్భాగ్యం. పంచభూతాలకు సరిహద్దులేనట్టే లెనినిజానికి ఎవరూ హద్దులు, సరిహద్దులు నిర్ణయించజాలరు. లెనిన్.. విగ్రహం కాదురా, కూల్చేస్తే ముక్కలు కావడానికి, లెనిన్ అంటే అట్టడుగు జనంరా, పడిలేచాడా ప్రళయాగ్నిరా.. అని ఇలాంటి విగ్రహాలు కూల్చే ఫాసిస్టులను ఏనాడో హెచ్చరించారు సినారే.

హైందవ ఉన్మాదం తన ప్రభావం లేని చోటల్లా చాపకింది నీరులా తన ప్రయివేటు సైన్యమైన ఆర్ఎస్ఎస్ సేనలను బలగాల వలే మోహరించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నది. విష ప్రచారాలకు, వికృత చేష్టలకు పూనుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ప్రపంచ కార్మిక నాయకుల్ని అవమాన పరుస్తూ, జాతివిద్వేషాలను రెచ్చగొడుతూ ఇండియాను మత రాజ్యం దిశగా నడిపించే ప్రయత్నం చేస్తున్నది. ఈశాన్యంలో తన కుట్రలకు ఎదురులేకుండా పోవటంతో ఆగలేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టులు సృష్టిస్తున్న విధ్వంస కాండ ఒక్క లెనిన్‌తో ఆగలేదు. త్రిపురను దాటి యూపీలోని మీరట్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చారు. బీజేపీ కార్యదర్శి హెచ్.రాజా పిలుపుతో తమిళనాడులోని వేలూరులో పెరియార్ విగ్రహాన్నీ ధ్వంసం చేశారు. పెచ్చుమీరుతున్న ఈ దాడుల పర్వం బీజేపీ విజయాహంకారానికి నిదర్శనం. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి తీవ్ర ప్రమాదం. ఆ చేష్టలు వికృతరూపం దాల్చి దేశాన్ని చుట్టుకొని అరాచకంగా పరిణామం చెంది మన ఇండ్లలో జొరబడక ముందే ప్రజలు మేల్కోవాల్సిన అవసరం ఉంది.

సెల్: 9030546896



ఏదైనా సాధించడం కంటే.. దానికోసం చేసిన పోరాటమే సంతోషాన్నిస్తుంది. కానీ కొన్నిసార్లు ఇది వర్తించదు. మహిళ అధికారి కావడం ఓ పోరాటమే. కానీ తరువాత అధికారిగా సాధికారత సాధించడం చాలా ముఖ్యం. ఉన్నత స్థాయి అధికారులైతే నిత్యం రాజకీయ ఒత్తిళ్లు... మిగిలిన అధికారుల సమన్వయం. ప్రతిరోజూ విధి నిర్వహణ కత్తిమీద సామే. ఆ విద్య బాగా తెలిసిన ఐఏఎస్ ఆఫీసర్ యోగితా రాణా. నిలువెత్తు ఆత్మవిశ్వాసం... ముక్కుసూటిగా మాట్లాడే తత్వం. నమ్మినదానికోసం ఎంతైనా పోరాడే తెగింపు. అందుకే ఎక్కడ పనిచేసినా... తనదైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అత్యుత్తమ అధికారిగా రెండు కేంద్ర ప్రభుత్వ అవార్డులు, రెండు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు ఆమెను వరించాయి. ఏ స్థానంలో ఉన్నా మహిళకే తన ప్రాధాన్యమని చెప్పే ఆమె పరిచయం...

చేసేదే చెప్తా... చెప్పిందే చేస్తా...

ఏదైనా సాధించడానికి ఓ స్ఫూర్తి కావాలి. ఆ స్ఫూర్తి వ్యక్తుల నుంచి వచ్చిందైతే.. ఫలితాలు ఒకలా ఉంటాయి. కానీ ప్రజలే అందుకు స్ఫూర్తి అయితే మార్పు మరోలా ఉంటుంది. అందుకు ఉదాహరణ కలెక్టర్ యోగితా రాణా. అప్పటికే ఆమె పెద్దన్న ఐపీఎస్, వదిన ఐఏఎస్. తండ్రి స్టేట్ సివిల్ సర్వీసెస్‌లో ఉన్నారు. అందుకే వాళ్లమ్మ ముందునుంచే ఆమెను ఐఏఎస్ ఆఫీసర్‌ను చేయాలనుకున్నారు. కానీ కూతురు మెడికల్ ఫీల్డ్ ఇష్టపడుతుంది.. పిల్లలను బలవంత పెట్టొద్దని చెప్పలేదు. అందుకే అటువైపు అడుగులు వేసింది. కానీమెడికల్ కాలేజీలో చదువుతుండగా ఎన్నో సమస్యలు. పారామెడికల్ స్టాఫ్, నర్సులు.. నలుగురైదుగురు అవసరం ఉన్నచోట ఒకరిద్దరు ఉండేవాళ్లు. దాంతో వాళ్ల పని సరిగ్గా చేయలేకపోయేవారు. ఈ విషయమై చాలాసార్లు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. 'ఈ పద్ధతి మారాలి. పేద కుటుంబాల నుంచి రోగులు వస్తారు. వాళ్లకు మంచి చేయాలి' అని. కానీ దాన్ని గ్రీవియెన్స్ పిటీషన్ మాదిరిగానే చూసేవారు. పట్టించుకునేవారు కాదు. ఇక లాభం లేదనుకుని సమ్మెకు దిగారు. వాళ్ల ప్రిన్సిపల్ పట్టించుకోలేదు. కానీ అక్కడికి కమిషనర్ వచ్చారు. వయసులో చాలా చిన్న. కానీ ఆయనకు ఇచ్చే గౌవరం అదీ చూశాక... తానెందుకు సర్వీసెస్ వైపు వెళ్లకూడదని పునరాలోచించారు. కూతురు ఆలోచనకు మద్దతుగా నిలిచారు తల్లి. అలా డాక్టర్ కావాల్సిన ఆమె కలెక్టర్ అయ్యారు.



హైదరాబాద్ ఓ ఎగ్జైట్‌మెంట్...

2003 బ్యాచ్. ట్రైనింగ్ విశాఖపట్నంలో. ఆ తరువాత భద్రాచలం సబ్‌కలెక్టర్‌గా చేశారు. మూడేండ్లు రంపచోడవరం ఐటీడీఏ పీఓగా ఉన్నారు. వాణిజ్య పన్నుల విభాగం డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. తరువాత హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌గా చేశారు. యూఎన్‌డీపీలో మూడున్నరేండ్లు. అటు పిమ్మట నిజామాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు. జాయింట్ కలెక్టర్‌గా చేసిన హైదరాబాద్‌కే... ఆరు నెలల కిందట కలెక్టర్‌గా నియామకం. ఎక్కడ పనిచేసినా పాలనలో తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్‌ను అమితంగా ఇష్టపడతారు. కారణం అంటే... 'కొత్త భాష, కొత్త భోజనం, కొత్త వేషధారణ... కానీ ఎప్పుడూ ఇబ్బంది పడింది లేదు. బయటినుంచి వచ్చానన్న ఫీలింగ్ ఎప్పుడూ ఇక్కడి ప్రజలు రానీయలేదు. ప్రతి ఒక్కరు స్వాగతించారు. కొంచెం తెలుగు మాట్లాడినా చాలా సంతోషపడేవారు. అందుకే హైదరాబాద్ నాకు ఎప్పుడూ ఓ ఎగ్జైట్‌మెంట్ ఇస్తుంది' అని చెబుతారామె.

తల్లిలో మార్పురావాలి..

నేను మహిళగా గాక అధికారిని అనిమాత్రమే గుర్తు పెట్టుకుంటాను. మహిళా అధికారులయితే ఓ సౌలభ్యం ఉంటుంది. మహిళలు తమ సమస్యలను చెప్పుకోవడం సులభమవుతుంది. వారి సమస్యలు అర్థం చేసుకోగలుగుతారు. నా దగ్గరికి ఏదైనా పనిమీద వస్తే... మహిళలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాను. బాలికలు, మహిళలకు చెప్పేదొక్కటే... మీపట్ల మీకు చాలా విశ్వాసం ఉండాలి. అప్పుడే ఏదైనా చేయగలరు. ఇప్పుడు మహిళ లేని రంగం లేదు. చాలా మార్పు వచ్చింది. ఇంకా మార్పు రావాలంటే ప్రతి పాప స్కూల్లో ఉండాలి. ఎడ్యుకేషన్ ఉంటేనే ఆర్థికంగా ఫ్రీ అవుతారు. ఎవరి ముందు చేయి చాచాల్సిన అవసరం ఉండదు. అది తల్లి నుంచే రావాలి అని నమ్ముతాను. పిల్లలకు విశ్వాసాన్ని, సానుకూల దృక్పథాన్ని ఇచ్చేది తల్లులే. తల్లి విశ్వాసంతో ఉండాలి. పాజిటివ్‌గా ఉండాలి. నాయకత్వ లక్షణాలతో ఉండాలి. నిర్భయంగా ఉండాలి. తల్లిలో మార్పు రావాలి. అప్పుడే కూతుళ్లలో మార్పు వస్తుంది.

మరో వృత్తి లేదు...

నీతి, నిజాయితీ, ప్రేరణ, ఆసక్తి, పట్టుదల ఉంటే మహిళలు ఏదైనా చేయగలుగుతారు. నేను ఎక్కడ పనిచేసినా ఒక్కటే అనుకుంటాను. నేను ఇక్కడినుంచి వెళ్లాక ఇక్కడి ప్రజలు నన్ను ఎందుకు గుర్తు పెట్టుకోవాలి? అని ప్రశ్నించుకుంటే సమాధానం దొరుకుతుంది. కేవలం సేవ మాత్రమే కాదు... వెనక్కి చూసుకున్నప్పుడు ఆ పీరియడ్ నాకు సంతృప్తి ఇవ్వాలి. దానికి విజన్ యాక్షన్ ప్లాన్ చేసుకుంటాను. ఇంతగా ప్రజలకు సేవ చేయగలిగిన వృత్తి మరోటి లేదనుకుంటా.

కేసీఆర్ కిట్లలో కీలకపాత్ర...

నిజామాబాద్ కలెక్టర్‌గా సఖి సెంటర్ విజయవంతంగా నడిపారు. రాష్ట్రంలోనే బెస్ట్ రన్నింగ్ సెంటర్‌గా పేరు తెచ్చారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో 'సఖి', 'షి' కమిటీలు ఏర్పాటు చేయించారు. వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్, సెక్సువల్ అబ్యూజ్.. వంటివన్నీ కమిటీల్లోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. చాలాసార్లు ఆ కమిటీ సమావేశాల్లో స్వయంగా పాల్గొన్నారు. రెండేళ్లలో నాలుగు అవార్డులు సొంతం చేసుకొన్నారు. హరితహారంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటి రాష్ట్ర అవార్డు అందుకొన్నారు. ఉపాధి హామీలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించినందుకు జాతీయ స్థాయిలో అవార్డు స్వీకరించారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రవేశపెట్టిన ఈ-నామ్‌ను పకడ్బందీగా అమలు చేసినందుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి జాతీయ స్థాయి అవార్డు ఇచ్చింది. డిచ్‌పల్లిలో అనాథ పిల్లల కోసం మానవత సదన్ ఏర్పాటు చేయడం వల్ల ఇటీవల ప్రభుత్వం ఉత్తమ



పురస్కారాన్ని ప్రకటించింది. ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచి రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు టీకాలు వేయించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పనితీరు మెరుగుదలకు చర్యలు తీసుకొన్నారు. ఇది కొందరికి మింగుడు పడలేదు. అయినా ఆమె ఎవరిని ఖాతరు చేయకుండా తన పని తాను చేసుకుంటు వెళ్లిపోయారు. కేసీఆర్ కిట్ల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు.


బాలికలపై ప్రత్యేక దృష్టి...

హైదరాబాద్‌కు వచ్చాక 240 అంగన్‌వాడీ సెంటర్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' కింద టీచర్స్‌కు 'జాయ్‌ఫుల్ లెర్నింగ్' శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల సంఖ్యను పెంచారు. వాళ్లలో ఎక్కువగా అమ్మాయిలు. 30 లక్షల రూపాయల నిధులతో పదో తరగతి చదువుతున్న పిల్లలకు సాయంత్రం స్కూల్లో స్నాక్స్ అందిస్తున్నారు. 62 మంది ఫీమేల్ పీఈటీ టీచర్స్‌కి జూడో కరాటే, మెనుస్టువ్రల్ హైజీన్, పర్సనల్ హైజీన్ అంశాల్లో శిక్షణ ఇప్పించారు. బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎనిమిది గ్రాముల కంటే తక్కువగా ఉంటే చికిత్స చేయిస్తున్నారు. ఆర్బీఎస్ కింద 3,500 పిల్లలకు ఫుల్ మెడికల్ చెకప్ చేశారు.

విమర్శలను పట్టించుకోలేదు...

ఏ విధి నిర్వహణ అయినా నల్లేరు మీద నడక కాదు. అందులోనూ ఐఏఎస్ ఆఫీసర్ అంటే ఎన్నో ఒడిదుడుకులు. ఒత్తిళ్లు. ఎన్ని ఎదురైనా తను నమ్మినదానికే కట్టుబడి ఉన్నారామె. 'ఈ 15 ఏండ్ల సర్వీస్‌లో చాలా సంతృప్తి ఉంది. కొన్నిసార్లు చేసిన పనికి వందశాతం ఫలితాలు వస్తాయి. కొన్నిసార్లు అలా రాకపోవచ్చు. అందుకే ఫలితాల గురించెప్పుడూ బాధపడను. వందశాతం నా శక్తియుక్తులను ఆ పనికోసం వినియోగించానా, బెస్ట్ ఇవ్వగలిగానా అనేది మాత్రమే చూస్తాను. ఇక రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఎప్పుడూ ఉండేవే. అందుకే చేసేదే చెబుతాను. చెప్పిందే చేస్తాను. 'చూద్దాం.. చేద్దాం' అనను. ఏదైనా ఉంటే.. నా రూల్స్ ప్రకారం చేయగలనా లేదా అని ముక్కుసూటిగా చెప్పేస్తాను. అలా ఉన్నప్పుడు చాలా సమస్యలు వస్తాయి. కానీ విమర్శలను, సమస్యలను ఎప్పుడూ పట్టించుకోలేదు' అంటారామె. ఈ నిబద్ధతకే నేడు మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి మరో అవార్డును అందుకుంటున్నారు.

- కట్ట కవిత



ఆర్టిస్టు ఆశారాధిక

ఇంకా చాలా మారాలి



మహిళలు ఒకవైపు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు దూసుకుపోతున్నారు. పెద్ద పెద్ద పదవులు అధిరోహిస్తున్నారు. మగవాళ్ళతో సమానంగా బాధ్యతలు చూస్తున్నారు. అయితే ఎంతగా అభివృద్ధి చెందుతున్నారో అదేస్థాయిలో దాడులు కూడా జరుగుతున్నాయి. సమానత్వం లేదు. అసలు ఈ దాడులు జరిగినప్పుడు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టి వెంటనే శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే నేరం చేసేవారికి భయం ఉంటుంది. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఎప్పుడో ఆరేడు సంవత్సరాల తర్వాత తీర్పు ఇస్తారు. అది కూడా యావర్జీవ కారాగార శిక్ష వేసి ఊరుకుంటారు. ఇలా కాకుండా కఠినమైన శిక్షలు విధిస్తేనే మహిళలపై జరుగుతున్న దాడులు కాస్తయిన తగ్గుతాయి. అలాగే రాజకీయాల్లో కూడా మహిళల సంఖ్య అందరూ అనుకుంటున్నంత గొప్పగా అయితే లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కొంత మంది ఉన్న మంత్రి వర్గంలో మహిళలకు స్థానం చాలా తక్కువ. మన రాష్ట్రంలో అయితే అసలే లేరు. రాజకీయాల్లోకి వస్తున్న మహిళలు కూడా కుటుంబ నేపథ్యం నుండో, రిజర్వేషన్ ద్వారా వస్తున్నవారే తప్ప స్వతంత్రంగా వస్తున్న వారు చాలా తక్కువ. అందుకే 33 శాతం రిజర్వేషన్ కోసం ఎన్నో ఏండ్ల నుంచి కొట్లాడుతున్న ఇప్పటివరకు అది అమలుకు నోచుకోలేదు. ఇక సాహిత్య రంగంలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ఏదైనా అవార్డు ఇస్తే ముందు మగవాళ్ళకే ప్రాధాన్యం ఉంటుంది. మహిళలను గుర్తించరు. మహిళల్లో ప్రతిభను గుర్తించాలి. కొంత మంది పదువుల్లో ఉన్నా సమానత్వం మాత్రం లేదు. ఇంకా చాలా మార్పు రావల్సి వుంది.

- ముదిగంటి సుజాతారెడ్డి,
ప్రముఖ రచయిత్రి



శ్రామిక మహిళా దినోత్సవం

శ్రామికులు ఉద్యమం చేసి తమ హక్కుల్ని సాధించుకున్నప్పుడు ఉత్సవం చేసుకోవలసిందే. 'మేడే' అయినా ప్రపంచ మహిళా దినోత్సవమయినా, జాతుల విముక్తీ, దేశాల, ప్రాంతాల స్వాతంత్ర సాధన అయినా ఉత్సవకార్యమే. కోపెహేగన్‌లో 117 ఏళ్ళ క్రితం టెక్స్‌టైల్ కర్మాగారంలో పనిచేసే మహిళా కార్మికులు వేలాదిగా పని వేళలూ, వేతనాల వివక్షతకూ, క్రూరత్వానికీ వ్యతిరేకంగా వ్యతిరేకంగా ఊరేగింపు తీసారు. అనేక సదస్సులూ, సమావేశాలూ, ఊరేగింపుల అనంతరం సాధించుకున్న ఈ రోజు శ్రామిక మహిళా రోజు. ఇది త్యాగాల చరిత్ర కలిగినది. చరిత్రను సృష్టిస్తూ లిఖిస్తూ కొనసాగుతూ వస్తున్నది. శ్రమ జీవుల విజయానికీ, పోరాట స్ఫూర్తికీ మైలరాయిగా నిలుస్తూ వస్తున్నది.

మన దేశంలో దీని ప్రాముఖ్యత 1975 దశకం నుండి తెలియవచ్చింది. ఇప్పుడు భారత స్వాతంత్ర్యదినోత్సవు జెండావందనం అంతటి ప్రాచుర్యాన్ని పొందింది. స్వయంగా ప్రభుత్వాలే ఈ రోజున ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. అందువల్ల శ్రామిక స్ఫూర్తీ, మహిళా సాధికార స్ఫూర్తీ పలుచబడింది. మన వ్యవస్థలో అనేక సందర్భాలలో అనేక జనశ్రేణులను సభలకూ, సమావేశాలకూ తరలించిందే కోవలోకి మహిళాదినోత్సవ రోజు కూడా చేరిపోయింది. మొక్కుబడి కార్యక్రమంగా తయారయ్యింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా అణగారిన ప్రజా సమూహాలకు స్వాతంత్ర్య ఫలాలు ఇంకా అందని ద్రాక్షలుగానే ఊరిస్తున్నాయి. పితృస్వామ్య విషవలయంలో యావత్ సమాజం నేరమయంగా మారింది. మనుషుల్లో స్త్రీలూ, పురుషులే కాకుండా మృగాళ్ళ జాతి పుట్టుకొట్టుస్తున్నది. నిజం చెప్పాల్సి వస్తే మార్చి 8 పోరాట స్ఫూర్తి, త్యాగాల సాలు ఛిద్రమయ్యింది. సాంఘిక న్యాయం నేతి బీరకాయలా వెక్కిస్తున్నది. మహిళాలోకం అత్యాచారాల రక్తపు మడుగుల్లో పడి ఘోషిస్తున్నది. చట్ట సభల్లో మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు అంటరాని అగ్గిలా మండుతున్నవి.

ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు పేదరికంలో, అవిద్యలో కూరుకుపోయి ఉన్నారు. మానవ హక్కులను అణిచివేత మాఫియా అపహరించి బంధించింది. రాజకీయ సన్యాసులు పలికే నీతులు, ప్రజలను గోతుల్లోకి తోసేస్తున్నవి. రెండు దశాబ్దాల కాలంలో మన 70 ఏళ్ళ స్వాతంత్ర్యంలో ఎన్నో జాతుల, తెగల, అస్తిత్వాల పోరాటాలు వచ్చాయి. గెలుపుల కన్నా ఓటములే ఎక్కువ. 8 మార్చి మహిళా దినోత్సవానికి కొత్త జవ జీవాలను సమకూర్చి జండర్ జస్టిస్ కోసం సుదీర్ఘ పోరాటానికి మహిళాలోకం సమాయత్తం కావలసి ఉన్నది. ఈ రోజు ఒక సమీక్షా రోజు. మనల్ని మనం పరీక్షించుకొని, సవరించుకొని, కొత్త శక్తులతో కొత్త వ్యూహాలతో మరింత బలంగా ఉద్యమించేందుకు మనల్ని కదిలించే, చైతన్యీకరించే రోజు. ఐక్య ఉద్యమాలు, చరిత్ర స్ఫూర్తీ ఇప్పుడు కావాల్సింది.

రచయితలు గత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు వారధులు. సూర్యుడైనా చూడలేనిది చూడగలిగిన వాళ్ళు. సమాజ నిర్మాణానికి దిశా నిర్దేశం చేయగలిగిన మేధోప్రవాహాలు. సమాజ నిర్మాణానికి కలం సైనికుల్లా, కలం శ్రామికుల్లా తమను తాము నిలబెట్టుకుంటూ పనిచేస్తూ పోవడమే. త్యాగాలైన సమభాగాలైనా అందరివి కావాలి. ఈ సందర్భంగా రచయితలు ఆ లక్ష్యానికి నిబద్ధులు కావాలి. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, హుందాతనంతో జీవించే హక్కుకై ఉద్యమించేందుకు 8 మార్చిని గీటురాయిగా తీసుకుందాం.

- అనిశెట్టి రజిత
ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక



నేడు మనమంతా నిర్వహించుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంగా పిలవబడేది. వివిధ దేశాల్లో ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా దేశాల సంస్కృతిలో ఒక భాగంగా ఉండేది. కాలక్రమేణా అన్ని దినోత్సవాల్లో ఒకటిగా మారి.. ప్రపంచ దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఒక ఈవెంట్‌గా నిర్వహిస్తున్నారు. మహిళలపై అభిమానాన్ని చాటుకోవడానికి ఒక అవకాశంగా ఇది మారింది. 1994లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తిస్తూ.. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా బిల్లును రూపొందించింది.

1996 నుంచి యునైటెడ్ నేషన్స్ ప్రతి ఏడాది ఒక థీమ్‌లో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 22ఏండ్లుగా మహిళా అభ్యున్నతి కోసం, లింగ సమానత్వం కోసం ఎన్నో ప్రణాళికలు రచిస్తున్నారు. ఇవన్నీ అమలు కావాలంటే మహిళలకు రాజ్యాధికారం, నిర్ణయాధికారం కావాలి. ఆ దిశగా పనిచేసినప్పుడే శతాబ్దాల నుంచి కొనసాగుతున్న శ్రామిక మహిళల పోరాటానికి గుర్తింపు.. మహిళల జీవితాల్లో నిజమైన మార్పు వస్తుంది. రాజకీయ, ఆర్థిక, సమాజిక రంగాల్లో సముచిత స్థానం మహళలకు దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా గత 22ఏండ్లుగా యుఎన్ థీమ్‌లను పరిశీలిద్దాం.

సం॥	థీమ్
1996	భవిష్యత్తు ప్రణాళిక
1997	మహిళలు, శాంతి
1998	మహిళలు, మానవ హక్కులు
1999	మహిళలపై హింసలేని ప్రపంచం
2000	శాంతి కొరకు మహిళలను సమన్వయపరచుట
2001	మహిళలు పోరాటాలను నిర్వహించుట
2002	నేటి ఆఫ్ఘన్ మహిళ: వాస్తవాలు, అవకాశాలు
2003	లింగ సమానత్వం, సహస్రాబ్దపు అభివ ద్ధి లక్ష్యాలు
2004	మహిళలు, హెచ్.ఐ.వి / ఎయిడ్స్
2005	లింగ సమానత, భద్రమైన భవిష్యత్తును నిర్మించుట
2006	మహిళలకు నిర్ణయాధికారం
2007	మహిళల, బాలికలపై హింసకు పాల్పడిన వారికి కఠిన శిక్ష
2008	మహిళలు, అమ్మాయిలు ఇన్వెస్టింగ్
2009	మహిళల, అమ్మాయిల పై హింసకు వ్యతిరేకంగా
2010	సమాన హక్కులు, సమాన అవకాశాలు
2011	మహిళలకు సమాన విద్య, శిక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ వినియోగం
2012	గ్రామీణ మహిళా సాధికారత, పేదరికం, ఆకలి నిర్మూలన
2013	మహిళలపై హింసను నివారించుట
2014	మహిళ సమానత్వం, అన్ని రంగాల్లో పురోగతి
2015	మహిళా సాధికారత
2016	2030 నాటికి లింగ సమానత్వం (ప్లానెట్ 50-50)
2017	మారుతున్న ప్రపంచంలో మహిళలు (ప్లానెట్ 50-50)
2018	మహిళల జీవితాల్లో మార్పు కోసం గ్రామీణ, పట్టణ మహిళా కార్యకర్తలు కలిసి పనిచేయాల్సిన అవశ్యకత

మహిళా దినోత్సవ స్ఫూర్తి కొనసాగిద్దాం



ఎం.పద్మశ్రీ

దుర్భర పని పరిస్థితులకు వ్యతిరేకంగా తమ హక్కుల సాధన కోసం మహిళా కార్మికులు చేసిన పోరాటాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నాంది పలికాయి. మహిళల డిమాండ్లను ముందుకు తెస్తూ ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరపాలనే నిర్ణయాన్ని 1910, ఆగస్టు 26న కోపెన్ హెగెన్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సదస్సులో తీసుకున్నారు. అందులో పలు యూనియన్లు, 17 దేశాల సోషలిస్ట్ పార్టీలకు చెందిన వందమంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం జరుపుకోవాలనే ప్రతిపాదనను అంతర్జాతీయ సోషలిస్ట్ మహిళా సంస్థ కార్యదర్శి, ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకురాలు క్లారా జట్కిన్ సదస్సు ముందుకు తెచ్చారు. ఆమె ప్రతిపాదనను సదస్సు ముక్తకంఠంతో ఆమోదించింది. ఆరోజుల్లో ఆస్తి ఉన్న మగవారికే ఓటు హక్కు ఉండేది. దానికి వ్యతిరేకంగా వయోజనులైన స్త్రీ, పురుషులందరికీ ఓటుహక్కు కోసం సదస్సు పిలుపునిచ్చింది. అంతేకాదు మహిళలకు ప్రసూతి సౌకర్యాలు కావాలనీ, రాత్రిపూట పని అనేకమంది శ్రామిక మహిళల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నందున దానిని నిషేధించాలని కూడా సదస్సు తీర్మానించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం తేది మొదట మార్చి 19గా నిర్ణయించారు. 1911, మార్చి 19న జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆస్ట్రేలియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ సహా పలు దేశాల్లో మహిళల నుండి అపూర్వమైన స్పందన లభించింది. మహిళలకు పనిచేసే హక్కు, ఓటుహక్కు, ప్రభుత్వోద్యోగాల్లో చేరేందుకు శిక్షణ ఇవ్వాలని, వివక్షను అంతం చేయాలని ప్రచారం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు జరిగిన ర్యాలీలలో పది లక్షల మందికి పైగా స్త్రీ, పురుషులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేకమంది పురుషులు ఇండ్లలోనే ఉండి పిల్లల్ని చూసుకుంటూ, వారి భార్యలు, గృహిణులు సభలకు వెళ్లారు. 1911 మార్చి 25న అమెరికాలోని ట్రియాంగిల్ గార్మెంట్ కంపెనీలో ఘోర అగ్నిప్రమాదం జరిగి 140 మందికి పైగా మహిళా కార్మికులు మృతిచెందారు. వారిలో అత్యధికులు వలస వచ్చిన యువకార్మికులు. ఇది అమెరికాలోని గార్మెంట్ ఫ్యాక్టరీల్లోని దయనీయమైన, ప్రమాదకరమైన పని పరిస్థితుల్ని బట్టబయలు చేసింది. తరువాత జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు ఈ సంఘటన కేంద్రంగా మారింది.

1917లో రష్యాలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆనాటి ప్రపంచపటం రూపురేఖల్ని మార్చివేసింది. ఈ మహిళా దినోత్సవమే రష్యా విప్లవానికి నాంది పలుకుతుందని నాయకులు సైతం ఊహించలేదు. జార్ చక్రవర్తి అనుమతి లేకుండా, వారి ఆజ్ఞలను ధిక్కరించి ఫ్యాక్టరీ కార్మికులు ఉదయాన్నే రోడ్లమీదకు వచ్చారు. ఏడు రోజులు విప్లవ పోరాటం అనంతరం రష్యా చక్రవర్తిని గద్దె దింపి, సోషలిస్టుల నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం చేసిన మొట్టమొదటి పని మహిళలకు ఓటుహక్కు కల్పించటం. పూర్తిస్థాయి సోషలిస్ట్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సోవియట్ యూనియన్‌లో స్త్రీ సమానత్వాన్ని సమర్థవంతంగా ఆచరణలో పెట్టారు.

భారతదేశంలో మహిళల ఓటుహక్కు ఉద్యమం 1917లో ప్రారంభమైంది. సరోజినీనాయుడు నాయకత్వంలో మహిళా ప్రతినిధుల బృందం 'మాంటెగ్ ఛేమ్స్‌ఫర్డ్' మిషన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ డిమాండ్లను మిషన్ అంగీకరించలేదు. అనంతరం మహిళలు సాధించిన పోరాటాల ఫలితంగా అంతవరకు బొంబాయి ప్రెసిడెన్సీకే పరిమితమైన 1930 మెటర్నటీ బెనిఫిట్ చట్టం జాతీయ స్థాయిలో అమలులోకి వచ్చింది. స్త్రీ పురుష కార్మికుల మధ్య వేతనాల్లో అసమానతలకు వ్యతిరేకంగా కూడా మహిళా కార్మికులు పోరాడారు. అయితే సీఐటీయూ నాయకత్వం అంతర్జాతీయ కార్మిక సంస్థకి ఫిర్యాదు చేసిన తర్వాత మాత్రమే ఐఎల్‌వో వత్తిడితో ప్రభుత్వం సమాన వేతనాలు చెల్లించేందుకు అంగీకరించింది. మహిళల అభ్యున్నతికి చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి మొట్టమొదటిసారి ప్రపంచ మహిళా సదస్సును 1975లో మెక్సికోలో నిర్వహించింది. 1976 నుండి 1985 వరకు మహిళా దశాబ్దంగా జరపాలని ఆ సదస్సులోనే ఐక్య రాజ్య సమితి సిఫారసు చేసింది. మహిళల సమస్యలపై దృష్టి పెట్టేందుకు అన్ని దేశాల్లోనూ ఒక దినోత్సవం జరపాలని 1977లో ఐరాస సర్వసభ్య సభ ఒక తీర్మానం ఆమోదించింది.

ఏ సమస్యల పరిష్కారం కోసం ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు పోరాటాలు చేసి కొన్ని సౌకర్యాలు, చట్టాలు సంపాదించుకున్నారో, హక్కులను సాధించుకున్నారో, ఆ చట్టాలకు, హక్కులకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఈ రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. ప్రజలకు, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా అనేక విధానాలు రూపొందిస్తున్నాయి. కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఫలితంగా మహిళా కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. నేషనల్ శాంపిల్ సర్వే రిపోర్టు ప్రకారం మన దేశంలో 2005 నుండి 2012 వరకు 19.6 మిలియన్ మహిళలు ఉపాధి కోల్పోయారు. 2013లో మహిళా కార్మికశక్తి మన పొరుగు దేశాలైన నేపాల్‌లో 79.9శాతం, చైనాలో 63.9శాతం ఉండగా, మన దేశంలో మాత్రం కేవలం 25శాతం మాత్రమే ఉండటం గమనార్హం. ఇటీవల అది కూడా తగ్గి 23.7శాతానికి పడిపోయింది. ఉపాధి కలిగిన వారిలో కూడా 90శాతం మంది కార్మిక చట్టాలేవీ అమలుకాని అసంఘటితరంగంలో పనిచేస్తున్నారు. వీరిని ప్రభుత్వం కుటుంబం కోసం చేస్తున్న శ్రమను (వంట చెరకు తేవటం, సుదూర ప్రాంతాల నుండి నీళ్ళు మోటయం, పిల్లల ఆలనపాలన మొ॥) సామాజిక ఉత్పత్తిలో భాగంగా లెక్క చేయటం లేదు. ఉద్యోగ భద్రత ఎండమావిగా మారుతోంది. స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు మొ॥ పేర్లతో వీరికి చాలా తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం 2016 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించినా అక్కడే అమలు కావట్లేదు. అన్నిటినీ మించి నేటి మహిళలను తీవ్రంగా వేధిస్తున్న అంశం 'పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు'. వీటిని నిరోధించటానికి 2013లో చట్టం వచ్చినా, ఇతర అన్ని చట్టాల మాదిరిగానే దీని అమలు కూడా నామమాత్రంగా ఉంది. ముఖ్యంగా ఎప్పుడైతే రెండో లేబర్ కమిషన్ సిఫారసుల పేరుతో వాజ్‌పేయి హయాంలోని గత ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టాల్లో మార్పులు తెచ్చారో, అప్పటి నుండి మహిళలు రాత్రిపూట పనిచేయరాదనే నిబంధనలకు నీళ్లొదిలారు. మున్సిపల్, ఆర్టీసీ మహిళా కార్మికుల నుండి సాఫ్ట్‌వేర్ ఉద్యోగినుల వరకు పనిచేసే చోట రక్షణ లేకుండా పోయింది. మరోపక్క మతోన్మాద శక్తులు మహిళలపై దాడిని ఎక్కుపెడుతున్నారు. వారేం చేయాలో, ఏం ధరించాలో చివరికి ఎంతమంది పిల్లల్ని కనాలో కూడా వారే ఆదేశిస్తున్నారు. 'కనీస వేతనం రూ.18,000 కావాలని' కోరుతూ ఇటీవల కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన మహాపడావ్‌లో మహిళలు పెద్దఎత్తున పాల్గొనటమే దానికి నిదర్శనం. లెనిన్ చెప్పినట్టు సమాజంలో సగభాగమైన మహిళలు భాగస్వాములు కానిదే ఏ పోరాటం విజయవంతం కాజాలదు. అందువల్లనే కార్మిక సంఘాలు శ్రామిక మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం చైతన్యపూరితంగా కృషి చేయాలి. సమస్యలకు మూలకారణమైన ప్రభుత్వ విధానాలను, వాటి వెనుకనున్న మోసపూరిత రాజకీయాలను వారికి వివరించాలి. ఇప్పటివరకు ఇంకా సంఘటితం కాని మహిళా కార్మికులను సంఘటితం చేయటం ద్వారా కార్మికోద్యమాలను బలోపేతం చేయాలి. ఆ విధంగానే మనం అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగించాలి. ఇది ఒక వేడుక కాదు విప్లవ లక్ష్యమని ముందు తరాలకు తెలియజేయాలి.

సెల్ : 9490098687

ఎందుకీ మహిళల దినోత్సవం ?



విరాజిత

మహిళ ఒక శక్తి, అవును నిజమే కదా! "మహిళ లేకపోతే సృష్టి లేదు" కానీ మహిళ ఉనికి ఆ మహిళ గర్భం నుండే ప్రారంభం అవుతుంది. బయటికి రావాలా.. వద్ద అని వేల లెక్కలు వేస్తారు. గర్భంలో ఒక మాంసపు ముద్ద దశలోనే ఆమె పూర్తి జీవితాన్ని లెక్క కట్టి చిట్టా పెద్దగా ఉందని గర్భంలోనే చిదిమేస్తున్నారు. అసలు ఆ గర్భాలయం నుండి బయటికి వచ్చినందుకు సంతోషపడాలో, దుఃఖపడాలో అర్థం కావడం లేదు. లెక్కల చిట్టాలు తప్పించుకొని బయటపడితే పసిగుడ్డుగా ఉన్నప్పుడే అయ్యో ఆడపిల్ల ఎలా చేస్తారో ఏమో అని కొందరు, ఎందుకు పుట్టించుకున్నవమ్మ అబార్షన్ చేసుకుంటే పోయేదానికి? ఈ ఆడపిల్లను కని ఎలా పెంచాలి అనుకున్నావని మరికొందరు. ఆమె పుట్టడానికి తాతలు, తండ్రి, అత్త, ఇలా కొందరి అనుమతి తీసుకొని మరికొందరి అనుమతి లేకుండానే బయటికి వచ్చినందుకు, లక్షల నోళ్లు పుట్టగానే పిచ్చి కూతలు కూసి సగం చంపేస్తారు. ఇది ఇప్పటి నుండా! తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. ఈ విషయంపై కేవలం మగవారిపై మాత్రమే నింద వేయడానికి నా మనసు ఒప్పుకోవడం లేదు, ఇందులో అందరి హస్తం ఉంది మరి. ఊహ తెలియని ఆమె పసి దేహాన్ని కోరేవాడిని చూసి ఉలిక్కిపడింది. కన్నవాడే కాటేస్తుంటే నరకకూపంలో ఒదిగింది. ఆడుకోవాల్సిన తనని కామ వాంఛతో కాటేస్తే నిశ్శబ్దంగా పుడమిలోకి ప్రాణాలు విడిచింది. ఇలా ఎందరో ఈ పాడు సమాజంలో నలిగి నలిగి చచ్చిపోతున్నారు. ఓ మహిళా! చావు పరిష్కారం కాదు ఎదిరించు. నువ్వు చస్తే ఆగిపోతుంది అనుకున్నావా? మౌనమో లేదా చావో ఎప్పటికీ పరిష్కారం కాదు. ఒక్కసారి నీ నోరు తెరిచి చూడు. నీచపు వెధవల కామపు కోరలు తెగిపడతాయి. పేరుకే సమన్యాయం. అడుగడుగునా వివక్షే! క్షణం ఒక గండంగా అడుగు వేస్తున్న ఆమె! నడుస్తున్న నెత్తుటి గాయం. బయటికి వస్తే చాలు కొన్ని వేల కామపు చూపుల నుండి తప్పించుకోవాలి. భయంకరమైన స్పర్శల నుండి బయటపడాలి. బహిరంగంగా ఎంతకు వస్తావు అని అడుగుతుంటే? స్త్రీ అంటే ఒక శృంగార బొమ్మ అయిపోయింది. మౌనంగా భరిస్తే ఈరోజు నీవు! రేపు నీ కూతురు, నీ మౌనం సమస్త స్త్రీ జాతి ఉనికికే ప్రమాదం.

ఎన్ని దేశాలైన, ఎక్కడైనా ఆమె దుస్థితి అంతే, ఒక అడుగు వెనకే ఉండాలి మరి. ఆమె వస్త్రధారణ ఒక చర్చే, ఆమె కట్టు బొట్టుపై ఎన్నో పుస్తకాలు. ఆమెను అడుగడుగునా అడ్డగించే ప్రయత్నం. పైగా మహిళకు శృంగార వాంఛ ఎక్కువని పిచ్చి ప్రేలాపనలు. మగాడికి శృంగారమే ఇష్టం లేదన్నట్టు.

అసలు స్త్రీ ఇలా ఉండాలని ఇన్ని వేల పుస్తకాలూ ఎందుకు వచ్చాయి. ఎక్కడ ఎదిగిపోతుందో! ఆమెను ఎప్పుడూ ఒక బానిసలాగే చూడాలి, అలానే ఉండాలి. లేకుంటే మనకు సేవ ఎవరు చేస్తారు? అన్నింటికీ ముఖ్యంగా ఇంటికి పెద్ద పని మనిషి కావాలి కదా మరి! స్త్రీ కమ్మలు పెట్టుకోవాలి, గజ్జెలు వేసుకోవాలి, బొట్టు పెట్టుకోవాలి. ఇలా ఒక్కటా రెండా అడుగడుగునా కట్టిపడేశారు పూర్వం. నేడు నెమ్మదిగా ఆ సంకెళ్ళు తెంచుకుంటున్నారు. ఇంకా మారాలి. స్త్రీ తనకు ఇష్టం వచ్చినట్టు ఉండకూడదు. ప్రతి విషయంలోనూ మగాడి అభిప్రాయంపై ఆధారపడాలి, అసలు ప్రతి మగాడి వెనుక స్త్రీ అనే మాట మారాలి. ఎందుకు ఉండాలి వెనుకే? ఇప్పుడు అట్లా కుదరదు. అన్నింటిలోనూ మహిళను వెనుకకు నెట్టేస్తున్నారు. మళ్లీ స్త్రీ విజయం వెనుక మగాడు ఉన్నాడు అని పనికిమాలిన మాటలు వద్దు. నేను కష్టపడ్డాను విజయం సాధిస్తున్నా. అసలు నీ అనుమతి దేనికి? వీలైతే సహకరించు లేదంటే పక్కకు జరిగి వెళ్లిపో. స్త్రీకి ప్రకృతి సహజంగా వచ్చే బహిస్టును సైతం అదేదో తప్పు అని మూలన కుర్చోపెడతారా? గుర్తించుకో నీవు మైలా అంటున్నావు కదా! అందులో నుండే నీ జననం జరిగింది. అసలు మనం లొంగిపోకుంటే ఈ దుస్థితి ఎందుకు వస్తుంది? మొదటిసారే ఎదిరించి ఉంటే వాళ్లకు అలాంటి ఆలోచనలే వచ్చేవి కాదు. శారీరకంగా ప్రకృతి సహజంగా నీకన్నా తను కాస్త పుష్టి అంతే, అది నీవు కూడా అనుకుంటే సాధించవచ్చు. ఏ విషయంలోనూ తను నీకన్నా తక్కువ కాదు. సమాన హక్కులు, వేతనాలు కావాలని ఉద్యమించడంతో ఈ మహిళా దినోత్సవం వచ్చింది కానీ దాదాపు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా ఈ మహిళా దినోత్సవం ఆ హక్కులు పొందిందా? మరి ఈ దినోత్సవం ఆనందంతో కాదు ఆగ్రహంతో, పట్టుదలతో చేసుకోవాలి. ఎన్నో చట్టాలు, రాజ్యాంగాన్ని ఎన్ని సార్లు కుట్లు వేసినా మన పరిస్థితిలో మార్పు రావడం లేదు. మరి లోపం ఎక్కడ? మనకు మనమే. నిన్ను నీవు తక్కువ చేసుకున్నంత సేపు ఏది సాధించలేవు.

సెల్ : 9700747280

అదే అసలైన మహిళా దినోత్సవం...



దుర్గం వెన్నెల

మత గ్రంథాలు మహిళా హక్కులను కాలరాసి వంటింటి కుందేలుగా, భర్త కింద బానిసగా, ఆలోచించడానికి, మాట్లాడడానికి పనికి రాని వస్తువుగా పరిగణించే కాలంలో వీర పోరాటాలు స్త్రీలకు కనీస హక్కులను కల్పించాయి. ఈ సృష్టి నిర్మాణంలో, మనుగడలో, అత్యధిక ప్రాముఖ్యత స్త్రీది. స్త్రీని ఎల్లప్పుడూ గౌరవించడం ప్రతీ భారతీయుడి బాధ్యత. తరాల నుండి ఒకే రోజు స్త్రీ కోసం కేటాయించబడింది. తరాలు మారుతున్నా స్త్రీ అభివృద్ధిని కాంక్షించే నిమిషం అటుంచి, అసలు స్త్రీలపై దాడులు జరగకుండా ఆపలేకపోతుంది దేశం. కనీసం స్త్రీకి గౌరవం ఇవ్వడం కూడా కరువే. ఖగోళాలను శాసించే స్థాయికి ఎదుగుతున్నా ఈ నాటికీ స్త్రీకి సమానత్వం లేదు. రోజురోజుకూ అత్యాచారాల సంఖ్య ఆకాశాన్ని తాకుతుంది. నిర్భయ చట్టం ఎన్ని చోట్ల అమలు చేయబడుతుందో ఆనవాళ్లైనా లేవు. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా వాస్తవంగా మనది పురుషాధిక్య సమాజమే. ఎన్ని చట్టాలు వచ్చినా అవి కాగితాలకే పరిమితమై పోతున్నాయి. కొందరికి ఆ వివక్ష గురించి తెలిసినా తెలియనట్లే ఉంటున్నారు. స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకెక్కడిదీ వివక్ష అని కొందరి వాదన. మొత్తం స్త్రీ జనాభాలో ఎంతమంది ఉద్యోగం చేస్తున్నారు? ఎక్కడో ఒక చోట ఒక అమ్మాయికి ఉద్యోగం రాగానే ఆడ పిల్లలు బాగా ఎదిగిపోతున్నారు అనేస్తారు. ఒక అమ్మాయి పైలెట్ అయితే "ఆడదంటే మంచిగా ఇంటి పట్టున ఉంటూ భర్తకు వండి పెట్టుకుంటూ ఉండాలే గానీ ఈ విమానాలెక్కుడేంది?" అన్నాడు ఒకతను... అలాంటి అనాగరిక స్థితిలో ఉంది సమాజం.

భారతదేశానికి మొదటి సారిగా మహిళా కుస్తీ పోటీలలో బంగారు పతకం సాధించిన మహిళ గీతా కుమారి పోగాట్ గురించి ఈ మధ్య కాలంలో ఒక సినిమా వచ్చింది. ఆమె జీవితం తన ఆశయానికి తన తండ్రి తోడు, ఇవన్నీ స్పష్టంగా చూపించారు అందులో... అది చూస్తూ అక్షరాస్యుడైన ఒక తండ్రి "ఆడ పిల్లలకు ఈ కుస్తీ పోటీలేంది. ఏదో బతుకుదెరువుకు చిన్న ఉద్యోగాలు చేసుకోవాలి గానీ.." అన్నాడు. ఆ మాట విని నేను చాలా ఆశ్చర్యపోయాను. భారత దేశానికి మొదటి సారిగా బంగారు పతకం సాధించినందుకు అభినందనలు తెలుపకపోయినా ఫర్వాలేదు. సత్తా ఉన్న వాళ్లని కూడా సాధించాలనే తపనే కలగకుండా చేస్తాయి ఈ మాటలు. అడుగడుగునా అంతరాని అవమానాలను, ఆడపిల్ల అనే అడ్డంకులను ఎదుర్కొని మాలావత్ పూర్ణ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి తన ప్రతిభ చాటింది. ఆమెకు ఎన్ని అభినందనలు దక్కాయి? ఒక అమ్మాయి గట్టిగా నవ్వితేనే "ఏంటి ఆ నవ్వు మొగరాయుడిలా" అంటారు. అదే ఒక అబ్బాయి ఏడిస్తే "ఎంట్రా ఆడపిల్లలా ఏడుస్తున్నావ్?" అంటారు. అంటే ఏడవడం ఆడపిల్ల పని. ఏదైనా చేయగలగడం మగవాడి పని. అమ్మాయిలను ఎంత చదివించినా నిబంధనలతోనే. కొడుకు చదువు వాడి ఇష్టం. కానీ అమ్మాయి అలా కాదు. డిగ్రీ అయ్యాక పెండ్లి చేసుకోవాలి, పీజీ అయ్యాక పెండ్లి చేసుకోవాలి. నలుగురి సమావేశంలో తన అభిప్రాయం చెప్పాలన్నా ఆంక్షే. ఆడపిల్ల అణిగిమణిగి ఉండాలి, మగాడు విచ్చలవిడిగా ఉండొచ్చు. ఆడపిల్ల ఎదిగే దశలలోనే సమాజం, కుటుంబం నూరిపోస్తుంది. "అమ్మా గుర్తుంచుకో! నువ్వు ఆడపిల్లవి" అని. అమ్మాయిపై అత్యాచారం చేసి కూడా దర్జాగా బతుకుతున్నారు. సమాజం అనే మాటలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నారు ఆడపిల్లలు. అలా సమాజం తయారైంది. స్త్రీ పురుషులు సమానమని ఉపన్యాసాలు ఇస్తారు కానీ కనీసం వేదిక మీద అలా మాట్లాడే వారు కూడా వాళ్ల కూతురినీ కొడుకునీ సమానంగా చూస్తారనే గ్యారెంటీ లేదు. నేను రాసింది చదువుతూ కూడా కొంతమంది స్త్రీ వివక్ష లేదు అని వాదించే వాళ్లున్నారు. అలాంటి వారు ఆడపిల్లగా పుడితే తప్ప ఆ చులకన భావం ఎంత బలీయమైనదనే విషయాన్ని అర్థం చేసుకోలేరు. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీలు కొందరైనా అనుకున్న గమ్యాలను చేరుకోగలుగుతున్నారంటే దానికి కారణం నిస్సందేహంగా సమాజంలో జరుగుతున్న పోరాటాలే. మహిళా దినోత్సవం గురించి పట్టణాల్లోని స్త్రీలకు తప్ప పల్లెటూర్లో ఉన్న స్త్రీలకు కనీసం అర్థం కూడా తెలియదు. ఈ రోజు కేవలం శుభాకాంక్షలు చెప్పుకోవడానికేనేమో అనిపిస్తుంది. ప్రతీ రోజు గౌరవంగా చూడాల్సిన స్త్రీని, ఆమె త్యాగాలను కేవలం ఒక్క రోజు జ్ఞాపకం చేసుకొని తెల్లవారగానే చేతులు దులుపుకోవడానికేనేమో. ఈ రోజు ఎన్నో ఉపన్యాసాలు, ప్రసంగాలు మన చెవిన పడతాయే తప్ప, అత్యాచారాలు, యాసిడు దాడులు చేయాలనుకున్న వారి కోరికను కూడా ఈ రోజు రేపటికి వాయిదా వేయలేదు. సంస్కృతి సంప్రదాయాల పేరుతో స్త్రీ వివక్ష అమలులో ఎంతోమంది ఆడపిల్లల కన్నీళ్లు లోకం కంటికి కనబడకుండానే సమాధి అవుతున్నాయి. మహిళా దినోత్సవం నగరంలోని మహిళలకు ఉపన్యాసాల విందునిస్తుందేగానీ పట్టణాల చివరి ఆడ బతుకులకు మహిళా దినోత్సవం అంటే ఏమిటో కూడా తెలియదు. మహిళా దినోత్సవం సంబరాలకు కాకుండా, సగటు మహిళ బతుకును మార్చగలిగే రోజు రావాలి. అదే నిజమైన మహిళా దినోత్సవం. అందుకే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల విముక్తి కోసం పోరాడాల్సిన ప్రాధాన్యతను ప్రజలు గుర్తించే విధంగా ప్రయత్నించాలి. ముఖ్యంగా మహిళలను చైతన్యపరచాలి.

సెల్.8008861369

అరుదైన కమ్యూనిస్టు

అనేక ఆటుపోట్లు, స్తబ్దత, రాజ్యహింసల మధ్య విప్లవోద్యమం ప్రయాణిస్తున్నది. ఇలాంటి సమయంలోనే తగినంత విప్లవస్ఫూర్తి ఇవ్వగలిగిన, అరుదైన రాజకీయ దిశా నిర్దేశకులు విప్లవోద్యమానికి కావాలి. హిందూత్వశక్తులు, ఫాసిస్టు ప్రమాదకర, నిరంకుశత్వ పోకడలతో ముందుకు వస్తున్న నేటి కాలంలో కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోష్ (రవన్న) వంటి విప్లవస్ఫూర్తి దాతల అవసరం చాలా వున్నది. రవన్న మన మధ్య లేకపోవడం ఉద్యమాలకు చాలా లోటు. రవన్న మనలను విడిచివెళ్లి అప్పుడే రెండు సంవత్సరాలు గడిచిపోయింది. 9-3-2016న రాత్రి 7గం॥ సమయంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. విప్లవ పార్టీలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, కాల క్రమంలో ఆయన కేంద్రకమిటీ అగ్రనాయకుడుగా ఎదిగారు. పోరాట జీవితంలో ఎన్ని బాధ్యతలు ఇచ్చినా, వాటన్నింటినీ సమర్థవంతంగా నిర్వహించారు. అర్థశతాబ్దపు రాజకీయ జీవితంలో 48 ఏండ్లపాటు రహస్య జీవితం గడిపారు. చివరకు విప్లవోద్యమ కార్యాచరణలోనే తుదిశ్వాస విడిచారు.



ఆవుల అశోక్



రెడ్ విలేజ్‌గా పేరొందిన ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం, పిండిప్రోలు గ్రామంలో 6-1-1948న జన్మించారు. వీరి కుటుంబం వీర తెలంగాణ సాయుధపోరాటం క్షేత్రంలో పాల్గొన్నది. వారి వారసత్వంలో కమ్యూనిస్టు భావాలూ, త్యాగాలూ అలవర్చుకున్నారు. చిన్ననాటి పునాదితో చివరిదాకా కమ్యూనిస్టు విలువలూ, ఉక్కు క్రమశిక్షణా, త్యాగ నిరతిలోనే వున్నారు. ఆర్భాటాలు అసలే వుండేవి కావు. భేషజాలు మచ్చుకైనా కనిపించవు. ఆయన ఎంతో సౌమ్యంగా, నమ్రతతో హుందాతనంతో వుండేవారు. ఏ అంశాన్నైనా లోతుగా విస్తృతంగా చదివేవారు. మంచి పుస్తకాలనూ, వ్యాసాలనూ పదిమందికి చెప్పి మరీ చదివించేవారు. చదివించడం, రచయితలుగా అభివృద్ధి చేయడం మహా ఇష్టం. ఆయన తోటి వారితో వ్యవహరించేటప్పుడు పిల్లలనైనా, పెద్దలనైనా ఒకేరీతిగా గౌరవించేవారు. కార్యకర్తల పట్ల ఎనలేని ఆప్యాయతా, ప్రేమానురాగాలను ప్రదర్శించేవారు. విభేదించే కామ్రేడ్స్ పట్ల కూడా చాలా ప్రేమను ప్రదర్శించేవారు. కార్యకర్తల కుటుంబాలలో ఆయన ఒక పెద్దగా వ్యవహరించే వారు. తనతోపాటు తన కుటుంబం మొత్తాన్నీ విప్లవోద్యమ నిర్మాణంలో, పోరాటంలో భాగంగా మార్చాడు. రహస్య జీవితంలో టెక్ జాగ్రత్తలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. సుదీర్ఘ అజ్ఞాత జీవితంలో ఏనాడూ రాజ్యానికి దొరకలేదు. విద్వేషం, సంకుచితత్వాలకు అతీతంగా విశాల దృక్పథంతో వ్యవహరించేవాడు. ఆయనను కలిసిన ప్రతీసారీ బుర్రనిండా జ్ఞానాన్నీ, గుండె నిండా ధైర్యాన్నీ నింపేవారు.

గోదావరిలోయ నేల మీద నిలబడి ఆదివాసీ బిడ్డలకు పోడు భూముల కోసం పోరు నడిపినారు. ఖమ్మం, వరంగల్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో లక్షలాది ఎకరాల పోడు భూముల సాధనలో ఆయన పాత్ర కీలకమైనది. గోదావరి లోయంతా కలియ తిరిగిన జాడలూ నేటికీ గుర్తుకు వస్తాయి. భూమి విషయంతోపాటు, ఇతర సమస్యలను పరిష్కరించడం కోసం ఆదివాసీలను సమీకరించి, చైతన్యవంతం చేయడంలో ఎనలేని కృషిచేశారు. దళితులు, కర్షకులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తదితర పేదలను ఉద్యమాలలోకి సమీకరించడంలో రవన్నది చాలా ముఖ్యమైన పాత్ర. తెలుగునాట ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన ఉద్యమాలకు మార్గదర్శకత్వం వహించారు. అనేక పోరాటాల, ప్రజాస్వామిక, మానవ హక్కుల ఉద్యమాలకు మార్గదర్శకం వహించారు.

మార్క్సిజం, లెనినిజం, మావోఆలోచనా విధానాన్ని అన్వయించడంలో జరుగుతున్న లోటుపాట్లనూ, ఇబ్బందులనూ, ఆటంకాలను అధిగమించేందుకు దృఢంగా సంఘర్షించేవారు. మితవాద అవకాశవాదాన్నీ, అతివాద, టెర్రరిస్టు విధానాలనూ తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజలను విప్లవానికి సన్నద్ధం చేయడానికి ప్రతిఘటనా పోరాట ఆవశ్యకతను నొక్కిచెప్పాడు. ప్రతిఘటనా పోరాటాల నిర్మాణం కోసం జీవితాంతం అవిశ్రాంతంగా కృషిచేశారు. వర్గపోరాట ఉధృతి తప్పక జరుగుతుందని అచంచలమైన విశ్వాసంలో వున్నారు.

నేడు ప్రజాస్వామిక హక్కులపై దాడి జరుగుతోంది. లౌకిక విలువలు పాతర వేయడానికి కా షా ం ం వ ా క ల ం ప్రయత్నిస్తున్నాయి. విదేశాలలో వున్న నల్లధనాన్ని దేశానికి తరలిస్తానన్న మోడీ తరలించకపోగా, బ్యాంకులలో గల ప్రజల సొత్తు కొల్లగొట్టిన దొంగలను విదేశాలకు పలాయనం చేయిస్తున్నారు. మరోపక్క కనీస వేతనాలు, హక్కులు లేక అసంఘటిత కార్మికులు అర్ధాకలితో బతుకీడుస్తున్నారు. ఎంత పంట పండినా, అప్పుల భారంలో కూరుకుపోయే దుస్థితిలో అన్నదాతలు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. మహిళలు, నేటికీ ద్వితీయ శ్రేణి పౌరులుగానే అణచివేయబడుతున్నారు. ఇలాంటి పరిస్థితులకు వ్యతిరేకంగా రవన్నను స్ఫూర్తిగా తీసుకొని బలమైన విప్లవ పోరాటాలు నిర్మించేందుకు కృషిచేయాలి. పేదరికం, దారిద్ర్యం, అసమానతలూ, కులం, మతం, సకల జాడ్యాలు పారదోలే మహోన్నతమైన సమ సమాజమే లక్ష్యంగా సాగే పోరాటాలను విజయవంతం చేయడంలోనే అమరత్వం పొందిన విప్లవకారులకూ, రవన్నకూ మనం అర్పించే నిజమైన నివాళి. అందుకు మనందరం మరింత పట్టుదలతో ఉద్యమించాలి. విప్లవ పురోభివృద్ధికీ, పురోగమనానికీ, రవన్న మరణంతో కలిగించిన లోటును భర్తీ చేసుకునేందుకు ఉద్యమించాలి.

సెల్ : 9490700078

మహనీయుల త్యాగ ఫలాలే...



జంగిటి వెంకటేష్

ఆకాశంలో సగం సంగతేమో కానీ..అన్ని రంగాల్లో మహిళలు ఒక్కో అడుగు ముందుకేస్తున్నారు. ఇప్పుడిప్పుడే విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తమ వాటా కోసం నిలదీస్తున్నారు. ఇందిరాగాంధీ ప్రధాని కాలేదా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఇది వరకు మహిళలు ప్రాతినిధ్యం వహించలేదా? అనే ప్రశ్నలను పక్కనపెడితే గతంలో కన్నా సామాన్య మహిళల్లోనూ చైతన్యం పెరుగుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణం..విద్య. ఒకప్పుడు కేవలం సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండేది. కానీ.. ప్రస్తుతం విద్యారంగంలో వస్తున్న మార్పులతో సామాన్యులు సైతం విద్యావంతులుగా ఎదుగుతున్నారు. ఆడపిల్లల పట్ల నేటికీ వివక్ష కొనసాగుతున్నా విద్య విషయంలో కొంత మార్పు చూస్తున్నాం. కాబట్టే ఆడపిల్లలూ ఉన్నత విద్యనభ్యసించి నచ్చిన రంగాల్లో సెటిలవుతున్నారు. ఏ రంగంలో చూసినా వీరి ప్రాతినిధ్యం పెరుగుతూ వస్తోంది. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడుస్తున్నా నేటికీ 50 శాతం హక్కులకు మాత్రం మహిళలు నోచుకోవడం లేదు. దేశాన్ని శాసించే రాజ్యాధికారంలో మహిళల వాటా చాలా తక్కువగా ఉంది. రాష్ట్రంలో అయితే ప్రభుత్వంలో మహిళల ప్రాతినిధ్యమే లేదు. దీన్ని బట్టి ఏమర్థం అవుతుందంటే మహిళలు తమ హక్కుల కోసం మడమ తిప్పని పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు సాగించడమే శరణ్యం. మహిళల హక్కుల గురించి మాట్లాడితే అసలు వీరికి హక్కులు ఎట్లా వచ్చాయి.. ఎప్పుడు వచ్చాయి.. ఎవరు కల్పించారనే ప్రశ్నలు రాకమానవు. నిజంగా ఈ విషయాన్ని ప్రతి మహిళా తెలుసుకోవలసిన అవసరం ఉంది. రాచరిక పాలన అంతరించిన తరువాత మహిళలు తొలిసారిగా విద్యను అభ్యసించింది సావిత్రీ బాయి పూలే నీడలోనే. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు తప్ప మిగిలిన వర్గాలు చదువుతోపాటు కనీస హక్కులకు నోచుకోలేని పరిస్థితిలో జ్యోతిరావు పూలే ఈ వర్గాలకు అండగా నిలిచారు. దళిత, బహుజనులకు ఉచితంగా విద్యను నేర్పారు. తన సతీమణి మహా తల్లి సావిత్రీ బాయి పూలేకు రాత్రి వేళల్లో అక్షరాలు నేర్పేవారు. ఆమె మరుసటి రోజు మహిళలకు ఆ అక్షరాలను బోధించేవారు. ఈ రకంగా కులాలతో సంబంధం లేకుండా భారతదేశంలో తొలి మహిళా టీచర్‌గా సావిత్రీ బాయి పూలే చరిత్రలో నిలిచారు. అణచివేయబడ్డ కులాలకు విద్య నేర్పి చైతన్యపరిస్తే ఈ వర్గాలు తమతో ధీటుగా ఎదుగుతారనే కుట్రతో నాడు ఆధిపత్యవాదులు ఈ దంపతులపై అనేకసార్లు హత్యాయత్నాలు సాగించారు. అయినా బెదరకుండా జాతిలో నూతన జవసత్వాలు నింపారు. ఈ రోజు దళిత, బహుజనులతోపాటు ఆధిపత్య కులాలకు చెందిన మహిళలు విద్యావంతులుగా మారారంటే మహాతల్లి సావిత్రీ బాయి పూలేనే కారణం. మహాతల్లి పదాన్ని తరచుగా వాడటం ఎందుకనే అనుమానాలను నివత్తి చేయాలంటే ఒక చిన్న పదం చాలు. అదేంటంటే.. బహుజనులను అక్షర జ్ఞానులుగా తీర్చిదిద్దే ఈ మహాయజ్ఞానికి పూర్తి సమయం కేటాయించాలంటే కుటుంబం, పిల్లలను కనిపెంచడం వంటి బాధ్యతలు ఆటంకంగా మారుతాయి. దీంతో ఆకుపసర్లతో సంతానం కలగకుండా జాగ్రత్త తీసుకున్నారు సావిత్రీబాయి పూలే. పిల్లలు లేకుంటే ఈ రోజుల్లోనే మహిళలను గొడ్రాలుగా హేళన చేస్తుంటారు. మరి ఆ కాలంలో పరిస్థితులు ఎట్లా ఉంటాయో ఊహించుకుంటే చాలు. సమాజం ఏమనుకున్నా ఫరవాలేదు, నమ్ముకున్న సిద్ధాంతం ప్రకారం సాటి మహిళలను చదివించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఎన్నెన్నో కష్టాలు పడ్డారు సావిత్రీ బాయి పూలే. ఈ కారణంగానే ఆమెను మహా తల్లి అని పిలుచుకుంటారు.

మహిళలు ఈ రోజు విద్యావంతులుగా ఎదిగారంటే కారణం ఎవరు.. సావిత్రీబాయి పూలే. కాబట్టి మహిళలు తొలుత తమ తొలి గురువుగా సావిత్రీ బాయి పూలేను గుర్తించి ఆమె లక్ష్యాల సాధన కోసం కృషి చేయాల్సి ఉంటుంది. బాబాసాహెబ్ అంబేద్కర్.. కూడా మహిళల హక్కుల కోసం కృషి చేశారు. నెహ్రూ హయాంలో బాబాసాహెబ్ అంబేద్కర్ న్యాయశాఖ మంత్రిగా కొనసాగారు. ఆ సమయంలో మహిళల హక్కుల కోసం హిందూకోడ్ బిల్లును రూపొందించారు. మహిళలకు విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని అంబేద్కర్ ఈ బిల్లులో పొందు పరిచారు. అయితే నెహ్రూ మంత్రి మండలిలో ఎంతోమంది ఈ బిల్లును వ్యతిరేకించారు. అయినప్పటికీ మహిళల హక్కులకు సంబంధించిన హిందూ కోడ్ బిల్ విషయంలో అంబేద్కర్ ఒంటరి పోరాటం సాగించారు. చివరకు తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడంతో నెహ్రూ దిగిరాక తప్పలేదు. ఈ రకంగా మహాత్మా జ్యోతిరావు పూలే, మహాతల్లి సావిత్రీబాయి పూలే ..బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు మహిళల హక్కుల సాధన కోసం ఎన్నెన్నో త్యాగాలు చేశారు.

సెల్ : 9948567892, 9052889696

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

మా అత్త పోయిందండీ!

రంగనాయకమ్మ

- 4 -

ఒక రోజు కోడలు నాతో, "మా అత్తకి కొంచెం బాగుండలేదు" అని చెప్పింది. "ఇలాంటి కబుర్లు వొద్దు నాకు. 'చచ్చింది' అన్నప్పుడు చెప్పు, సంతోషిస్తాను" అన్నాను. కోడలి మీద విసుగు పుట్టేసింది నాకు. "అత్తని ఆశ్రమంలో పెట్టెయ్యమంటే వినవు. బాగానే చాకిరీలు చేస్తున్నావు" అని విసుక్కుంటాను. ఒకసారి నేను కోడలికి ఫోన్ చేస్తే, ఆ నర్సు ఎత్తింది. "అమ్మగారు లేరమ్మా! బైటికి వెళ్లారు. రాగానే చెపుతాను. మీ పేరు నాకు తెలుసు" అంది. "అది సరే గానీ, నీ పేషెంటు ఏం చేస్తోంది నిన్ను?" అన్నాను. "అమ్మా! మీరు నమ్మరు. ఇలాంటి మనిషిని నేను ఎక్కడా చూడలేదు. కోడలు, దేవత లాంటిది. ఆ కోడల్నే పీల్చుకు తినేస్తోంది. నాకు ఇష్టం లేకపోతే, ఈ పని వదిలేసిపోతాను గానీ, కోడలు ఎక్కడికి పోతుంది? ఆ అమ్మగారి మీదే జాలేస్తుందమ్మా నాకు" అంటూ ఆ కోడలి మీద జాలితోనే చెప్పింది. "అయితే, ఒక పని చెయ్యి! అత్త, అర్ధరాత్రి పూట, నిద్ర మాత్రలు మింగి నిద్రపోతూనే వుంటుందిగా? ఆమె పీక నొక్కెయ్యి!" అన్నాను. నర్సు బాగా నవ్వింది. "అమ్మో! తప్పు కదామ్మా?" అంటూ తెగ నవ్వింది. "ఏం తప్పు లేదు. ఇంత దుష్టులు భూమి మీద వుండకూడదు. ఈ మనిషి ఆశ్రమంలో పెట్టడానికి కూడా పనికిరాదు" అన్నాను. నర్సు మళ్లీ నవ్వింది. అత్త, "ఏంటీ, అంత ఇకిలిస్తున్నావు? ఎవరూ? ఎవరూ?" అని పట్టుకుంది. నర్సు, నా పేరు చెప్పేసింది. అత్తకి, నేను కూడా బాగా తెలుసు. పాత రోజుల్లో, నేను కోడలికి ఫోన్ చేసినప్పుడు, అత్త ఎత్తితే, పెద్దవాళ్లని పలకరించాలని, "బాగున్నారా మామ్మగారూ? మీ గురించి మీ కోడలు చెబుతుంది. వంటలు చెయ్యడం మీకు ఎంతో బాగా తెలుసట! ఎలా నేర్చుకున్నారండీ?" అని నటనగా మెచ్చుకునే దాన్ని. "మా కోడలు చెప్పిందా? దాన్ని కన్నబిడ్డలా చూసుకుంటాను. నాకు ఆడపిల్లలు లేరుగా? నా ప్రాణాలు దానిమీదే పెడతాను" అంది. "అలాగా? మీకు మంచి కోడలు దొరికింది లెండి" అంటే, "అబ్బే! దానికి నేను దొరికాను. నా కొడుకు దొరికాడు. పెళ్లయినప్పుడు మా వాడు దాన్ని వొద్దన్నాడు మొదట..."

"మామ్మగారూ! నాకు పని వచ్చిందండీ, పెట్టేస్తున్నాను" అని ఫోన్ ఆపేస్తాను. అలా ఆ అత్తని నాలుగైదు సార్లు పలకరించాను. పెద్దవాళ్లు ఫోన్ ఎత్తితే, "బాగున్నారా?" అని అనకుండా ఎలా ఆపేస్తాం? ఆ తర్వాత ఆవిణ్ణి వదిలేశాను. ఒక రోజు కోడలు హఠాత్తుగా కొంచెం నవ్వుతూ, "మా అత్త పోయిందండీ!" అంది. "అయ్యో! అదేంటి? పోయిందా? ఎప్పుడూ? నవ్వుతున్నావేమిటి? తప్పు! ఏమైంది అసలు?" అని గబగబా అన్నాను. "పూర్తిగా ఆరోగ్యంగా వుంది. ఇందాక మధ్యాహ్న భోజనం కూడా అయింది. గుమ్మడికాయ కూర. ఆమెకి ఇష్టం అని కొంచెం ఎక్కువే పెట్టాను. ఇంకా తెమ్మంది. ఇంకొంచెం ఇచ్చి, 'వొద్దు, మళ్లీ రాత్రికి తినొచ్చు! ఎక్కువైతే ఏమన్నా అవుతుంది' అన్నా వినలేదు. 'తింటానంటే పెట్టవా? గుమ్మడికాయ నాకిష్టం. తీసుకురా!' అని అరిచింది. ఆ గిన్నె తెచ్చి కూరంతా పళ్లెంలో పెట్టేశాను. ఇంకా నర్సుకి పెట్టలేదు. అత్త గబగబా తినేసి పడుకుంది. తర్వాత, నర్సూ, నేనూ తినాలని అన్నాలు పెడుతూ ఆ అమ్మాయిని పిలిచాను. ఆ అమ్మాయి పరిగెత్తుకొచ్చింది. 'అమ్మా, అమ్మా, మామ్మ గారు ఆయాస పడిపోతున్నారు. మంచం మీదనించి పడిపోయేలాగ వున్నారు' అని చెప్పింది. ఇంకేం చెప్పను? వెళ్లి చూశాను. ఆయాసంతో తల్లడిల్లిపోతోంది. ముక్కుకి పెట్టే నెబులైజర్ వుంది, అది పెట్టాను. కొంచెం లేవబోయి వెనక్కి పడిపోయింది! ఫోన్ చేస్తే, ఫ్యామిలీ డాక్టర్ వచ్చారు. చూసి, 'అయిపోయింది' అన్నాడు. అంతా ఇప్పుడే, గంటన్నా కాలేదు" అదంతా కోడలు నవ్వుతూనే చెప్పింది ఆ మాటలన్నీ. "ఊరుకో! పోయిన మనిషి గురించి నవ్వేమిటి? బతికి వున్నప్పుడు ఒక్క మాట అనలేకపోయావు. ఇప్పుడు నవ్వితే, చూసేవాళ్లు ఏమనుకుంటారు?" అన్నాను. కోడలు మళ్లీ నవ్వింది. "నన్ను ఎవ్వరూ ఏమీ అనుకోరు. నాకు నవ్వొస్తోంది. ఎంత చెప్పానో, అలా తినొద్దని. నా మాట వినకూడదని చేసింది. బాగా చేసుకుంది" అని నవ్వు ఆపేసింది. "చెడ్డ మనిషికి ఎంత మంచి మరణం!" అని తెల్లబోయింది కోడలు.

వృద్ధుల ఆశ్రమాల మీద నా వ్యతిరేకత ఎప్పుడూ తగ్గలేదు. అయినా, ఆ ఆశ్రమాన్నే గౌరవిస్తూ చెప్పిన సంఘటన ఇంకోసారి జరిగింది. నాకు తెలిసిన ఒకా విడకి 90 ఏళ్లు దాటాయి. ఆవిడితో రెగ్యులర్ సంభా షణాలేమీ లేవు. ఏ ఆర్నెల్లకో ఒక సారి గుర్తొస్తేనే. ఒక రోజు ఒక తెలిసినావిడ వచ్చి, చాలా కబుర్లు చెబుతూ, "ఆవిడ ఒక ఆశ్రమంలో వున్నారు, మీకు తె లుసా?" అంది. "అదేమిటి? ఆవిడికి ఆశ్రమం ఏమి టి? 90 ఏళ్లు దాటాయి. కూతురు పెద్ద ఇంట్లో వుం ది. ఏం జరిగిందసలు?" అని అడిగితే, "ఆవిడతో మీ రే మాట్లాడండి! మీ గురించి ఆవిడ అడిగారు కూ డా. మొన్న మేం వెళ్లాం. మీ మాట వచ్చింది. 'నేను ఆశ్రమంలో వున్నానని ఆవిడికి తెలీదా? తెలిస్తే చాలా బాధ పడతారు' అన్నారు. మీరే మాట్లాడండి! సంతోషిస్తారు" అని చెప్పి, ఆవిడ ఫోన్ నెంబర్ ఇచ్చి, కాసేపు కూర్చుని వెళ్లారు. అది మధ్యాహ్నం పూట. ఆవిడ నిద్రపోతూ వుంటారేమో అని ఒక గంట ఆగి, అప్పుడు చేశాను. ఆవిడ సంతోషించారు. "ఏమిటండీ ఇది? మీరు, కూతురు ఇంట్లోనే వుండేవారు కదా? ఆశ్రమం ఏమిటి?" అని అడిగితే, ఆవిడ కూతుర్ని సమర్థిస్తూ, అల్లుణ్ణి వ్యతిరేకిస్తూ చెప్పింది. నేను, "అల్లుడు కోపంగా అంటే మాత్రం, మీ కూతురు ఎలా ఒప్పుకుంది? 90 ఏళ్లు దాటిన తల్లిని బైటికి పంపమంటావా? అనలేదా మీ కూతురు? చదువుకున్న మనిషి. తల్లి, భారం అయిందా, మీ కూతురికి? 60 ఏళ్ల మనిషినైతే బైటికి పంపవచ్చని కాదు. ఈ వయసులో మిమ్మల్ని వదిలిందా?" అని అడిగితే, ఆవిడ, "భర్త మాటని ఎలా కాదంటుందమ్మా?" అంటూ, కూతురి తప్పు లేనట్టు చెప్పుకొచ్చింది. "అసలు, ఈ ఆశ్రమాన్ని ఎవరు వెతికారు?" అంటే, "నా కూతురే. మంచి ఆశ్రమంలో పెట్టాలని... కంప్యూటర్ ముందు కూర్చుని బాగా వెతికింది. ఒక రోజు ఇక్కడికి తీసుకొచ్చారు."

(తరువాయి భాగం సోమవారం సంచికలో...)

కొడుకును కాదని దళితున్ని సీఎం చేస్తావా?

- కేసీఆర్‌కు బీఎల్ఎఫ్ సవాల్
- 60-65 స్థానాలు బహుజనులకే
- అన్ని స్థానాలిచ్చే దమ్ము కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు ఉందా? : బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

'కొడుకును కాదు అని దళితున్ని సీఎం చేస్తావా?' అని సీఎం కేసీఆర్‌కు బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బహుజనులకు బీఎల్ఎఫ్ తరుపున 60 నుంచి 65 స్థానాలిస్తాం. అన్ని స్థానాలిచ్చే దమ్ము కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలకు ఉందా అని సవాల్ విసిరారు. ఈ నెల 11న రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని భాగ్యనగర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల బీఎల్ఎఫ్ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను బుధవారం ఇబ్రహీంపట్నంలోని డాక్‌బంగ్లాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కావాల్సిన అవసరముందని చెప్పారు. ఈ నినాదం కేసీఆర్ తీసుకోవడం అభినందనీయమేగానీ, తెలంగాణలో కేసీఆర్ వారికంటే భిన్నమైన విధానాలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సామాజిక న్యాయమంటే గొర్రెలు, బర్రెలు ఇవ్వడం కాదని, రాజకీయంగా అవకాశాలు కల్పించాలని సూచించారు. బీఎల్ఎఫ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బహుజనుడినే ప్రకటిస్తుందని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో 17 మందితో మంత్రివర్గం ఉంటే అందులో 7 గురు మాత్రమే 93 శాతంగా ఉన్న జనాభాకు ప్రతినిధులుగా వ్యవహ రిస్తున్నారన్నారు. 7 శాతం జనాభాకు 10 మంది మంత్రులున్నారని, 40 వేల జనాభాకు సీఎం, ముగ్గురు మంత్రులుంటే ఏ విధంగా సామాజిక న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. అంబేద్కర్, పూలే ఆలోచనలు, మార్క్స్ సిద్ధాంతం కలియికతో ఏర్పడిందే బీఎల్ఎఫ్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ కన్వీనర్ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

13న ఎమ్మార్పీఎస్ బంద్‌కు తెలంగాణ ఇంటిపార్టీ మద్దతు

నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న తలపెట్టిన బంద్‌కు తెలంగాణ ఇంటిపార్టీ మద్దతు ప్రకటించింది. ఈ విషయమై ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరకు సుధాకర్‌ను కలుసుకున్నారు.

బంద్‌కు మద్దతు ఇవ్వాలని మందకృష్ణ కోరగా, ఆయన అంగీకరించారు. ఈ సందర్భంగా చెరకు సుధాకర్ మాట్లాడుతూ వర్గీకరణకు జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. మందకృష్ణ మాట్లాడుతూ బంద్ కోసం ఇప్పటికే అన్ని పార్టీల మద్దతు కోరామన్నారు. వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ఈ రోజు మౌనంగా ఉందన్నారు.

అల్‌కబీర్ పరిశ్రమలో కార్మికులపై దాడి

- వెంబడించి కొట్టిన సెక్యూరిటీ గార్డులు
- కార్మికులకు తీవ్రగాయాలు, బైకులు ధ్వంసం, ఇరువురిపై కేసు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం అల్‌కబీర్ పరిశ్రమ యాజమాన్యం సెక్యూరిటీ గార్డులచే కార్మికులపై దాడి చేయించింది. ఈ ఘటన బుధవారం జరిగింది. సెక్యూరిటీగార్డులు మూకుమ్మడిగా కార్మికులపై దాడి చేయడంతో పరిశ్రమ ఎదుట తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఇరువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి కార్మికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రుద్రారం శివారులో ఉన్న అల్‌కబీర్ పరిశ్రమలో గత నెల 12న ఏడుగురు కార్మికులను పరిశ్రమలోని మరో యూనిట్‌కు మార్చారు. ఇదేంటని అడిగినందుకు యజమాన్యం వారిని సస్పెండ్ చేసింది. ఇందుకు నిరసనగా కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచనల మేరకు కార్మికులంతా బుధవారం ఉదయం జనరల్ షిఫ్టుకు విధుల్లోకి వెళ్లేందుకు గేటు వద్దకు వచ్చారు. అయితే, అప్పటికే యాజమాన్యం సెక్యూరిటీ గార్డులను అక్కడ సిద్ధం చేసింది. కార్మికులను లోపలికి రానీయకుండా అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తీవ్ర తోపులాట జరిగింది. సెక్యూరిటీ గార్డులు మూకుమ్మడిగా కర్రలు, రాళ్లతో కార్మికులపై దాడికి పాల్పడి వెంబడించి కొట్టారు. దాడిలో కార్మికుల మూడు బైకులు ధ్వంసమయ్యాయి. గాయపడిన కార్మికులను యూనియన్ నాయకులు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సెక్యూరిటీగార్డులనూ యాజమాన్యం వేరే ఆస్పత్రికి తరలించింది. కార్మికులు, సెక్యూరిటీగార్డులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇరువురిపై కేసు నమోదైంది.

దాడిని ఖండించిన కార్మిక సంఘాలు, పార్టీలు..

కార్మికులపై దాడిని పలు కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బి.మల్లేశం, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వైయస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్‌కబీర్ పరిశ్రమ యజమాన్యం నిరంకుశత్వంతో కార్మికులపై సెక్యూరిటీతో దాడులు చేయించిందన్నారు. కార్మికులను అన్యాయంగా సస్పెండ్ చేయడంతోపాటు వారి హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రివర్గంలో ఒక్క మహిళా లేరు

- ఇదేనా గుణాత్మక మార్పంటే
- సీఎం కేసీఆర్‌కు లక్ష్మణ్ ప్రశ్న

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొత్త రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, నాలుగేండ్లు గడిచినా మంత్రివర్గంలో ఒక్క మహిళకూ చోటివ్వని ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ విమర్శించారు. సీఎం కేసీఆర్ చెప్తున్న ఈ గుణాత్మక మార్పునే దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తారా అని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చెప్తున్న థర్డ్‌ఫ్రంట్ ఒట్టి బూటకమని, కొడుకును సీఎం చేయడానికి ఆడుతున్న నాటకమని అన్నారు. నాలుగేండ్ల టీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కోటి ఆశలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే...దాన్ని కేసీఆర్ కుటుంబం కొల్లగొడుతోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ ఏకంగా దేశ రక్షణ శాఖమంత్రిగా నిర్మలా సీతారామన్‌ను నియమించి ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా కేంద్రప్రభుత్వం ఇంటింటికీ శౌచాలయం నినాదాన్ని ఇచ్చి, నిధుల్ని కేటాయిస్తే రాష్ట్రంలో ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు.

అది తెలంగాణ రాక్షస సమితి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజాస్వామ్య, మానవతా విలువలు లేని తెలంగాణ రాక్షస సమితి (టీఆర్ఎస్) రాష్ట్రాన్ని ఏలుతోందని, త్వరలోనే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ విమర్శించారు. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని వాగ్దానాలు చేసి, నాలుగేండ్లు పూర్తిగా అబద్ధాలతో సీఎం కేసీఆర్ ప్రజల్ని మోసం చేశారని ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ జాతీయ పార్టీ బీజేపీపై ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడు తున్నారని అన్నారు. ప్రపంచ రాజకీయపార్టీలకు అబద్ధాల పోటీ పెడితే కేసీఆర్ అండ్ కంపెనీకి ఫస్ట్ ప్రైజ్ వస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు ఈ రాక్షస పాలన నుంచి విముక్తి పొందే రోజులు త్వరలో వస్తాయని చెప్పారు.

ప్రజాసమస్యలపై చర్చకు వ్యూహం

- టీడీఎల్పీ భేటిలో నిర్ణయం
- 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేయాలి:సండ్ర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చకు పట్టుబట్టాలని తెలుగుదేశం శాసనసభాపక్షం నిర్ణయించింది. యువత, మహిళలు, ఉపాధి, రైతులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బీసీ, మైనారిటీల సమస్యలపై రిజర్వేషన్లు తదితర సమస్యల విషయంలో చర్చకు వచ్చేలా ఇద్దరు ఎమ్మెల్యేలు కృషిచేయాలని తీర్మానించింది. బుధవారం అసెంబ్లీలో టీడీఎల్పీలో ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, ఆర్.కృష్ణయ్య, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం. అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. శాసనసభ సమావేశాలు 42 రోజులపాటు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈమేరకు స్పీకర్‌తో చర్చిస్తామని చెప్పారు. ఆయా ప్రభుత్వ శాఖలు, ఇతరాల్లో దాదాపు 2 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని సూచించారు. గతంలో అసెంబ్లీ సమావేశంలో 1.07 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారన్నారు. కొత్త కలెక్టరేట్ల సందర్భంగా 30 వేల ఉద్యోగాలు, ఉద్యోగ విరమణ ఖాళీలు 40 వేల వరకు కొత్తగా రానున్నాయని చెప్పారు. మొత్తం 2 లక్షల ఖాళీలు భర్తీకాకుండా ఉన్నాయని వివరించారు. బీసీ జనాభా అధికంగా ఉందని, ఆమేరకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను 28 నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతిపాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల కోసమే పథకాలు ఉన్నాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్‌లో ఈ తరహా విధానం లేదని స్పష్టం చేశారు. 12 బీసీ ఫెడరేషన్లకు నిధులు ఇవ్వాలని సూచించారు. రైతాంగ సమస్యలపై సుదీర్ఘ చర్చ అవసరమని అభిప్రాయపడ్డారు. రైతు పెట్టుబడి పథకం టీఆర్ఎస్ కార్యకర్తల కోసం ప్రవేశపెట్టారని చెప్పారు.

వచ్చే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రజత్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని నూతనంగా నియమితులైన ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ అన్నారు. బుధవారం సచివాలయం హెచ్ బ్లాకులోని తన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భయపడకుండా ఎన్నికలలో పాల్గొనాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియ జిల్లాల్లో చురుకుగా జరుగుతుందన్నారు. భయపడకుండా ఎన్నికలు నిర్వహిస్తానని చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికలను దష్టిలో ఉంచుకొని ముందుకెళుతున్నామన్నారు. ఈవిఎంలపై వస్తున్న అపోహలను ఆయన కొట్టిపారేశారు.

'సంఘ్' హింసను ఖండించండి...

- టీ మాస్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్రిపురలో ఆరెస్సెస్, బీజేపీ గుండాలు లెనిన్ విగ్రహాలను, తమిళనాడులో పెరియార్ రామస్వామి విగ్రహాలను కూల్చటాన్ని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఫోరం రాష్ట్ర చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కన్వీనర్ జాన్‌వెస్లీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, జేబీ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. మతోన్మాదులు నాయకుల విగ్రహాలను కూల్చగలరేమోగాని, వారి ఆశయాలను కూల్చలేరని వారు పేర్కొన్నారు. ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం కోరిన నాయకులను సహించలేని ఉన్మాదులు వారి విగ్రహాలను కూల్చటం అవివేకమైన చర్యని విమర్శించారు. ఇలాంటి చర్యలను అభ్యుదయవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు..

- సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్రిపురలో లెనిన్ విగ్రహాలను కూల్చి వేయటం ద్వారా మతోన్మాదులు ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ విమర్శించింది. దేశంలో కాషాయ మూకలు అత్యంత నిరంకుశ ఫాసిస్టు చర్యలకు పాల్పడుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ పేర్కొన్నారు.

ఇలాంటి చర్యలను ప్రజా తంత్ర శక్తులు, అభ్యుదయవాదులం దరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రాష్ట్ర క్యాబినెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గం గురువారం భేటీ కానుంది. ఈనెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గవర్నర్ ప్రసంగానికి, బడ్జెట్‌కు తుదిరూపునిచ్చేందుకు క్యాబినెట్ భేటీ అవుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలి? బడ్జెట్‌ను ఏ రోజు ప్రవేశపెట్టాలి? ప్రతిపక్షాల విమర్శలను ఏ విధంగా తిప్పికొట్టాలనే అంశాలపై సీఎం తన మంత్రివర్గ సహచరులకు దిశా, నిర్దేశం చేయనున్నారు.

నవచిత్రం



శ్రీదేవి

శ్రీదేవి జీవితం ఆధారంగా డాక్యుమెంటరీ..!

అతిలోక సుందరి శ్రీదేవి అకాల మరణ వార్త నుంచి ఇప్పటికీ ఆమె అభిమానగణం కోలుకోలేదు. చాలా మంది ప్రముఖులు సైతం ఆ లెజెండ్ మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక శ్రీదేవి కుటుంబ సభ్యుల బాధ వర్ణించతరం కాదు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా శ్రీదేవి జీవితం ఆధారంగా ఓ డాక్యుమెంటరీని నిర్మించేందుకు భర్త బోనీకపూర్ సన్నాహాలు చేస్తున్నారట. శ్రీదేవికి సంబంధించి ఇప్పటివరకు ఎవ్వరికీ తెలియని ఎన్నో విషయాలను, ఆసక్తికర విశేషాలను అలాగే సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఆమెతో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల జ్ఞాపకాలతో ఈ డాక్యుమెంటరీని రూపొందించేందుకు బోనీకపూర్ ప్లాన్ చేశారట. దీనికోసమై ఇప్పటికే దర్శకుడు శేఖర్‌కపూర్‌ని కూడా సంప్రదించారని సమాచారం. అనిల్‌కపూర్, శ్రీదేవి జంటగా శేఖర్ కపూర్ దర్శకత్వం వహించిన 'మిస్టర్ ఇండియా' చిత్రం విశేష ప్రేక్షకాదరణతో అఖండ విజయం సాధించింది.

తొలి తొలిగా.. తొలకరి..



విశాల్, సమంత

విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. ఈ చిత్ర తెలుగు రైట్స్‌ను హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి ఫ్యాన్సీ ఆఫర్‌తో దక్కించుకున్నారు. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. 'తొలి తొలిగా తొలకరి' అంటూ సాగే ఈ చిత్రంలోని మొదటి పాటను హీరో నితిన్ చేతులమీదుగా నేడు (గురువారం) విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జి.హరి మాట్లాడుతూ, 'షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నేడు ఈ చిత్రంలోని తొలిపాటను హీరో నితిన్ విడుదల చేస్తున్నారు. విశాల్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా ఇది. హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. యాక్షన్ కింగ్ అర్జున్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు' అని అన్నారు. విశాల్, సమంత, యాక్షన్ కింగ్ అర్జున్‌తోపాటు భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది.

శివ, హ్యాపీడేస్ సినిమాల స్ఫూర్తితో..

నిఖిల్, సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే హీరో, హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఏ టీవీ సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుంకర రామబ్రహ్మం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 16న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నిఖిల్ మాట్లాడుతూ,'నా తొలి సినిమా 'హ్యాపీడేస్' తర్వాత పూర్తి స్థాయిలో నటించిన మరో కాలేజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రమిది. ఇది నా 15వ సినిమా. నా మనసుకు బాగా దగ్గరైన సినిమాల్లో ఇదొకటి. ప్రేక్షకులకు ఈ సినిమా రీచ్ కావడానికి నేటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో టూర్ నిర్వహిస్తున్నాం. యూత్‌కి బాగా నచ్చే చిత్రమిది' అని చెప్పారు. 'ఈనెల 15వ తేదీతో ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత రోజే మా సినిమా రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ కాంటెస్ట్ నిర్వహిస్తున్నాం. కాంటెస్ట్‌లో గెలిచిన వారికి సినిమాలో ఉపయోగించిన కారును బహుమతిగా అందజేస్తాం. ఈనెల 10వ తేదీన విజయవాడలో ఆడియో వేడుకను జరుపుతాం. 'శివ', 'హ్యాపీడేస్' తరహాలో పూర్తి స్థాయి కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఈ చిత్రాన్ని దర్శకుడు శరణ్ అద్భుతంగా తెరకెక్కించాడు. దర్శకులు చందు మొండేటి, సుధీర్ వర్మలు తమ వంతు సహకారాన్ని అందించారు' అని అన్నారు. 'శివ', 'హ్యాపీడేస్' చిత్రాలను స్ఫూర్తిగా తీసుకుని కన్నడ 'కిరిక్ పార్టీ'ని తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించాం. ప్రతి ఒక్కరూ తమని తాము ఐడెంటిఫై చేసుకునేలా ఇందులోని పాత్రలుంటాయి' అని దర్శకుడు తెలిపారు. సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే, అప్పు, జాన్, మౌర్య, రాకేందు మౌళి తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



సిమ్రాన్ పరింజ
నిఖిల్
సంయుక్తా హెగ్డే

హై ఓల్టేజ్ యాక్షన్..



సుదీప్, నిత్యామీనన్

సుదీప్, నిత్యమీనన్ జంటగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో కన్నడ, తమిళ భాషల్లో రూపొందిన చిత్రం 'కోటిగొబ్బ-2'. ఈ చిత్రం ఇటీవల రిలీజై 120 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. ఈ చిత్రాన్ని దుహర మూవీస్ పతాకంపై కళ్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 9న అత్యధిక థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత కళ్యాణ్ ధూళిపాళ్ల మాట్లాడుతూ,'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రీసెంట్‌గా 'రచయిత' సినిమా నిర్మించాను. చిన్న సినిమాగా రిలీజైన ఆ చిత్రం చాలా మంచి పేరు తెచ్చింది. ఫస్ట్ చిత్రంతోనే అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నందుకు చాలా హ్యాపీగా వుంది. మా దుహర మూవీస్ బేనర్‌లో రెండో చిత్రంగా ఒక మంచి మాస్ కమర్షియల్ సినిమా చెయ్యాలని ప్లాన్ చేస్తున్న టైమ్‌లో కన్నడలో 'కోటిగొబ్బ-2' చిత్రం చూశాను. నాకు బాగా నచ్చింది. నేను అనుకున్న కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. సుదీప్, నిత్యమీనన్, కె.ఎస్. రవికుమార్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ చిత్రం కన్నడ, తమిళ భాషల్లో బిగ్గెస్ట్ హిట్ అయ్యి, 120 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. తప్పకుండా ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. మా డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ ఎంతో ఎంకరేజ్ చేశారు. వారి కోరిక మేరకు ఈ చిత్రాన్ని ఈనెల 9న 300 థియేటర్లకు పైగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. తెలుగులో కూడా ఖచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని అన్నారు. 'సుదీప్ నేషనల్ హీరో. ఇప్పటివరకు చాలా మంచి సినిమాలు చేశారు. ఆయన చేసిన బెస్ట్ సినిమాలలో 'కోటికొక్కడు' బిగ్గెస్ట్ హిట్ మూవీ. కె.ఎస్. రవికుమార్‌గారు రీసెంట్‌గా 'జై సింహా'తో సూపర్‌హిట్ కొట్టారు. మా కళ్యాణ్ 'రచయిత' చిత్రంతో నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నాడు. అతను చేస్తున్న రెండో సినిమా కూడా మంచి హిట్ అయ్యి బాగా డబ్బులు రావాలి. ఆల్‌రెడీ మా కాంబినేషన్‌లో ఒక సినిమా చేస్తున్నాం. షూటింగ్ జరుగుతోంది' అని దర్శకుడు వి.సముద్ర చెప్పారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆశిస్తున్నట్టు నిర్మాత శోభారాణి తెలిపారు.



అలియా భట్

వీధి కుక్కల నేపథ్యంలో..

ప్రస్తుతం 'రాజీ', 'గల్లీ బాయ్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాలతో పాటు 'జీరో' చిత్రంలో అతిథిపాత్రలో నటిస్తూ బిజీగా ఉన్న అలియాభట్ తాజాగా మరో చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీధి కుక్కల నేపథ్యంలో సాగే కథతో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నిర్మించే చిత్రంలో అలియా నటించనుంది. ఈ చిత్రంలో కథానాయికకు కేవలం నాలుగైదు సన్నివేశాలు మాత్రమే ఉంటాయట. దీంతో చాలా మంది అగ్ర కథానాయికలు ఈ చిత్రంలో నటించేందుకు విముఖత చూపించారు. ఫైనల్‌గా అలియా ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించిందట. ఈ ప్రాజెక్ట్ విషయమై అలియా మాట్లాడుతూ, 'నటిగానే కాకుండా నిర్మాతగానూ ప్రియాంక తానేమిటో చాటుకునే ప్రయత్నం చేస్తోంది. హాలీవుడ్‌లో నటిస్తూ పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ ఉత్తమాభిరుచితో సినిమాల నిర్మాణం చేయటం అభినందనీయం. ఆమె నిర్మించే తాజా చిత్రంలో నేను నటించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఓ మంచి కంటెంట్ ఉన్న కథ ఇది. నా పాత్ర నిడివి తక్కువైనప్పటికీ ఈ చిత్రాన్ని అంగీకరించటానికి కారణం నేను కూడా జంతు ప్రేమికురాలినే. వీధి కుక్కల నేపథ్యంలో సాగే ఈ చిత్ర కథ అత్యద్భుతంగా ఉంది' అని చెప్పింది.

మహిళల్లో ధైర్యం రావాలి..



శివానీ సింగ్

'ఆధునిక జీవన శైలిలో సామాజిక మాధ్యమాలు వాడటం అవసరమే. అయితే వాటికి బానిస కాకూడదు. నా వరకు నేను సోషల్ మీడియా లేకపోయినా ఉండగలను' అని అంటోంది నూతన కథానాయిక శివానీ సింగ్. విజయ్‌దేవర కొండ, శివానీసింగ్ జంటగా నటించిన చిత్రం 'ఏ మంత్రం వేసావే'. గోలీసోడా ఫిల్మ్ పతాకం, సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో నిర్మితమైన ఈచిత్రం ఈనెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక శివానీసింగ్ మీడియాతో ముచ్చటించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే, 'మాది ఢిల్లీ. అమ్మ టీచర్, నాన్న ఏరోనాటికల్ ఇంజనీర్. పేరెంట్స్ సలహా మేరకు గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసిన తర్వాత మోడలింగ్‌లోకి అడుగుపెట్టాను. చాలా బ్రాండ్స్‌కు ప్రచారకర్తగా పని చేశాను. అలాగే నాటకరంగంలోనూ అనుభవం ఉంది. సినిమాలపై ఆసక్తితో ముంబైకి వచ్చాను. వెండితెరపై నన్ను నేను చూసుకోవాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది. తెలివితేటలు, ధైర్యం ఉన్న యువతిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. నిజాయితీ, మంచితనం కలగలిసిన నవతరం అమ్మాయిలకు ప్రతీకగా నా పాత్ర ఉంటుంది. నా పాత్రలోని భావోద్వేగాలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారనే నమ్మకం ఉంది. భాష రాకపోయినా హిందీ, ఇంగ్లీష్‌లలో డైలాగ్స్ రాసుకుని ప్రాక్టీస్ చేశాను. వీడియోగేమ్, సోషల్ మీడియాకు బానిసైన యువకుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తారు. నిజ జీవితంలో అవసరం మేరకు మాత్రమే సోషల్ మీడియాపై ఆధారపడతాను. చిత్ర పరిశ్రమలోనే కాదు అన్ని రంగాల్లోనూ మహిళలపై వివక్ష ఉంది. అలాగే వారిపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వాటిని ఎదురించే ధైర్యం మహిళల్లో రావాలి. అందరూ సమానమనే భావనను పెంపొందించుకోవాలి. మహేష్‌బాబు, అక్షయ్‌కుమార్, హృతిక్‌రోషన్ అంటే చాలా ఇష్టం. రాజ్‌కుమార్ రావు నటన బాగా నచ్చుతుంది. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ చిత్రానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి' అని చెప్పింది.

అనగనగా ఒక ఊళ్ళో పాటల సందడి..



ప్రియాంక శర్మ, అశోక్‌కుమార్

సాయికృష్ణ కె.వి.ని దర్శకుడిగా పరిచయం చేస్తూ చంద్రబాలాజీ ఫిల్మ్స్ పతాకంపై కె.చంద్రరావు నిర్మిస్తున్న చిత్రం 'అనగనగా ఒక ఊళ్ళో'. 'పల్లెటూరికి వినోద యాత్ర' అనేది ట్యాగ్‌లైన్. అశోక్ కుమార్, ప్రియాంక శర్మ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ పాటల సీడీలను, థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, 'టైటిల్ బాగుంది. పల్లెటూరి వాతావరణ సినిమాలో చూడబోతున్నాం. సంగీత దర్శకుడు యాజమాన్య మంచి పాటలను అందించారు. సినిమా మంచి విజయం సాధించాలి' అని అన్నారు. 'దర్శకుడు సాయి రాజమౌళి వద్ద పనిచేశాడు. తను మంచి డైరెక్టర్. సినిమాను అత్యద్భుతంగా తీశారు. నేనిందులో ఓ మంచి పాత్ర పోషించా. సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. మంచి ట్విస్ట్‌లతో, డిఫరెంట్ లొకేషన్లలో, చక్కని విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నా' అని సుమన్ తెలిపారు. దర్శకుడు సాయికృష్ణ చెబుతూ, 'ఇప్పటి వరకు 15 సినిమాలకు వర్క్ చేశాను. రాజమౌళి దగ్గర వర్క్ చేస్తూనే చాలా నేర్చుకున్నాను. ఈ చిత్రంతో దర్శకుడిగా మారాను. నిర్మాత బాగా సపోర్ట్ చేశారు. సినిమాను ఎలాంటి అవాంతరాలు లేకుండా 40 రోజుల్లో పూర్తి చేశాం. ఈ నెలలోనే సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

మరో నేటి భారతం..



మేఘన, అనిల్ నెమలి

అనిల్ నెమలిని హీరోగా పరిచయం చేస్తూ మేఘన హీరోయిన్‌గా తారనీలు కార్పొరేషన్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో అనురాగ్ (ఎం.ఎస్.బాబు) నిర్మిస్తున్న నూతన చిత్రం ఇటీవల అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శ్రీరామ్ క్లాప్‌నివ్వగా, భూపతిరాజా కెమెరా స్విచాన్ చేశారు, దాసరి కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అనురాగ్ మాట్లాడుతూ, 'దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. సెల్‌ఫోన్ బిజీతో సమాజం, సమస్యలపై యువత దృష్టిపెట్టడం లేదు. మన దేశాన్ని 500 మంది రాజులు పాలించారు, అయినా ఒక్క రూపాయి కూడా అప్పు చేయలేదు. ఇప్పుడు అప్పులు పెరిగిపోయాయి. రైతులను పట్టించుకోవడం లేదు. కులాలు, మతాల పేరుతో విభజిస్తున్నారు. కాబట్టి ఈ చిత్రంలో యూత్ ద్వారా నేను ప్రశ్నిస్తున్నా. మత కల్లోలాల నుంచి దేశాన్ని నలుగురు కుర్రాళ్ళు ఎలా కాపాడారనేది సినిమా. లవ్ అండ్ పాలిటిక్స్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా, 'నేటి భారతం', 'ప్రతిఘటన' తరహాలో సాగే రివల్యూషన్ చిత్రమిది. ఈ నెల 25నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తున్నాం' అని అన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే..



నట్టికుమార్

'నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మేలు కోసం కాకుండా కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసమే సినిమా థియేటర్ల బంద్ జరుగుతోంది' అని నిర్మాత నట్టికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,' తెలుగు సినిమా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ చిన్న సమస్య కోసం గత ఆరు రోజులుగా థియేటర్లను బంద్ చేయించడం విడ్డూరంగా ఉంది. థియేటర్ల బంద్ కారణంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు దాదాపు వంద కోట్ల రూపాయలు నష్టపోయారు. అలాగే థియేటర్ల మూత వల్ల థియేటర్ కార్మికులు బాగా నష్టపోతున్నారు. వారికి పూట గడవటం కూడా చాలా భారంగా ఉంది. ఇక చిన్న చిత్రాల నిర్మాతల పరిస్థితి వేరే చెప్పక్కర్లేదు. అలాగే ఎన్నో సినిమాలు విడుదల కాకుండా ఆగిపోయాయి. ఇలాంటివేవి పట్టించుకోకుండా కొంతమంది స్వార్థం కోసం థియేటర్ల బంద్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ కంపెనీలు వసూలు చేస్తున్న 12 వేల రూపాయల్లో కేవలం రెండు వేల రూపాయలు తగ్గించమని జె.ఎ.సి.నాయకులు బతిమిలాడ్డం హాస్యాస్పదం. కేవలం రెండు వేల రూపాయలను మాత్రమే ఛార్జ్‌గా తీసుకోమని చెప్పాల్సింది పోయి రెండు వేలు తగ్గిస్తే చాలని అడగటం సబబుగా లేదు. రెండు వేల రూపాయలకు డిజిటల్ కంపెనీలు అంగీకరించకపోతే వారికి కంటెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదు. సురేష్‌బాబు, అల్లు అరవింద్‌లాంటి పెద్ద మనుషులు ఈ సంస్థల వెనుక ఉండటం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. త్వరలో వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కాబోతున్నాయి. వాటి విడుదల తేదీలలో మార్పులు చేయించి, చిన్న చిత్రాలను విడుదల చేసుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాను. 'అజ్ఞాతవాసి' చిత్ర పరాజయం కారణంగా ఎంతో మంది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు తీవ్రంగా నష్టపోయారు. వారి నష్టాల్లో కొంత శాతాన్ని భర్తీ చేస్తున్నామని చెప్పారు. అయితే ఆ మొత్తం ఎవరి జేబుల్లోకి వెళ్ళింది?, మధ్యలో ఎవరైనా మింగేశారా అనే అంశం తేలాల్సి ఉంది. ఈ చిత్రం వల్ల నష్టంతో విశాఖజిల్లాలో ఒక ఎగ్జిబిటర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఇంకో జిల్లాలో మరో ఎగ్జిబిటర్ ఆత్మాహత్యా ప్రయత్నం చేశాడు. దీనిపై ఆ చిత్ర నిర్మాత చినబాబు, హీరో పవన్‌కళ్యాణ్ ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతం రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. భవిష్యత్‌లో నేనూ రాజకీయాల్లోకి వెళ్తాను' అని తెలిపారు.

నీతోనే హాయ్...హాయ్ మొదలైంది



ఛరిష్మా శ్రీకర్, అరుణ్‌తేజ్, శ్రీకాంత్

అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ నాయకానాయికలుగా కెఎస్‌పి ప్రొడక్షన్స్ పతాకంపై యలమంచిలి ప్రవీణ్ సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. డా.ఎస్.కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి సంయుక్తంగా బి.ఎన్.రెడ్డి అభినయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈచిత్ర ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానంలో వైభవంగా ప్రారంభమైంది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో శ్రీకాంత్ క్లాప్‌నివ్వగా, 'మా' అధ్యక్షుడు శివాజీరాజా స్విచాన్ చేశారు. సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు బి.ఎన్.రెడ్డి అభినయ మాట్లాడుతూ,'నన్ను, నా కథను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు. బాగా డబ్బున్న వ్యక్తి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది?, మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి మానవత్వం ఎలా ఉంటుంది అనేది మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం. క్యూట్ లవ్‌స్టోరీకి కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ రోజు నుంచే తొలి షెడ్యూల్ ప్రారంభమైంది. మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం. ఇందులోని కొన్ని పాటలను విదేశాల్లోనూ చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'దర్శకుడు బి.ఎన్.రెడ్డికి సినిమా రంగంలో ఎంతో అనుభవం ఉంది. ఆ అనుభవంతో ఈ చిత్రాన్ని అద్భుతంగా చిత్రీకరిస్తానే నమ్మకం ఉంది. ఏ విషయంలోనూ రాజీపడకుండా ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మించేందుకు ప్లాన్ చేశాం. ఇందులోని ఐదు పాటలను రవికళ్యాణ్ అద్భుతంగా కంపోజ్ చేశారు. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాం' అని నిర్మాతలు అన్నారు. 'సీనియర్ నటీనటులతోపాటు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. దర్శకుడు బి.ఎన్.రెడ్డికి నాటక రంగంలో మూడు నంది అవార్డులొచ్చాయి. అభినయ ఆర్ట్స్‌పై ఆయన ఎన్నో నాటకాలు చేశారు. వైద్యరంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నిర్మాతలు ఈ చిత్రంతో సినిమా రంగంలోనూ అభిరుచిగల నిర్మాతలుగా పేరు తెచ్చుకుంటారని ఆశిస్తున్నాను' అని సమర్పకుడు యలమంచిలి ప్రవీణ్ చెప్పారు. 'తమిళంలో ఒక సినిమా చేశాను. 'చంద్రుళ్లో ఉండే కుందేలు' తర్వాత తెలుగులో చేస్తున్న రెండవ చిత్రమిది' అని హీరో అరుణ్‌తేజ్ అన్నారు. 'క్యూట్ లవ్‌స్టోరీతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నేనొక క్యూట్ క్యారెక్టర్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని హీరోయిన్ ఛరిష్మా శ్రీకర్ చెప్పారు. ఆనంద్, బెనర్జీ, ఏడిద శ్రీరామ్, జయచంద్ర, రత్నప్రభ, శ్రీప్రియ, జబర్దస్ రామ్‌ప్రసాద్, పవన్, భాను ప్రకాష్, అడప రామారావు, రవి ఆనంద్, జి.లక్ష్మి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా : ఈదర ప్రసాద్, సంగీతం : రవికళ్యాణ్, ఎడిటింగ్ : ఆనంద్ పవన్, కొరియోగ్రఫీ : సాయిరాజ్, ఆర్ట్ :సుబ్బారావు, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, దర్శకత్వం : బి.ఎన్.రెడ్డి అభినయ.

లెనిన్, అంబేద్కర్, పెరియార్

విగ్రహాల కూల్చివేతపై వెల్లువెత్తిన నిరసనలు

- సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహ8
- పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు

8తెలంగాణ-యంత్రాంగం

లెనిన్, అంబేద్కర్, పెరియార్ విగ్రహాల కూల్చివేతను నిరసిస్తూ సీపీఐ(ఎం) పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కేంద్ర ప్రభుత్వ, ఉన్మాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కండ్లకు గంతలు కట్టుకుని నిరసనలు తెలిపారు. పలుచోట్ల రాస్తారోకోలు చేశారు. ఈ ఆందోళనల్లో సీపీఐ(ఎం)తోపాటు ప్రజాసంఘాలు, సీపీఐ, కాంగ్రెస్ పాల్గొన్నాయి. వికారాబాద్‌లో ప్రధాని మోడీ, అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ సురేష్, సీపీఐ(ఎం) నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దిష్టిబొమ్మలను లాక్కొని నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తప్పించుకొని దిష్టిబొమ్మలను దహనం చేశారు. పోలీసులు వెంటనే నాయకులను ఈడ్చుకెళ్లి జీపులో పడేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన రాస్తారోకోలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పాల్గొన్నారు. షాద్‌నగర్, మంచాలలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. శంకర్‌పల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మతోన్మాదుల, హింసోన్మాదుల దిష్టిబొమ్మ తగులబెట్టారు. నల్లగొండలో సుభాష్ సెంటర్‌లో, చిట్యాల, కట్టంగూర్, దేవరకొండలలో నరేంద్రమోడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లందు నియోజక వర్గ కేంద్రాల్లో సీపీఐ(ఎం), సీపీఐ శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. మహబూబాబాద్, కేసముద్రం, కురవి, డోర్నకల్‌లలో రాస్తారోకో చేసి దిష్టిబొమ్మలు తగులబెట్టారు. ఖమ్మం జిల్లాలోని బోనకల్, వైరా, సత్తుపల్లి, కారేపల్లి, ఖమ్మం రూరల్, అర్బన్ తదితర మండలాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దిష్టిబొమ్మలను దహనం చేశారు.

మహబూబ్‌నగర్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ ఆధ్వర్యంలో, గద్వాలలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.



నాగర్‌కర్నూల్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. వనపర్తిలో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. గట్టు, పాన్‌గల్ మండలాల్లో జరిగిన ఆందోళనల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జబ్బార్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బీరం మల్లేశం ఆధ్వర్యంలో, జహీరాబాద్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ చేశారు. మెదక్-సిద్దిపేట జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కామారెడ్డిలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. నిజామాబాద్‌లో ర్యాలీ తీశారు. ఉన్మాదుల దిష్టిబొమ్మను తగులబెట్టారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్, శంకరపట్నంలలో జాతీయ రహదారిపై, జమ్మికుంట, సిరిసిల్లలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. జగిత్యాలలోని అంబేద్కర్ చౌరస్తాలో, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రాస్తారోకో చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై యాకయ్య పాల్గొన్నారు. పెద్దపల్లిలో వామపక్షాల ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

ప్రజాస్వామ్యం తలదించుకుంటున్నది



మొదటిపేజీ తరువాయి

బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో మతోన్మాద దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, బి.వెంకట్, టి.జ్యోతి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఆ పార్టీ నాయకులు పోటు కళావతి, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, ఎస్‌యుసీఐ (సి) నేత మురహరి, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీపీఐ (ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎమ్.శ్రీనివాస్‌తోపాటు వివిధ ప్రజా, కార్మిక, సామాజిక సంఘాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బషీర్‌బాగ్‌లో లెఫ్ట్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

తమ్మినేని మాట్లాడుతూ.. త్రిపురలో మారణహోమాన్ని సృష్టిస్తున్న మతోన్మాదుల చర్యలను బీజేపీ అగ్ర నాయకులు సైతం సమర్థిస్తున్నారని చెప్పారు. దీన్నిబట్టి ఈ ఘటనలు అనుకోకుండా జరిగినవి కావనే విషయం విదితమవుతున్నదని అన్నారు. అధికారంలోకి రాగానే వామపక్షాలపై దాడులకు తెగబడేందుకు వీలుగా ఆరెస్సెస్, బీజేపీ ముందస్తు వ్యూహం పన్నాయని విమర్శించారు. కేవలం లెనిన్ విగ్రహాలనే కాకుండా పెరియార్ రామస్వామి విగ్రహాలను కూడా కూల్చి వేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించే గొంతులను, ప్రజాస్వామ్య, అభ్యుదయ వాదులను లక్ష్యంగా చేసుకుని మతోన్మాదులు దాడులకు తెగబడుతున్నారని.. ఆ కోవలోనే లెనిన్, పెరియార్ విగ్రహాలను కూల్చి వేస్తున్నారని చెప్పారు. ఇలాంటి చర్యలపట్ల దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చాడ మాట్లాడుతూ.. త్రిపుర ఘటనలపై ప్రధాని మోడీ స్పందించకపోవటం శోచనీయమని అన్నారు. దీన్నిబట్టి విగ్రహాల కూల్చివేత వెనుక సంఘ్ పరివార్, బీజేపీ హస్తముందనే విషయం విదితమవుతున్నదని వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యల ద్వారా మతోన్మాదులు ప్రజాస్వామ్య విలువల్ని ధ్వంసం చేస్తున్నారని.. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. సంఘ్ పరివార్.. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అనునిత్యం దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నేతలు భారతమాతను విదేశీ విపణిలో తాకట్టుపెడుతున్నారని విమర్శించారు. స్వదేశీ, స్వదేశీ అంటూ జపం చేస్తున్న వారు.. అన్ని రంగాల్లోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు బార్లా తెరుస్తున్నారని చెప్పారు. గద్దెనెక్కిన తర్వాత కన్నుమిన్ను కానకుండా మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. మురహరి మాట్లాడుతూ.. బీజేపీ హయాంలో ఫాసిస్టు చర్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇవి మరింతగా పెరుగుతాయని చెప్పారు. ప్రజా మద్దతుతో వీటిని ఐక్యంగా తిప్పికొడతామని తెలిపారు.

ఆసరాకు నిధుల్లేవు

మొదటిపేజీ తరువాయి

దాదాపు 38 లక్షల మంది లబ్దిదారులకుగాను రూ. 400 కోట్ల మేర నిధులు అవసరం. డిసెంబరులో ఇవ్వాల్సిన డబ్బును జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మొదటివారంలో పంపిణీ చేశారు. ఈ వ్యవహారాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) పర్యవేక్షిస్తున్నది. ఇందుకోసం సెర్ప్‌లో ప్రత్యేకంగా డైరెక్టర్, ప్రాజెక్టు మేనేజర్ హోదా గల అధికారులకు అప్పగించారు. కాగా ప్రభుత్వం సక్రమంగా, సమయానుకూలంగా నిధులు ఇవ్వకపోవడంతో లబ్దిదారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతా సందిగ్ధమే

ప్రస్తుతం ఆసరా లబ్దిదారులకు జనవరి, ఫిబ్రవరి పింఛన్లు అందాల్సి ఉంది. ఒక్కో నెలకు రూ. 400 కోట్ల చొప్పున రూ. 800 కోట్లు మంజూరు చేయాలి . ప్రభుత్వం మాత్రం అత్తెసరు నిధులు ఇచ్చింది. ఎంత ఇచ్చిందనే విషయాన్ని అధికారులు రహస్యంగా ఉంచుతున్నారు. సమాచారాన్ని చెప్పడం లేదు. విషయమడిగితే నిధులు ఇవ్వలేదని ఒకసారి, పంపిణీ జరుగుతోందని మరోసారి, పూర్తిస్థాయిలో ప్రభుత్వం సొమ్మును విడుదల చేయలేదని ఇంకోసారి ఇలా రకరకాల మాటలు చెబుతున్నారు. స్పష్టత ఇవ్వడం లేదు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ, గ్రామీణ ఆర్థిక శాఖకు మధ్య సమన్వయం కనిపించడం లేదు. ఆర్థిక శాఖ ఒకరకమైన లెక్కలు చెబితే, గ్రామీణ పేదరిక నిర్మూలనా శాఖ(సెర్ప్) కనీస సమాచారం ఇవ్వడం లేదు. పింఛన్ల విషయంలో ఆర్థిక శాఖ అధికారులను అడిగితే జనవరివి రూ. 100 కోట్లు, ఫిబ్రవరివి రూ. 200 కోట్లు ఇచ్చినట్టు పేరు రాయడానికి ఇష్టపడని అధికారి చెప్పారు. గతంలో ఒకేసారి నిధులు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్వో) విడుదల చేసింది. అయితే నిధులు మాత్రం మంజూరు చేయలేదు. నిధులు మాత్రం అదే సెర్ప్ అధికారులు జనవరి పింఛన్ల సొమ్ము కొంత వచ్చిందని, వాటిని పంపిణీ చేస్తున్నామని, ఇంకా పూర్తిస్థాయిలో కాలేదని అంటున్నారు. ఈ లెక్క ప్రకారం ఇంకా రూ. 500 కోట్లు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అలాగే ఫిబ్రవరి డబ్బు సర్కారు నుంచి డబ్బు రాలేదని అంటున్నారు. ఈనేపథ్యంలో పింఛన్ల సొమ్ము ఎంత వచ్చింది ? ఎంత పంపిణీ చేశారు ? అనే విషయాన్ని గోప్యం ఉంచుతున్నది.

సమస్యలు

పింఛన్ల పంపిణీకి ఇటీవలి కాలంలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నోట్ల రద్దు చర్య నేపథ్యంలో పేద లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేసింది. నోట్ల రద్దు మూలంగా బ్యాంకుల్లో నగదు కొరత ఏర్పడింది. అది ఇప్పటికీ సమస్యగానే ఉంది. దీని పరిష్కారం కోసం సెర్ప్ అధికారులు రిజర్వు బ్యాంకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశారు. చర్చలు జరిపారు. అయినా సమస్య పూర్తిస్థాయిలో సమస్య కొలిక్కి కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో లబ్దిదారులకు అధికారులు రోజుకో మాట చెబుతున్నారు. ఇంటికి వచ్చి ఇస్తామని, డబ్బులు రాలేదని, నగదు అందుబాటు లేదని అంటూ దాటవేత వైఖరీని ప్రదర్శిస్తున్నారు. దీంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇతర లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది.

అర్హత లేకున్నా అందలం!

- స్క్రీనింగ్ కమిటీ వద్దన్నా సెలక్షన్స్ - హెచ్‌సీయూ నియామకాల్లో తవ్వినకొద్ది అక్రమాలు



8తెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో వివిధ పోస్టులకు జరిగిన నియామకాల్లో అక్రమాలు తవ్వినకొద్ది బయటపడుతున్నాయి. నిన్న జాతీయత లేకున్నా, పీజీ లేకుండా పీహెచ్‌డీ చేసిన వారికి ఉద్యోగాలు కల్పించిన వర్సిటీ అధికారులు, స్క్రీనింగ్ కమిటీ వద్దని సూచించిన వారికీ కొలువులు కట్టబెట్టారు. అత్యున్నత పదవులుగా భావించే వర్సిటీ అధ్యాపక పోస్టులను అంగట్లో సరుకుల్లా మార్చేసి, నచ్చిన వారికి ఇచ్చేశారు. అప్పటి వర్సిటీ వీసీ, సెలెక్షన్ కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ రామకృష్ణ రామస్వామితో పాటు కొంతమంది వర్సిటీ ఉన్నతస్థానాల్లో ఉన్న వారికి ఈ అక్రమాల్లో పాలుపంచుకున్నారనే అనుమానాలు వస్తున్నాయి. అయితే ఇన్ని అక్రమాలు జరిగినా వీటిని ప్రశ్నించేవారే కరువవ్వడం గమనార్హం.

స్క్రీనింగ్ కమిటీ వద్దన్నా..!

కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం 2011 డిసెంబర్ 17న నోటిఫికేషన్ విడుదల చేసి, 2012 జూన్‌లో 27న సెలక్ట్ చేశారు. ఈ పోస్టుకు బీఈ, బీటెక్ / ఎంఈ, ఎంటెక్ కనీస అర్హత తప్పనిసరి. దీనికితోడు పీహెచ్‌డీతో పాటు 8 సంవత్సరాల అనుభవం కూడా ఉండాలి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిలో 18 మందిని స్క్రీనింగ్ కమిటీ ఇంటర్వ్యూకు పిలిచింది. వీరిలో ఏడుగురు అభ్యర్థులు 8ఎండ్ల అనుభవం ఉందనీ, 9 మందికి పీహెచ్‌డీ చేసిన సమయాన్ని కలుపుకుని అనుభవం ఉందని కమిటీ తేల్చిచెప్పింది. మరో ముగ్గురిని ఎస్సీ కేటగిరిలో ఇంటర్వ్యూకు పిలిచింది. వీరిలో కొంతమందికి కనీస అర్హతలులేవనీ, కాబట్టి వారు అర్హులు కారని ప్రత్యేకంగా వివరించింది. సెలక్షన్ కమిటీ ఐదుగురిని అర్హులుగా ఎంపిక చేస్తే వారిలో స్క్రీనింగ్ కమిటీ అర్హులు కారని చెప్పిన నలుగురు ఉండటం గమనార్హం. ఎంపికైన వారిలో చిన్నవెంకయ్యకు అనుభవం ఉన్నా, బీఈ, బీటెక్/ఎంఈ,ఎంటెక్ అర్హత లేదు. అబ్దుల్ మోయిజ్‌కు బీఈ, బీటెక్/ఎంఈ,ఎంటెక్ అర్హత ఉన్నా, బోధనా అనుభవం లేదు. శోభారాణి, వీపీ నాయర్(ఓసీఐ)లకు బోధనా అనుభవంతో పాటు బీఈ,బీటెక్/ఎంఈ,ఎంటెక్ ఈ రెండు అర్హతలూ లేవు. అయినా ఈ నలుగురికి సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఎస్సీ రిజర్వుడ్ కేటగిరిలో మాత్రం అర్హులేవరూ లేరని కమిటీ నివేదిక చెప్పింది. కనీస అర్హత లేని వారిని ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీ, చిన్నచిన్న అర్హతలు లేవని రిజర్వుడ్ కేటగిరిలో ఎంపిక చేయకపోవడం గమనార్హం.

హెచ్‌ఆర్ కమిటీ అర్హతలేదన్నా...

స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్ విభాగంలో 2012 జూన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టును భర్తీ చేశారు. ఈపోస్టుకు స్క్రీనింగ్ కమిటీ ఐదుగురిని ఇంటర్వ్యూకు పిలిచింది. దీనిలో ఇద్దరు ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. అయితే వీరికి పక్కనపెట్టి, ఆ పోస్టుకు కనీస అర్హతగా ఉన్న 8 ఏండ్ల బోధనా అనుభవం లేకుండానే టీకే సుబ్రమణ్యన్ ముథాట్‌ను ఎంపిక చేశారు.

అనుభవం లేకున్నా, పబ్లికేషన్స్ ఉన్నాయనే పేరుతో అర్హులుగా ప్రకటిస్తున్నట్టు స్క్రీనింగ్ కమిటీ ప్రకటించింది. అయితే ఈ అధికారం స్క్రీనింగ్ కమిటీకి లేదనే విషయాన్ని మాత్రం కమిటీ చైర్మెన్ అమర్‌నాథ్‌తో పాటు సభ్యులు మరిచిపోయారు. హెచ్‌ఆర్ కమిటీ మాత్రం అతనికి బోధనా అనుభవం లేదని అనర్హులని చెప్పింది. అయినా ఆయన్నే సెలక్ట్ చేశారు.

నోటిఫికేషన్ లేకుండానే...

స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్ విభాగంలోనే 2012లోనే ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే, కనీస అర్హతలు లేని మరోకరిని సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. వాస్తవానికి అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు కనీసం ఐదు పబ్లికేషన్స్ ఉండాలి. కానీ కేవలం మూడు పబ్లికేషన్స్ ఉన్న డాక్టర్ ఎస్ ఇలన్‌గోవన్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. వాస్తవానికి ఆయన కంటే ఎక్కువ అనుభవం, జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్ ఉన్నా సత్యవోలు శ్రీనివాస్‌రావు, పి దీపక్ బాబురావులను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది.

డాక్టర్ ఎస్ ఇలన్‌గోవన్‌ను ఎన్‌బీహెచ్‌ఎం గ్రాంట్ కింద నియామకం చేసినట్టు కమిటీ ప్రకటించింది. ఇంత జరిగినా, ఈ నియామకాలపై హెచ్‌సీయూ అధికారులు నోరుమెదకపోవడం గమనార్హం.

ప్రశ్నిస్తే.. దాడులు

8తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

'కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన వారిపై దాడులు జరుగుతున్నాయి. ఇటీవల జరుగుతున్న వాటిని చూస్తూనే ఉన్నాం. నా ఇంటిపై కూడా 'ఐటి' దాడులు జరిగాయి.' అని జనసేన అధ్యక్షుడు, సినీనటుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. గత ఎన్నికల్లో తనను బీజేపీ, టీడీపీ వాడుకొని ఇప్పుడు వదిలేసినట్టుగా తాను భావిస్తున్నానని, ఇది ప్రజల్లోనూ బలంగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరుల ఇష్టాగోష్టిలో అనేక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన కొన్ని ప్రశ్నలకు దాటవేస్తూ, మరికొన్నిటికి సమాధానమిచ్చారు. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా ప్రధానమంత్రి మోడీ అన్యాయం చేసినట్టుగా భావిస్తున్నారా.? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమివ్వలేదు. ప్రత్యేకహోదా ఇస్తానని మోడీ ప్రకటన చేయలేదని, అది బీజేపీ చేసిందని వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పనిచేస్తారా అన్న దానికి సృష్టత ఇవ్వకుండా, ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ.. వైఎస్సార్ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించగా.. బీజేపీకి వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అనుకూలంగా ఉందంటరా..? అని ఎదురు ప్రశ్నించారు. థర్డ్‌ఫ్రంట్‌కు మద్దతిస్తామన్న మీరు.. ఆ ఫ్రంట్‌లో చేరుతారా.? అని ప్రశ్నించగా.. నన్ను చేర్చుకుంటారంటారా.? అని పవన్ గట్టిగా నవ్వారు. సీఎం కేసీఆర్ ఆలోచన బాగుందన్నారు. మంచి నిర్ణయాలున్నప్పుడే కేసీఆర్‌ను అభినందించానన్నారు. బలమైన వ్యక్తిగా ఏదైనా చేస్తారనే ఉద్దేశంతోనే తాను 2014 ఎన్నికల్లో నరేంద్రమోడీకి మద్దతు పలికానని చెప్పారు. హోదాతోనే ఏపీకి న్యాయమని, హోదా ఇవ్వకుంటే ఉత్తరాది, దక్షిణాది అనే తేడాలు వస్తాయని కేంద్రాన్ని హెచ్చరించారు. హోదా విషయంలో ప్రధాని మోడీ తనను డిసప్పాయింట్ చేశారని అన్నారు. తాను తీవ్ర అసంతప్తితో ఉన్నానని చెప్పారు. కేంద్రంతో గొడవలు పెట్టుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అనుకోవాలని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో తన స్టాండ్ ఏమిటో ఈ నెల 14న గుంటూరులో జరిగే జనసేన ఆవిర్భావ సభలో ప్రకటిస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నిసీట్లలో పోటీ చేస్తానన్నది కూడా ప్రకటిస్తానని తెలిపారు. తెలంగాణలోనూ పార్టీ తప్పకుండా ఉంటుందన్నారు. బీజేపీ, టీడీపీ తనను చిన్నపిల్లాడిగా భావిస్తున్నాయని, అన్నింటికి 14న సమాధానం చెబుతానని తెలిపారు. ముఖ్యమంత్రి పదవిలో కూర్చుంటారా.? అని ప్రశ్నించగా.. మనం అనుకుంటే.. ప్రజలు చేసేస్తారా.? అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో మోడీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేస్తానా.? లేదా.? అన్నది ప్రజాభీష్టం ప్రకారమే ఉంటుందని తెలిపారు. తనకు సినిమాల్లో నటించాలని ఉంది కానీ, రాజకీయాల కారణంగా సమయం లేదని పవన్ వ్యాఖ్యానించారు.

రెండు సినిమాలకు అంగీకరించానని, వాటికి సమయం చిక్కడం లేదన్నారు. కేంద్రంతో గొడవలు పెట్టుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అనుకోవాలని ప్రశ్నించారు.

స్వప్రయోజనాల కోసమే..

ప్రత్యేకహోదా అంశాన్ని కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని పవన్ ఆరోపించారు. హోదా సాధన కోసం అందరినీ కలుపుకొని ఉద్యమిద్దామని అనుకుంటే.. ఆఖరివరకూ నిలబడతారన్న నమ్మకం లేదన్నారు. సినిమాల్లో నటించే నాకు.. రాజకీయ నాయకుల నటనను అర్థం చేసుకోలేక పోతున్నానని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రులు రాజీనామా చేస్తారంటూ వస్తున్న వార్తలను ప్రస్తావించగా.. ఇప్పుడు చేసినా సాధించేదీ లేదన్నారు. మొదట్లోనే రాజీనామాచేసిన పక్షంలో పరిస్థితి ఈ విధంగా ఉండేది కాదు అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో టీడీపీ, వైసీపీ ఎంపీలు ఆశించిన స్థాయిలో పోరాటం చేయలేదన్నారు. బీజేపీ ఇచ్చిన హామీ ప్రకారం ఏపికి హోదా ఇవ్వని పక్షంలో రాష్ట్రంలో పరిస్థితులు అదుపు తప్పుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హోదా సాధన కోసం ఎవరు కలిసొచ్చినా.. రాకున్నా.. తాను ముందుకు సాగుతానని ఆయన ప్రకటించారు. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేనప్పుడు, ఢిల్లీకి వెళ్లి సాధించేమీ లేదని, రాష్ట్రంలోనే ఉద్యమిస్తానని చెప్పారు. ప్రత్యేక హోదా ఇస్తామని ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చెప్పడం మంచిదేనని, శుభపరిణామం అని పవన్ అన్నారు. తప్పు చేశామనే భావన కాంగ్రెస్‌లో వచ్చిందనుకుంటానని చెప్పారు. దీనివల్ల ఎన్నికల్లో ఏపిలో కొన్ని ఓట్లు పడవచ్చునన్నారు. ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని తెలిపారు. జెఎఫ్‌సి పరిశోధనలో తేలిన అంశాలపై అధ్యయనం చేశానని చెప్పారు.

మాఫియా నేతలే 8యం

రాజకీయ నాయకుల కంటే మాఫియా లీడర్లు నయమని పవన్ వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు ఇచ్చిన మాట మీద నిలబడరని, అదే మాఫియా లీడర్లయితే.. ఇచ్చిన మాట ప్రకారం నిలబడతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అవిశ్వాసం పెట్టినా.. ఉపయోగం లేదన్నారు.

అవిశ్వాసం ఇప్పుడుపెట్టి ఏం చేస్తారని ప్రశ్నించారు. సమావేశాల ప్రారంభ సమయంలోనే అవిశ్వాసం పెట్టి ఉంటే..చర్చ జరిగేదన్నారు. కేంద్రంతో సయోధ్యగా ఉన్న చంద్రబాబు, పక్కరాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనూ సఖ్యతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారిమధ్య ఉన్న తగాదాలను ప్రజలకు అంటిస్తున్నారని వ్యాఖ్యానించారు.

రుణాలు ఎగ్గొట్టడంలో కళాకారుడివి..

- గౌతం అదానీపై సుబ్రమణ్యస్వామి సంచల8వ్యాఖ్యలు
- రూ.72 వేలకోట్లు ఎగ్గొట్టారు..నిజమా ?కాదా?
- ఇంతజరుగుతున్నా విచారణ జరపరా... ప్రభుత్వానికే సిగ్గుచేటు

"ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్ని అదానీ గ్రూప్ చెల్లించలేదు. ఈ రుణాల్ని ప్రభుత్వ బ్యాంకులు 'మొండి బకాయిల' జాబితాలో చేర్చింది. అతన్ని ఎవరూ ప్రశ్నించటం లేదు. దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి(ప్రధాని నరేంద్రమోడీ)తో అదానీ సన్నిహితంగా మెలగటమేంటి ? అది కేంద్రానికి సిగ్గుచేటు"...ఈ మాటలంటున్నది ప్రతిపక్ష పార్టీలు కాదు. అధికార బీజేపీ పార్టీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి...మోడీ సర్కార్ తీరును ఎండగడుతున్నారు. ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆషామాషీగా తీసేయదగ్గవి కావు.

న్యూఢిల్లీ: బీజేపీ రాజ్యసభ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి, కార్పొరేట్ లాబీకి మధ్య ఏదో ఉందన్న అనుమానాల్ని ఈ వ్యాఖ్యలు బలపరుస్తున్నాయి. నౌకాశ్రయాల నిర్మాణం, విద్యుత్తు, బొగ్గు వ్యాపారం..తదితర రంగాల్లో 'అదానీ గ్రూప్' కార్యకలాపాల్ని నిర్వహిస్తోంది. ఈ కంపెనీకి సంబంధించి సుబ్రహ్మణ్యస్వామి లేవనెత్తిన అనుమానాలు ఇలా ఉన్నాయి..

"బ్యాంకుల నిరర్థక ఆస్తులకు అదానీని బాధ్యుడ్ని చేయాల్సిన తరుణం వచ్చింది. లేకుంటే ఈ విషయంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తాను. అదానీ గ్రూపు సంస్థలపై ఉన్న కేసులు, నిరర్థక ఆస్తులు, బొగ్గు దిగుమతులు, ఆస్ట్రేలియాలోని ఆయన వ్యాపార కార్యకలాపాలపై ప్రభుత్వం నివేదిక తెప్పించుకోవాలి. అదానీ గ్రూప్‌నకు ఇచ్చిన రూ.72 వేల కోట్ల రుణాల్ని మొండి బకాయిల జాబితాలో చేర్చారు. ఇందులో నిజానిజాల్ని తేల్చాలి"అని ట్విట్టర్ ద్వారా వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక అదానీ కంపెనీ వ్యవహారాలు మరింత ఊపందుకున్నాయన్నది నిజం. మోడీ అధికారంలోకి రాకముందు అదానీ సంపద రూ.12 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.91 వేల కోట్లకు పెరిగింది. మరోవైపు ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్ని ఎగ్గొట్టింది. అదానీ ఆడింది ఆట..పాడింది పాటగా సాగుతోందంటే, ప్రధాని మోడీతో ఉన్న సాన్నిహిత్యం, బీజేపీ ప్రభుత్వం అండదండలు...అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లేదు...రెగ్యులర్‌గా రుణాల్ని చెల్లిస్తున్నాం : అదానీ గ్రూప్

తక్కువ సమయంలో ప్రపంచస్థాయి మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టిన చరిత్ర మాకుంది. మూలధనం ఎక్కువగా అవసరమయ్యే (క్యాపిటల్ ఇంటెన్సివ్) పరిశ్రమలకు రుణాలు అనివార్యమవుతాయి. దేశీయ, అంతర్జాతీయ బాండ్లు ఈసీబీ రుణాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల నుంచి రుణాలు మాకు అందుబాటులో ఉన్నాయి. ఇండియాలో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సుమారుగా రూ.34 వేల కోట్లు. వీటిని నిర్ణీత కాల వ్యవధితో రుణ వాయిదాల్ని చెల్లిస్తున్నాం.

నవతెలంగాణ ఎఫెక్ట్

- సచివాలయంలో నూత8క్యాంటీన్ భవ8నిర్మాణం
- ప్రస్తుత క్యాంటీన్ స్థలం మార్పు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సచివాలయంలో "ఈ చెత్తేంది సారూ.. అపరిశుభ్ర వాతావరణంలోనే క్యాంటీన్ నిర్వహణ" అన్న శీర్షికన "నవతెలంగాణ" దినపత్రికలో గత వారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సచివాలయంలో నూతన క్యాంటీన్ భవనం నిర్మించేందుకు బుధవారం పనులు ప్రారంభించారు. సచివాలయం పాత ద్వారం ఎదురుగా కొత్త క్యాంటీన్ భవన నిర్మాణం చేపడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న క్యాంటీన్‌ను ప్రస్తుతం నల్ల పోచమ్మ ఆలయం పక్కకు తరలించారు. క్యాంటీన్ పరిసర ప్రాంతంలో ఎక్కడా చెత్త పోయకుండా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు.

పరిపాలనలో ప్రత్యేక ముద్ర

8తెలంగాణ - సిటీబ్యూరో/వి గోపాలరావు

హైదరాబాద్ జిల్లాలో అత్యధిక శాతం మహిళా అధికారులే ఉన్నారు. కలెక్టర్ నుంచి అటెండర్ దాకా, డివిజన్‌లో ఆర్డీవో, మెజార్టీ మండలాల్లో తహసీల్దార్లు, కలెక్టరేట్‌లోని దాదాపు అన్ని సెక్షన్లకు సంబంధించిన ఉన్నతాధికారులంతా మహిళలే. విధుల నిర్వహణలోనూ ప్రత్యేక ముద్ర చాటుకుంటున్నారు. కొందరు రెండేసి విభాగాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌గా డాక్టర్ యోగితారాణా, జాయింట్ కలెక్టర్‌గా నిఖిల, జిల్లా రెవెన్యూ అధికారిణిగా సరళా వందనం, సికింద్రాబాద్, హైదరాబాద్ రెవెన్యూ డివిజన్‌ల ఆర్డీవోగా కె.చంద్రకళ, జిల్లా భూ పరిరక్షణ అధికారిణిగా రాధికారమణి, లా విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సంగీత, యూఎల్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా లీలా, డిప్యూటీ కలెక్టర్‌గా విజయలక్ష్మీ, విద్యాశాఖ అధికారిణిగా వెంకటనర్సమ్మ, ఇంటర్మీడియట్ విద్యాధికారిణిగా జయప్రదబాయి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణిగా జీకే సునంద, బీసీ సంక్షేమ అధికారిణిగా ఎంబీకే మంజుల, ఎంప్లాయిమెంట్ అధికారిణిగా ఎన్.మైత్రీప్రియ, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్‌గా నాగలక్ష్మీ, టామ్‌కామ్(ఉద్యోగాల కోసం విదేశాలకు పంపించే విభాగం) జనరల్ మేనేజర్‌గా నాగభారతి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణిగా డాక్టర్ పద్మజ విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో జేసీ నిఖిల, డీఆర్వో సరళావందనం, ఆర్డీవో చంద్రకళ, డిప్యూటీ కలెక్టర్ రాధికారమణి, బీసీ సంక్షేమ అధికారిణి ఎంబీకే మంజుల అదనపు బాధ్యతలు చేపడుతున్నారు. జిల్లాలో 16 మండలాల్లో ఎనిమిది మండలాలకు తహసీల్దార్లు మహిళలే. కలెక్టరేట్‌లోని అనేక సెక్షన్లకు మహిళలే సూపరింటెండెంట్లు. వీరితో పాటు సహాయక అధికారులుగా అనేక మంది పనిచేస్తున్నారు.

టాప్‌టెన్‌లో ఒకటిగా హైదరాబాద్...

మెజార్టీగా మహిళా అధికారులే పరిపాలిస్తున్న హైదరాబాద్ జిల్లా దేశంలోనే టాప్‌టెన్‌గా నిలిచింది. 'బేటీ బచావో- బేటీ పడావో' పథకాన్ని పటిష్టంగా అమలు చేయటంతో కేంద్ర ప్రభుత్వం టాప్ టెన్ జాబితాలో హైదరాబాద్ జిల్లాను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రెటరీ అశోక్‌కుమార్ యాదవ్ కలెక్టర్‌కు తెలియజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న రాజస్థాన్‌లోని జుంజునులో కేంద్ర ప్రభుత్వం ద్వారా సత్కారం అందుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కలెక్టర్ యోగితారాణా ప్రధాని చేతుల మీదుగా సత్కారాన్ని అందుకోనున్నారు.

మల్టీ టాస్కింగ్ శక్తి సామర్థ్యాలు
డాక్టర్ యోగితారాణా- కలెక్టర్

స్కాండినేవియా దేశాలైన డెన్మార్క్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్ దేశాల్లో అవినీతి చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే అక్కడ మహిళలే అత్యధికంగా అధికారులు, ఉద్యోగులు. మహిళలు చాలా సెన్సిటీవ్‌గా ఉంటారు. పట్టుదలగా పనిచేస్తారు. వీరిలో మల్టీ టాస్కింగ్ కెపాసిటీస్ దాగుంటాయి. ఇంటి పనితో పాటు ఉద్యోగం కూడా చేయగలరు. మగవాళ్లు అన్ని రకాల పనులు చేయలేరు. జిల్లా పరిపాలనా రంగంలో మహిళా అధికారులే ఉండి పాలించడం చాలా సంతోషంగా ఉంది.

యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

మొదటిపేజీ తరువాయి

నిలిచిపోయాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అయితే.. అదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేస్తామని మీరుట్ పరిపాలనా విభాగం హామీనివ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అంతకుముందు త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్ విగ్రహాలను దుండగులు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

కేంద్ర క్యాబినెట్ నుంచి టీడీపీ బయటకు..

మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులు చెప్పాలని ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్ర క్యాబినెట్‌లో చేరినట్టు చెప్పారు. ఏపీకి హోదా సాధ్యం కాదని, సెంటిమెంట్‌తో నిర్ణయం తీసుకోవడం కుదరదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి జైట్లీ మాట్లాడుతున్నారని చెప్పారు. అన్ని ప్రయత్నాలు జరిగిన తర్వాత విధిలేని పరిస్థితుల్లోనే కేంద్ర క్యాబినెట్ నుంచి వైదొలగాలని నిర్ణయించినట్టు ఆయన వివరించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)
▼ 284 33,033	▼ 95 10,154	64.19	రూ. 30,457	రూ. 40,600





కోడిగుడ్లు

హైదరాబాద్	345	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	4.5	చెన్నై	395
వరంగల్	347	ముంబయి	390



ప్రతికూలతతో మరింత పతనం

- భారీగా ప్రభావం చూపిన బ్యాంకింగ్ రంగ స్టాక్స్
- ఆందోళన కలిగించిన అమెరికన్ అంతర్గతం..
- మరో 284 పాయింట్లు కుంగిన బీఎస్ఈ సెన్సెక్స్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు మరింతగా కుంగాయి. అంతకు ముందు సెషన్ల నష్టాలను కొనసాగిస్తూ బుధవారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు దాదాపు మరో శాతం మేర కిందకు జారాయి. దేశీయ బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న అనిశ్చితికి తోడు పీఎన్‌బీ స్కామ్ విషయంలో విచారణ సంస్థలు వేగం పెంచడం.. అమెరికా ట్రేడ్‌వార్ నేపథ్యంలో అక్కడి ఆర్థిక సలహాదారు గ్యారీ కోన్, ఫ్రీట్రేడ్ విషయాల సహాయకుడు గ్రేచాన్ రాజీనామా చేయడంతో ట్రంప్ వాణిజ్య యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు ప్రపంచ మార్కెట్లు భావించాయి. వీరు అనూహ్యంగా రాజీనామాతో గ్లోబల్ స్టాక్స్ కుప్పకూలాయి. ఈ నేపథ్యంలో బుధవారం ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు ఆది నుంచి నష్టాల్లోనే కదలాడాయి. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 284 పాయింట్లు పతనమై 33,033 పాయింట్లకు జారింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 95 పాయింట్లు నష్టపోయి 10,154 పాయింట్ల వద్ద స్థిరపడింది. ముఖ్యంగా ఆంధ్రాబ్యాంక్, కెనరా బ్యాంక్, అలహాబాద్ బ్యాంకుల షేర్లు భారీగా నష్టపోయాయి. నిన్న ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల ఆధికారులు ఎస్ఎఫ్ఐవో ఆఫీస్‌లో విచారణకు హాజరుకావడం మార్కెట్ భయాలను మరింత పెంచింది. యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, పీఎఫ్‌సీ, అలహాబాద్ బ్యాంకు, కర్ణాటక బ్యాంకుల స్టాక్స్ కూడా తాజాగా 52 వారాల కనిష్టానికి చేరాయి. జపాన్ మార్కెట్లు, కొరియా మార్కెట్లు కూడా నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల ఆందోళనలతో పాటు, దేశీయంగా కూడా సెంటిమెంట్ బలహీనంగా ఉడడం వల్లే దేశీయ మార్కెట్లు కుంగాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

టెలికాంలో 47 లక్షల నిపుణుల కొరత



న్యూఢిల్లీ: దేశీయ టెలికాం రంగంలో రానున్న నాలుగేండ్ల కాలంలో దాదాపు 47 లక్షల నిపుణులైన ఉద్యోగుల అవసరం ఏర్పడనుందని ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌లో తెలిపింది. ప్రస్తుతం ఈ రంగంలో ఉన్న దాదాపు 40 లక్షల మందికి ఇది అదనమని పేర్కొంది. 2021-22 నాటికి టెలికాం రంగంలో 119.25 శాతం వృద్ధితో ఈ రంగంలో అదనంగా మరో 47,75,500 మంది నిపుణుల కొరత ఏర్పడనుందని టెలికాం మంత్రి మనోజ్ కుంమార్ సిన్హా లోక్‌సభలో వెల్లడించారు. టెలికాం శాఖ రూపొందించిన 'స్కిల్ పాన్' నివేదకలను ఉటంకిస్తూ ఆయన బుధవారం పార్లమెంట్‌కు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఈ రంగంలో కొంత అనిశ్చిత పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ సమీప భవిష్యత్తులో ఇవి పూర్తిగా దూరమవుతాయని సర్కారు తెలిపింది.

నేటి నుంచి విమానాల పండుగ

- ముస్తాబైన బేగంపేట్ ఎయిర్‌పోర్టు
- 10 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- ప్రాంతీయ అనుసంధనతే లక్ష్యం
- ప్రదర్శనకు 15 వినూత్న విమానాలు
- విమాన సంస్థల సీఈవోల రౌండ్‌టేబుల్ సదస్సు..



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: మరో అంతర్జాతీయ ప్రదర్శనకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. 'వింగ్స్ ఇండియా-2018' పేరుతో నాలుగు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన నేటి (గురువారం) నుంచి బేగంపేట్ విమానాశ్రయంలో ప్రారంభం కానుంది. ప్రతీ రెండేండ్లకోసారి జరిగే ఈ ప్రదర్శనను భారత పౌర విమానయాన శాఖ, విమానాశ్రయాల అభివృద్ధి ప్రాధికారిక సంస్థ(ఏఏఏ), ఫిక్కీలు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నాయి. 'వింగ్స్ ఇండియా-2018' కార్యక్ర మాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావులు ప్రారంభించనున్నారు. ఈ అంతర్జాతీయ ప్రదర్శనకు దాదాపు పది దేశాల నుంచి వైమానిక రంగానికి చెందిన ప్రముఖులు, సంస్థలు, అధికారులు పాల్గొననున్నట్టుగా సమాచారం. అమెరికా, జపాన్, బ్రిటన్, రష్యా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, మలేషియా, హాంకాంగ్, ఇటలీ, ఇరాన్‌తో సహా పలు ఇతర దేశాలకు చెందిన విమానయాన రంగంలోని కంపెనీల విమానాలు ఈ ప్రదర్శనలో కనువిందు చేయనున్నాయి. ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు, అధినేతలు కూడా ఈ ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేయనున్న సమావేశాల్లో పాల్గొననున్నారు.

ప్రాంతీయ విస్తరణే లక్ష్యంగా..

'ఇండియా గ్లోబల్ ఏవియేషన్ హబ్' అనే థీమ్‌తో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రధానంగా పట్టణాలకు, నగరాలకు విమాన సర్వీసులతో ప్రాంతీయ అనుసంధానతను పెంచడమే ధ్యేయంగా సదస్సులు జరగనున్నట్టుగా నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ప్రదర్శన వేదికగా అనుసంధానతను పెంచేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ విమానయాన సంస్థలతో చర్చలు జరిపేందుకు, తమ ఆలోచనలను పంచుకొనేందుకు, పెట్టుబడుల గురించి చర్చించేందుకు వీలుగా పలు సమావేశాలు జరగనున్నాయి.

15 విమానాలు.. 125 స్టాల్స్..

ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 125 సంస్థల ఎగ్జిబిటర్లు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. బోయింగ్, ఏటీఆర్, హోండా, ఎంబ్రారర్, డస్సాల్ట్, ఎయిరిండియా, జూమ్ ఎయిర్, ఎన్ఏఎల్ వంటి సంస్థలు దాదాపు 15 విమానాలను ఇక్కడ ప్రదర్శించనున్నాయి. విమానాల్లో టూరిజం, కార్గో, లాజిస్టిక్స్‌కు ఉన్న అవకాశాలను గురించి ఈ ప్రదర్శనలో సీఈవోల రౌండ్ టేబుల్ ఫోరమ్ సమావేశం మొత్తానికి కీలకం కానుంది.



ఏడాదిన్నరలో 51 కొత్త విమానాశ్రయాలు



దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా చిన్న నగరాలకు, పట్టణాలకు కూడా విమాన సర్వీసులను విస్తరించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పదేహీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బిజ్ఏవీఇండియా-2018 సదస్సులో ఆమె ప్రసంగిస్తూ విమానాశ్రయాల అభివృద్ధికి గాను అవసరమైన నిధులను కేటాయించిందని వివరించారు. కార్యక్రమంలో ఏఏఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీకే చౌకియాల్ మాట్లాడుతూ రానున్న ఏడాదిన్నర కాలంలో దేశంలో కొత్త 51 కొత్త విమానాశ్రయాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ప్రస్తుతం దేశంలో కేవలం 15-16 విమానాశ్రయాలు దేశంలోని మొత్తం ఎయిర్ ట్రాఫిక్‌లో 80 శాతం వాటాను కలిగి ఉన్నాయన్నారు.

నా ఆస్తుల్ని తిరిగి ఇప్పించండి..!

- కోర్టుకు పీఎన్‌బీ స్కామర్ మోడీ అర్జీ
- ఈడీకి నోటీసులిచ్చిన ఢిల్లీ హైకోర్టు
- స్కామ్‌పై పూర్తి స్పష్టత లేదని వ్యాఖ్య



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్కామ్ ప్రధాన నిందితుడు నీరవ్ మోడీ ఈ కేసు నుంచి బయటపడేందుకు మైండ్ గేమ్‌ను ఆడటం మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా ఆయన విచారణ సంస్థ ఈడీపై తన తొలి ఆయుధాన్ని ఎక్కిపెట్టాడు. ఈడీకి వ్యతిరేకంగా ఆయన తన సంస్థ ఫైర్‌స్టార్ ద్వారా ఢిల్లీ హైకోర్టులో దావా వేశారు. ఈడీ జప్తు చేసిన తన ఆస్తులన్నింటిని తిరిగి తనకు ఇప్పించాలని కోరారు. పథకం ప్రకారం అధికారులు తనను ఇరికిస్తున్నారంటూ న్యాయవాది ద్వారా కోర్టుకు మొర పెట్టుకున్నాడు. నీరవ్ మోడీ అప్పీల్‌పై ఢిల్లీ హైకోర్టు బుధవారం ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో పేర్కొన్న మొత్తంపై స్పష్టత లేదని కోర్టు పేర్కొంది. ఈ కేసులో ఈడీ ఏ అధికారాలతో ఆస్తుల సోదాకు వెళ్లిందో స్పష్టత కొరవడిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేసులో వివరాలు అసమగ్రంగా ఉన్నాయని.. దీనిపై ఈడీ జవాబు కోసం వేచిచూస్తామని పేర్కొంది. కేసు వివరాలపై నీరవ్ మోదీ న్యాయవాది విజయ్ అగర్వాల్ సైతం గందరగోళంలో ఉన్నారంటూ కేసు విచారణను ఈనెల 19కు వాయిదా వేసింది. పీఎన్‌బీ స్కామ్‌లో నీరవ్ మోదీని, ఆయన సంస్థలను ప్రాసిక్యూట్ చేసేందుకు ఇటీవల డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు విచారణకు హాజరయ్యేందుకు నీరవ్ నిరాకరించడంతో ఆయనపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని కోరుతూ ఈడీ మనీల్యాండరింగ్ నిరోధక కోర్టు (పీఎంఎల్ఏ)ను ఆశ్రయించిన సంగి తెలిసిందే.

సొమ్ము రాబట్టుకోవడం అసాధ్యమే...

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కేసులో రూ.1,000 కోట్లను రాబట్టుకోవడం దాదాపు అసాధ్యమని బ్యాంకింగ్ రంగ నిపుణులు తేల్చినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఎఫ్ఐవో అధికారులకు సాయం చేసేందుకు విచారణ సంస్థలు రెండు ప్రైవేటు బ్యాంకులకు చెందిన అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందపు సభ్యులు కుంభకోణానికి సంబంధించి, నీరవ్ మోదీ, గీతాంజలి జ్యూవెలర్స్‌కు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలిదశలో భాగంగా స్కామ్ మొత్తంలో రూ.1,000 కోట్ల వరకు సొమ్మును రాబట్టుకునే అవకాశమే లేదని తేల్చి చెప్పారు.

మార్కెట్లోకి కొత్త సూపర్ స్ప్లెండర్



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటో కార్ప్ (హెచ్ఎంసీఎల్) అధునాతన సూపర్ స్ప్లెండర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధరను కంపెనీ రూ.57,190గా (ఎక్స్‌షోరూమ్- ఢిల్లీ) నిర్ణయించింది. 125 సీసీల విభాగంలో ఇప్పటికే స్ప్లెండర్ రారాజుగా వెలుగొందుతోందని ఈ నేపథ్యంలో మార్కెట్లో తన వాటాను మరింతగా పెంచుకొనేందుకు ఈ కొత్త వాహనాన్ని తీసుకువచ్చినట్టుగా కంపెనీ తెలిపింది. స్ప్లెండర్‌ను మరింతగా ఆధునికీకరించి, ఆకర్షణీయమైన రూపంతో కొత్త స్ప్లెండర్‌గా మార్కెట్లోకి తెచ్చినట్టుగా హెచ్ఎంసీఎల్ వివరించింది. ఈ వాహనాన్ని ఐ3 టెక్నాలజీతో కూడిన 125 సీసీ టీవోడీ ఇంజిన్‌తో రూపొందించారు. దీంతో ఇది 27 శాతం అధిక సామర్థ్యంతో పని చేయనుందని కంపెనీ తెలిపింది. మఫ్లర్‌పై క్రోమ్ కవర్, అధునికీకరించిన టెయిల్ ఎల్ఈడీ ల్యాంప్‌తో పాటు అయిదు రంగులలో కొత్త వాహనం అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. పెద్ద వెనుక టైరు దీనికి అదనపు హంగని హెచ్ఎంసీఎల్ వివరించింది.

బీసీల పట్ల మొసలి కన్నీరు : మంత్రి జోగు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

దేశాన్ని అనేకాండ్లపాటు ఏలిన కాంగ్రెస్, బీజేపీలు బీసీల సంక్షేమ పట్ల మొసలికన్నీరు కార్చాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బుధవారం ఆయన టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీ ఓబీసీ వర్గానికి చెందిన వారయినప్పటికీ బీసీ సంక్షేమం కోసం చేసిన ఒక్క పనైనా చెప్పగలరా ? అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. దేశం దశ మార్చేందుకే కేసీఆర్ మూడో రాజకీయ ఫ్రంట్ ఆలోచన తెర పైకి తెచ్చారని అన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే ఓబీసీ మంత్రిత్వ శాఖ ప్రతిపాదన తెరపైకి తెచ్చారని చెప్పారు.

మభ్యపెట్టేందుకే ఫ్రంట్ : కోదండరామ్

నవతెలంగాణ- మెదక్ అర్బన్

థర్డ్ ఫ్రంట్ పేరిట తెలంగాణ ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని టీజేసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో రైతులు, నిరుద్యోగ సమస్యలపై టీజేఏసీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని సీఎం కేసీఆర్, దేశంలోని రైతాంగాన్ని పట్టించుకుంటామనడం హాస్యాస్పదమన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వం నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఎన్నికలప్పుడు లక్ష ఉద్యోగాలు అని ఎన్నో గొప్పలు చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు ఎన్ని ఇచ్చారో తెలుపాలన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రైతులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున్న ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యావేత డాక్టర్ బానాపూరం మధుసూదన్‌రెడ్డి, టీజేసీ కన్వీనర్ డాక్టర్ పురుషోత్తం, జిల్లా చైర్మెన్ సడిమెల యాదగిరి పాల్గొన్నారు.

హెచ్‌సీయు అక్రమాలపై విచారణ జరపాలి: ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయు)లో చోటు చేసుకున్న అక్రమాలపై వెంటనే విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం. నాగేశ్వర్‌రావు, కోట రమేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు, సహకరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎంపీటీసీ భర్త హత్య

నవతెలంగాణ- గంభీరావుపేట

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి ఎంపీటీసీ భర్తను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన బుధవారం సాయం త్రం జరిగింది. గ్రామస్తులు, మృతుని బంధువులు వివరాల ప్రకారం.. కొత్తపల్లి ఎంపీటీసీ బీనవేని చంద్రకళ భర్త దేవయ్యకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డికి కొంత కాలంగా వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. ఫీల్ట్‌అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి పని విషయమై తరచూ దేవయ్య పర్యవేక్షిస్తూ ప్రశ్నిస్తుండటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగేది. ఇరు కుటుంబాల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామంలో పెండ్లి విందుకు దేవయ్య హాజరుకాగా అదే విందుకు శ్రీనివాస్‌రెడ్డి కొడుకు సందీప్ కూడా వచ్చాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవ పడ్డారు. అప్పటికే సందీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దేవయ్యను విచక్షణా రహితంగా పొడిచాడు. దేవయ్య అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. ఎల్లారెడ్డిపేట సీఐ రవీందర్, గంభీరావుపేట ఎస్ఐ జాఫర్ శరీఫ్ వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలెక్టర్లను నియమించరా?

- ఇన్‌చార్జ్‌ల పాలనలో ఐదు జిల్లాలు
- కుంటు పడిన పాలనా వ్యవస్థ

- కొండూరి రమేశ్‌బాబు



రాష్ట్రంలోని కీలకమైన ఐదు జిల్లాలకు కలెక్టర్లు లేక పోవటంతో ఇన్‌ఛార్జీల పాలన కొనసాగుతున్నది. ఫలితంగా పాలనా వ్యవస్థ కుంటుపడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రాల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'గ్రీవెన్స్ డే' పాటిస్తారు. జిల్లాలలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లా కలెక్టర్ల కార్యాలయాలకు వచ్చి తమ సమస్యలను జిల్లా కలెక్టర్ల దృష్టికి తెచ్చే ఈ అవకాశం కూడా లేకుండా పోయిందని ఐదు జిల్లాల ప్రజలు వాపోతున్నారు. గ్రీవెన్స్ డే నాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్లు రాక పోవటం, జాయింట్ కలెక్టర్లు కూడా పట్టించుకోక పోవటంతో జిల్లా రెవిన్యూ అధికారులే మొక్కుబడిగా వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. ఇవి పరిష్కారానికి నోచుకోవటం లేదనే ఫిర్యాదులు రాష్ట్ర ప్రభుత్వానికి అందుతున్నాయి. హేతుబద్ధత లేకుండా రాజకీయ కారణాలతో ఇష్టం వచ్చిన రీతిలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిందనే ఆరోపణలు సద్దుమణగక ముందే కొత్త జిల్లాల్లో పాలనా వ్యవస్థను గాడిలో పెట్టలేకపోయిందనే అపవాదును కూడా ప్రభుత్వం కూడగట్టుకున్నది. ప్రధానంగా ఐదు జిల్లాలకు పూర్తిస్థాయి కలెక్టర్లు లేక పోవటం, గ్రూప్ 1 అధికారులనే జాయింట్ కలెక్టర్లుగా నియమించటం వంటి కారణాలతో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగటం లేదని తెలుస్తున్నది. ఉత్తర తెలంగాణలో అతి ముఖ్యమైన పూర్వపు వరంగల్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించి వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలుగా ఏర్పాటు చేసింది. ఈ ఐదు జిల్లాలకు కలెక్టర్లు లేక పోవటంతో ఇన్‌చార్జీలతో కాలం గడుపుతున్నారు. డిసెంబర్ 16 న జిల్లా కలెక్టర్లను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం కొన్ని జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించలేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఎ. మురళిని బదిలీ చేసి ఏమాత్రం ప్రాధాన్యత లేని స్టేట్ ఆర్కివ్స్ డైరెక్టర్‌గా నియమించింది. ఆయన స్థానంలో మరొక కలెక్టర్‌ను నియమించకుండా మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. భూపాలపల్లికి మంచిర్యాల పక్క జిల్లా కూడా కాకపోవటం విశేషం. దేశంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరుగాంచిన మేడారం జాతర సమయంలో కూడా అక్కడ కలెక్టర్ లేక పోగా ఇన్‌చార్జి కలెక్టర్‌తోటే ఏర్పాట్లను పూర్తి చేసింది. ఫలితంగా అధికారుల మధ్య సమన్వయం లోపించిందనే ఆరోపణలు వచ్చాయి. అధికార పార్టీ శాసనసభ్యుడిపై ఆరోపణలు చేసినందుకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రీతి మీనాను హైదరాబాద్ బదిలీ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో ఎవరినీ కలెక్టర్‌గా నియమించలేదు. ఖమ్మం జిల్లా కలెక్టర్ లోకేశ్‌కుమార్‌కు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఆదనపు బాధ్యతలను అప్పగించారు. అధికార పార్టీ శాసనసభ్యుడిపై ఆరోపణలు చేసిన జనగామ జిల్లా కలెక్టర్ దేవసేనను బదిలీ చేసి పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఆమె స్థానంలో మరొక కలెక్టర్‌ను నియమించకుండా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. వరంగల్ రూరల్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను కొమ్రం భీం జిల్లా కలెక్టర్‌గా నియమించి ఆయన స్థానంలో ఎవరినీ నియమించకుండా వరంగల్ ఆర్బన్ కలెక్టర్ ఆమ్రపాలికి అదనపు బాధ్యతలను అప్పగించారు. వివాహం కోసం అమె దీర్ఘకాలిక సెలవులో వెళ్లటంతో రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లకు ఆదనపు బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతున్న ఐదు జిల్లాల్లో పాలనా వ్యవహారాలు కుంటుపడ్డాయి. ఇన్‌చార్జి కలెక్టర్ల పాలనలో ఉన్న జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో వివిధ శాఖలకు జిల్లా అధికారులు లేక పోవటం, ఉన్న కొద్దిమందీ కూడా వరంగల్ నగరానికే పరిమితం కావటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రాల్లో భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి కలెక్టర్లు వారానికి ఒకసారి కూడా అక్కడికి రాక పోవటంతో అక్కడి పాలనా వ్యవహారాలు కుంటుపడ్డాయి. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, భూసేకరణ, పునరావాసం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలపై అజమాయిషీ లేక పోవటంతో ఈ కార్యక్రమాలన్నీ నత్తనడక నడుస్తున్నాయి.

కన్‌ఫర్డ్ ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగిస్తారా.?

రాష్ట్రంలో ఐఏఎస్‌ల కొరత ఉన్నదని భావిస్తున్న ప్రభుత్వం ఇటీవల ఐఏఎస్‌లుగా నియమితులైన వారిని కలెక్టర్లుగా నియమించే అవకాశం ఉన్నదని సచివాలయ వర్గాలు అంటున్నాయి. రెవిన్యూ సర్వీస్‌కు చెందిన పదిమంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను ఐఏఎస్‌లుగా యూపీఎస్సీ ఎంపిక చేసింది. వీరిలో పలువురు ఇప్పటికే జాయింట్ కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు ముస్సోరిలో మూడు నెలలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో మరో మూడు నెలలు శిక్షణ పొందాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతానికి వీరిలో కొందరి సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అనుమతి కోరినట్టు తెలిసింది.

మూడు ఐటీడీఏల పరిస్థితీ ఇంతే....

ఆదివాసీలు, మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించే రాష్ట్రంలోని మూడు ఐటీడీఏలకు కూడా పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారులు లేక పోడటంతో అక్కడి పాలన కూడా కుంటుపడిందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆదివాసీ ప్రాంతంలో చెలరేగిన ఆందోళన నేపథ్యంలో మూడు ఐటీడీఏలకు ఐఏఎస్ అధికారులను పూర్తిస్థాయి పీఓలుగా నియమిస్తారని భావించినప్పటికీ ఇది ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కొనసాగుతున్నారు. ఉట్నూరు ఐటీడీఏ పీఓగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా ఆయన ఇప్పటికే భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా పాలనా వ్యవహారాల్లో తలమునకలై ఉండే జిల్లా కలెక్టర్లు ఐడీడీఏల పాలనను గాలికి వదలివేశారని గిరిజనులు అంటున్నారు. 'గ్రీవెన్స్ డే' నాడు కూడా పీఓలు అందుబాటులో లేక పోవటంతో వినతి పత్రాలను ఎవరికి ఇవ్వాలో తెలియక మారుమూల గ్రామాల గిరజనులు ఆయోమయానికి గురవుతున్నారు.

పది లక్షల మందితో బహిరంగ సభ

- యాదవ, కురుమలు తరలిరావాలని మంత్రి తలసాని పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే నెల 29న పది లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించబోయే ఈ సభకు యాదవులు, కురుమలు వేల సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. యాదవ, కురుమ ముఖ్యనాయకులతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సభ విజయవంతం కావడానికి ఉమ్మడి జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. కమిటీ నేతలు ఈ నెల 11 నుంచి జిల్లాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహించి, సభ ఉద్దేశం వివరిస్తారని తెలిపారు. రూ. 5వేల కోట్లతో యాదవులు, కురుమలకు గొర్రెలు పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకు 47 లక్షల గొర్రెలు పంపిణీ చేశామని చెప్పారు. యాదవ కులస్తుడిని ఎమ్మెల్సీ చేస్తున్నామని సీఎం గతంలోనే ప్రకటించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మెన్ రాజయ్య యాదవ్, యాదవ మహిళా సంఘం అధ్యక్షురాలు రాగం సుజాత, టీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికుడి ఆత్మహత్య



నవతెలంగాణ-సిరిసిల్ల

అప్పుల బాధ తాళలేక మరమగ్గాల యువ కార్మికుడు ఉరేసుకున్నాడు. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటలో బుధవారం సాయంత్రం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వెంకంపేటకు చెందిన గాజంగి సాయి మరమగ్గాల పరిశ్రమలో మూడేండ్లుగా కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఏడు నెలల కిందట చెల్లెలు పెండ్లికి, కుటుంబ పోషణకు కలిపి రూ.రెండు లక్షలకుపైగా అప్పులు చేశాడు. మరమగ్గాల పరిశ్రమలో వచ్చే ఆదాయం సరిపోక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయి(23) తండ్రి ప్రభాకర్ కూడా ఐదేండ్ల కిందట మరమగ్గాల నిర్వహణలో వచ్చిన నష్టాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికి తల్లి, చెల్లెలు ఉన్నారు.

కిసాన్
నవతెలంగాణ

సమాజంలో సగభాగమైన మహిళామణులు వ్యవసాయంలోనూ ముందుండి నడిపిస్తున్నారు. పురుషుల కంటే తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో మమేకమైన వారిలో మహిళా రైతులే అధికం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో లాభాలు ఆశాజనకంగా లేకపోయినా మహిళా రైతులు మాత్రం వ్యవసాయాన్నే జీవన వృత్తిగా ఎంచుకుంటున్నారు. మరోవైపు వ్యవసాయ రంగంలో మార్పులు తేవడానికి, గ్రామీణ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందించడానికి నేటి యువతరం రైతులు కృషి చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలను కాదని వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తేవడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. అంతిమంగా విజయం సాధిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే చేసింది యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పడమటి పావని అనే మహిళ. సేంద్రియ వ్యవసాయం, పశుపోషణ, పూల పెంపకంలో తన ప్రతిభను జోడించి చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళాదినోత్సవం సందర్భంగా పావనిపై 'కిసాన్' స్టోరి.



పాడి పంటల నారీ మణి

పావని... జిల్లాలోని చీకటి మండలం మర్యాల గ్రామస్తురాలు. నారాయణ రెడ్డి, లక్ష్మమ్మ దంపతుల కూతురు. డిగ్రీ విద్యను అభ్యసించింది. అందరిలా ఉద్యోగం కోసం ఎదిరిచూడలేదు. పట్టణ జీవితాన్ని కోరుకోలేదు. పల్లె వాతావరణాన్ని ఆస్వాదించాలనుకుంది. చేసే పని పదిమందికి ఉపయోగకరంగా ఉండాలని నిర్ణయించుకుంది. వ్యవసాయ రంగంలో రాణించాలని కంకణం కట్టుకుంది. రైతులకు ఆదర్శంగా నిలిచింది. వ్యవసాయం అంటే ఆమెకు మక్కువ, వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగమైనా పశుపోషణలోనూ ఆమెకు ఆమెనే సాటి. గ్రామంలో తనకున్న 20 ఎకరాల్లో వ్యవసాయం మొదలుపెట్టింది. అందులోనే ఫామ్‌హౌజ్ నిర్మించుకుంది. ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో నిమగ్నమైంది. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచింది. ఆమె చేస్తున్న ఈ సాహసానికి తన భర్త పడమటి వెంకట్‌రెడ్డి కూడా తగిన ప్రోత్సాహం అందించడంతో ఆమెకు వెయ్యి ఏనుగుల బలం చేకూరింది. ఆదర్శ రైతుగా గెలిచి నిలిచింది. తన ముగ్గురు కుమారులకు ఉన్నత విద్యనందిస్తుంది. ఘట్‌కేసర్ మండలం, అంకుశాపురం గ్రామానికి చెందిన పావని వ్యవసాయంపట్ల తమకున్న మక్కువతో మర్యాల గ్రామంలో వ్యవసాయం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని రైతులంతా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేయాలి. కాల్వలు, నదులు, తగినంత వర్షపాతం లేని, నీటి సదుపాయాలు లేని ప్రదేశంలో వ్యవసాయం చేయడంతో ఈ ప్రాంతంలోని రైతులందరూ నష్టపోతున్నారు. ఈ పరిస్థితులపై అధ్యయనం చేసిన పావని తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించాలని, దానికి తగిన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్నారు. వ్యవసాయానికి తోడుగా పాడికూడా ఉంటే వ్యవసాయంలో నష్టాలు రావన్న ఉద్దేశంతో 100 ఆవులతో ఫామ్‌హౌజ్ ఏర్పాటు చేసుకున్నారు. వీటికి తోడు గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, బాతులను పెంచుతూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. అదే విధంగా వ్యవసాయంలో నూతన ఒరవడిని అవలంబిస్తూ శాస్త్రీయ పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయం చేయాలంటే ముందుగా కాలానికి అనుగుణంగా, వాతావరణాన్ని బట్టి ఏ కాలంలో ఏ పంటలు వేయాలి. మార్కెట్‌లోకి ఏ కాలంలో ఏ పంటలు అధికంగా వస్తాయి. తదితర అంశాలను క్షుణ్ణంగా



తెలుసుకున్నారు. తమ గ్రామానికి అటు హైదరాబాద్, ఇటు భువనగిరి దగ్గరగా ఉండడంతో మార్కెట్ సౌకర్యం బాగా ఉందని, దీనికి తగిన విధంగా ఎక్కువ కూరగాయలు పండించడానికి ఆమె నిర్ణయించుకున్నారు. తాము పండించే పంటలు, కూరగాయలు తినే ప్రజలు ఏవిధమైన రోగాల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలనేది ఆమె ముఖ్య ఉద్దేశం. అందుకే పంటను ఏ విధమైన పురుగు ఆశించకుండా 10 ఎకరాల్లో ఫాలీహౌజ్ నిర్మించుకున్నారు. దీంతో పాటు తమ ఆవుల మల మూత్రాలనే ఎరువుగా పురుగు మందులుగా ఉపయోగిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తూ లాభాలు గడిస్తున్నారు. చుట్టు పక్కల రైతులకు ఆదర్శ రైతుగా నిలుస్తున్నారు. కాలానికి తగిన విధంగా వరి, కంది, మొక్కజొన్న, జొన్న అన్ని రకాల కూరగాయలతో పాటు పాలకూర, తోటకూర, కలెగూర, బచ్చలి కూర, కోత్తిమీర, పూదీన, మెంతం, చిన్నమెంతం, కొయిగూర అనేక రకాల ఆకుకూరలు, పందిరి సాగు పంటలు పండిస్తున్నారు. గతంలో చెరకు, ఉల్లిగడ్డ కూడా పండించేవారు కానీ వాటికి సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఆ పంటలను విరమించుకున్నారు. ఈ పంటలతో పాటు పూల సాగులోనూ మేటి అనిపించుకున్నారు. ముఖ్యంగా పెండ్లీలకు కావాల్సిన అలంకరణకు చెంది పూల సాగులో ఆమె అనుభవం కలిగి ఉన్నారు. ఈ పూల సాగుకు కూడా రసాయన ఎరువులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు.

- మోత్కూరి యాదయ్య

వ్యవసాయ సూచనలు

వ్యవసాయం-వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 35-39 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 16-25 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతా వరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగలు 28 నుంచి 39 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి 16 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉంది.

వరి: వరిలో కాండం తొలుచు పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా నాటిన 15-20 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేసుకోవాలి. వరిలో జింకు ధాతు లోపం గమనించినట్టయితే 2గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలి. వరిలో అగ్గితెగులు నివారణకు 0.6 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ కాసుగామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

మొక్కజొన్న: మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే సూచనలు న్నాయి. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మిరప: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు కానోఫోరా కొమ్మ కుళ్ళ తెగులు, బూడిద తెగులు, తామర పురుగులు సోకుటకు అనుకూలం. నివారణకు కానోఫోరా కొమ్మకుళ్ల తెగులుకు 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రా. ప్లాంటామైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 గ్రా. మి.లీ కారాథీన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. తామర పురుగుల నివారణకు 1.5 గ్రా. అసిపిట్ లేదా 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ కారాతేన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించి నట్టయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలో డైమండ్ రెక్కల పురుగు గమనించడమైంది. నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ స్పినోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పంట కోతకు 15 రోజుల ముందు పిచికారి చేయాలి.

పశుపోషణ: గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, అవులు, బర్రెల్లో గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకేందుకు అనుకూలం కనుక వీటి నివారణకు టీకాలు వేయించాలి.

మట్టితో పెనవేసుకున్న బంధం ఆమె



సకల శ్రమలకు చిరునామ ఆమె
వ్యవ'సాయం'లోకనిపించని శక్తి ఆమె
కష్టాల సేద్యంలో తరగని సంపద ఆమె
నేలతల్లి ఒడిలో శ్రమైక జీవి ఆమె
మట్టితో పెనవేసుకున్న బంధమే ఆమె
పంటకు ప్రాణం ఆమె
సాలులో నాగలి ఆమె
విత్తే విత్తనంలో ఆమె
కాసే కాయలో ఆమె
అన్నం పెట్టె అన్నపూర్ణ ఆమె
భూమి పుత్రిక ఆమె
విజయ గీతిక ఆమె.

పాడి పంటలు వర్ధిల్లాలి అంటే మహిళ చేయి పడాల్సిందే. ఆమె చేయి పడనిదే మొలకెత్తదు, పైరు పంటనివ్వదు. ఆమె నడుం బిగించనిదే ఒక్క పనీ ముందుకు సాగదు .ఒక్క మాటలో చెప్పాలంటే మహిళ లేనిదే వ్యవసాయం లేదు. దుక్కి దున్నే కాడి నుంచి పంట ఇంటికి వచ్చే వరకూ మహిళా రైతుల పాత్ర అనిర్వచనీయం . మహిళలు ఇటు కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూనే అటు వ్యవసాయ రంగంలోనూ తమ గుర్తింపును చాటుకుంటున్నారు. పల్లె సీమల్లో వ్యవసాయ పనిలో మహిళల పాత్ర ఎక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ విధానం విస్తృతంగా పెరిగినప్పటికీ మహిళా రైతులు లేనిదే పంట చేతికందదు. నిద్రలేచింది మొదలు ఇంటిపని, వంటపని పూర్తి చేసుకుని, సద్దులను మూటగట్టుకుని సరైన సమయానికి పంట పొలాలకు చేరుకునే మహిళలు సాయంత్రం 6 గంటలు దాటితే గానీ ఇండ్లకు చేరుకోరు.

కాలం ఏదైనా, పంట మరేదైనా మహిళా రైతులు నడుం బిగించాల్సిందే. ముందుకు సాగాల్సిందే. . నాట్లు వేయాలన్నా, విత్తనాలు జల్లాలన్నా, కలుపు తీయాలన్నా మహిళలే కనిపిస్తారు. విత్తనాల కొనుగోళ్లు, పంట ఉత్పత్తుల విక్రయాలు, ఎరువులు చల్లడాలు తదితర పనులను మగవారు చేస్తున్నప్పటికీ వ్యవసాయంలో కీలక పనులను మహిళలే నిర్వహిస్తారు.

వ్యవసాయమే ఆసరా



వ్యవసాయం తప్ప ఇంకో పని ఎరుగ. మట్టిని నమ్ముకుని ఉన్నం. పని జేస్తేనే పైసలు. అందుకే ఏండ్ల కొద్ది వ్యవసాయం జేస్తున్నం. ఎండాకాలం, వానకాలం అంటూ తేడా ఏమీ లేదు. ఏ కాలంలో అయినా వ్యవసాయం జేస్తం. కాలం మంచిగుంటే కడుపు నిండ నట్టయితది. కూలి పనులు జేసేటప్పుడు డబ్బుల కోసం డిమాండ్ ఉండది. అందరూ ఒకే మాట మీద ఉండి పనులు చేసి అవసరమైనప్పుడు డబ్బులు తీసుకుంటం.

-పుష్ప , మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

పొద్దంతా తోటల్లోనే...



ఊహతెల్సినప్పటి నుంచే తెల్సిన పని వ్యవసాయమే. కాయకష్టం జేస్తేనే పూట గడుస్తది. ఏ సీజన్‌లో అయిన పనికి పోతాం. తోటల పని ఉంది రావాలి అని రెండు మూడ్రోజుల ముందే తోట యజమాని పిలుస్తడు. అన్ని రకాల పనులు జేస్తా. ఉదయం 9 గంటలకు పనికి వస్తే మళ్లీ సాయంత్రం ఆరు గంటలకు అయిపోతది. పొద్దంతా పని చేస్తే మాకు వచ్చేది మూడు వందలు. అయినా మాకు వ్యవసాయం అంటేనే ఇష్టం.

- నల్ల పెద్దగంగు, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

చిన్నప్పటి నుంచి వ్యవసాయమే..



చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేస్తున్నా. సొంత భూమి ఉంది. ఏటా రెండు సార్లు పంటదీస్తాం. రెండు సీజన్లలో పొలం సాగుచేస్తాం. పొద్దు పొద్దున్నే పొలంలకి వస్తే సాయంత్రం అయినంకనే ఇంటికి పోతం. ఎక్కువ మహిళలే వ్యవసాయం చేస్తున్నరు. కష్టమేం ఉండదు. వ్యవసాయం చేయటం అంటే ఇష్టం..

-ఆకుల లక్ష్మి, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

వ్యవసాయ క్షేత్రంలో మహిళలు

- ఒక హెక్టారు వ్యవసాయ క్షేత్రంలో పురుషులు ఏడాదికి 1212 గంటలు పని చేస్తే మహిళలు 3485 గంటలు పని చేస్తున్నారు.
- వ్యవసాయ శాస్త్రవేత స్వామినాథన్ ప్రకారం.. పశువుల పెంపక కేంద్రాలు, వ్యవసాయమనే కళ, విజ్ఞానం మహిళలను నుంచే ప్రారంభమయ్యాయి.
- వ్యవసాయ రంగం అభివృద్ధిలో మహిళల కృషి ఉంది. హర్టికల్చర్, ఫిషరీస్, పశుపోషన, సోషల్ ఫారెస్ట్రీ రంగాల్లో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.
- వ్యవసాయ భూమి సిద్ధం చేయడంలో 31 శాతం మంది మహిళలు, విత్తనాలను శుభ్రపరచడంలో 80 శాతం, సాగు కార్యకలాపాలలో 86 శాతం, పంట కోయటం, ఎండబెట్టడం, నిల్వ చేయటంలో 84 శాతం మహిళలు తమ పాత్ర పోషిస్తున్నారు.

-వినోద్ మామిడాల

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

పాలకూర ఆకుపై ఎర్రటి మచ్చలు నివారించటం ఎలా?

ప్ర. బెండలో ఎర్రనల్లి నివారణ ఎలా ?

- రవి, మోతె గ్రా, మండలం, నల్లగొండ జిల్లా

జ. పంట చివరి దశలో చిన్న, సన్న ఎర్ర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయి పండుబారుతాయి. దీని నివారణకు లీటరు నీటిలో కరిగే గంధకపు పొడి 3గ్రా. లేదా డైకోఫాల్ 5మి.లీ కలిపి పిచికారి చేయాలి.

ప్ర. మిరపలో ఆకుముడత తెగులు (జెమినివైరస్) నివారణ ?

- భాను, ముంగిమడుగు గ్రా,మహబూబ్‌నగర్ జిల్లా

జ. ఇది తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకుని పడవ ఆకారంలోకి మారిపోతాయి. ఆకుల ఈనెలు ఆకుపచ్చగాను, ఈనెల మధ్య లేత ఆకుపచ్చగాను, పసుపు రంగు కలిగి ఉంటాయి. కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుచుకుంటాయి. నివారణకు ట్రైజోఫాస్ 200 మి.లీ లేదా థయోమిథాక్సాం 40 గ్రా. మందులను మార్చిమార్చి 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

ప్ర. కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ చెప్పండి?

- రాము, బీమని గ్రా, మం, మంచిర్యాల జిల్లా

జ. కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను పూతను చుట్టగా చుట్టుకొని, లోపల ఉండి గీకి తింటాయి. దీని వల్ల ఆకులు తెల్లగా కనబడతాయి. నివారణకు మొనోక్రొటోఫాస లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ప్ర. పాలకూర ఆకులపై ఎర్రటి మచ్చలు వస్తున్నాయి, నివారణ చెప్పండి?

ఎస్. సైదానాయక్, చిత్‌కూర్ గ్రా,మం, సూర్యాపేట జిల్లా

జ.పాలకూర ఆకులపై సెర్కొస్పోరా శిలీంధ్రము ఎర్రటి గోధుమ రంగు మచ్చలుగా ఏర్పడి నష్టాన్ని కలిగిస్తాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ మందును కలిపి పిచికారీ చేయాలి. మందు పిచికారి చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.
ఫోన్: 8332995392,
kisan@navatelangana.com

పందిరి పదిలమైతే... లాభాలు అధికమే...

తీగజాతి కూరగాయల పంటలు రైతన్నలకు దన్నుగా నిలుస్తాయి. వీటిని శాశ్వత పందిర్లపై పండించి అధిక లాభాలు గడించొచ్చు. ఇందుకు ఉద్యాన శాఖ రాయితీలు కూడా ఇస్తోంది. శాశ్వత పందిరిపై బీర ఏడాదికి మూడుసార్లు, కాకర సొర రెండుసార్లు, బోడ కాకర ఒక సారి సాగు చేయొచ్చు. ఈ పంటలకు వేడి వాతావరణం అనుకూలం. నీటిని నిలుపుకునే తేలికపాటి బంకమట్టి నేలలు అనుకూలం.

రకాలు: యూఎస్-6214, యూఎస్-33మహికోగ్రీన్, వినయ్, ఉజాల, పీహెచ్‌బీ, పునమ్,

సొర: మహికో వరద్, రవీనా, యూఎస్-161, శ్రామిక్, కావేరి

బీర: సురేఖ, నిశాంత్, సానియా-4, యూఎస్- 134, సరిత, పొట్ల, దొండ, బోడ కాకరకాయి లోకల్ రకాలు

విత్తే విధానం: భూమి మీద పాకించే పాదులు, వర్షాకాలంలో నీటి కాల్వలకు తోడుగా మురుగు నీరు పోవడానికి రెండు మీటర్ల దూరంలో కాల్వలు చేయాలి. వేసవిలో పాదులకు పొలం అంతట నీటి పారుదల కోసం బోదెలు చేయాలి. అన్ని రకాల పాదులకు మూడు విత్తనాలను 1-2 సెం.మీ లోతు విత్తుకోవాలి. దొండకు చూపుడు వేలు లావున్న కొమ్మలు నాలుగు కణుపులున్నవి రెండ చొప్పున నాటుకోవాలి. వర్షాధారంతో కూడిన అన్ని తీగజాతి కూర పంటలను 15ఇంటు10 సెం.మీ పాలిథిన్ సంచుల్లో విత్తుకుని 15-20 రోజులు పెరిగిన తర్వాత అదను చూసి నాటుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్, ఐదు గ్రాముల ఇమడాక్లోఫ్రిడ్‌తో ఒకదాని తర్వాత మరొకటి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఎరువులు: విత్తే ముందు ఎకరానికి 6-8 టన్నుల పశువుల ఎరువు, 32 నుంచి 40 కిలోల భాస్వరం,16నుంచి 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను గుంతల్లో వేయాలి. 32-40 నత్రజనినిచ్చే ఎరువును రెండు సమభాగాలుగా చేసి విత్తిన 25నుంచి 30 రోజులు అంటే పూత, పిందె దశలో వేయాలి.

కలుపు నివారణ: కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసేయాలి.



రెండు, మూడు తడుల తర్వాత మట్టిని గుల్ల చేయాలి. 200 లీటర్ల నీటిలో 1.2 లీటర్ల పిండి మిథాలిన్ (ఎకరాకు) కలిపి విత్తిన రెండు రోజుల్లోపు పిచికారి చేయాలి.

ఆడపువ్వుల నిష్పత్తి పెంచడం: మొక్కలు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి మూడు గ్రాముల బొరాక్స్ కలిపి పిచికారి చేస్తే ఆడపువ్వుల నిష్పత్తి పెరుగుతుంది.

నీటి యాజమాన్యం: బిందు సేద్యం ద్వారా నీరు పారించడం మంచిది.

సస్యరక్షణ: పెంకు పురుగులు: పిల్ల పురుగులు పెరుగుదల దశలో ఉన్న ఆకుల, పూలను కొరికి తింటాయి. నివారణకు లీటరు నీటిలో మూడు గ్రాముల కార్బొరిల్ లేదా రెండు మి. లీటర్ల మలాథీన్ కలిపి పిచికారి చేయాలి.

పొట్ల ఆకు పురుగు: గొంగళి పురుగులు,ఆకులు, పూలు తింటాయి. నివారణకు లీటరు నీటిలో 2.5 మి. లీటర్ల క్లోరిఫైరీఫాస్ లేదా క్వినాల్‌ఫాస్ కలపి పిచికారి చేయాలి.

పండు ఈగ: పూత దశలో తల్లి ఈగలు పూలపై గుడ్లు పెడతాయి. వీటినుంచి వచ్చిన పురుగులు పిందెలో చేరి తీవ్రంగా నష్టపరుస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో రెండు మి.లీటర్ల మలాథీన్‌ను పూత దశలో పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.



తెగుళ్లు

ఆకుమచ్చ: ఆకులపై ఆకుపచ్చ, ముదురాకుపచ్చ కలిపి మొజాయిక్ రూపంలో కనిపిస్తాయి. ఆకుపై భాగంలో పసుపు రంగు, కింద ఉదా రంగు మచ్చలు ఏర్పడి పండుబారి ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2 గ్రాముల సాఫ్ లేదా 2 గ్రాముల మెటాక్సిల్ ఎంజెడ్ కలిపి పిచికారి చేయాలి.

వేరుకుళ్లు: దీన్నే ఎండు తెగులు అంటారు. ఇవి సోకితే తీగలు వడలి ఎండిపోతాయి. ఈ శిలీంధ్రం భూమి ద్వారా వ్యాపిస్తుంది. నివారణక లీటరు నీటిలో 3 గ్రాముల బ్లైటాక్స్‌కలిపి పిచికారి చేయాలి. ఆఖరి దుక్కిలో 250 కిలోల వేప పిండి వేయాలి. ట్రైకోడెర్మా విరడీ కల్చర్‌ని భూమిలో వేయాలి.

బూడిద తెగులు: ఆకులపై బూడిదలాంటి పిడి కప్పి ఉంటుంది. పొడి వాతావరణంలో ఈ తెగులు తీవ్రత ఎక్కువ. నివారణకు లీటరు నీటిలో 3 గ్రాముల గంధకం పొడి, లేదా ఒక మి.లీ డైనోకాప్ లేదా 2 మి.లీ హెక్సాకొనోజోల్ కలిపి పిచికారి చేయాలి.

పల్లాకు తెగులు: ఈనెలు పసుపు రంగుకు మారి, కాయలు గిడసబారుతాయి. ఈ తెగులును గురించి వెంటనే కాల్చివేయాలి. నివారణకు లీటరు నీటిలో 2 మి.లీ డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ కలిపి పిచికారి చేయాలి.



సాయంత్రం 7 గంటలకు డీ స్పోర్ట్స్‌లో..

సీనియర్లకు విశ్రాంతి దొరికిన వేళ కుర్రాళ్లకు అవకాశం దొరికింది. అయితే నిరూపించుకోవాల్సిన తరుణంలో తొలి అడుగే తడబడింది. అయినా రోహిత్ సారథ్యంలోని యువభారత్ ముంగిట మరో అవకాశం. ఆతిథ్య శ్రీలంక చేతిలో ఓడిన వేదికలోనే బంగ్లాదేశ్‌తో రెండో పోరు. మరి ఈసారైనా టీమిండియా యువతారలు మెరుస్తాయా? బంగ్లాపై విజయంతో టోర్నీలో భారత్ బోణీ చేస్తుందా? వేచి చూడాల్సిందే!.

యువతారలు మెరిసేనా?

బంగ్లాదేశ్‌తో భారత్ పొట్టి సమరం నేడు

- బోణీపై ఇరు జట్ల చూపు
- ముక్కోణపు టీ20 సిరీస్

నవతెలంగాణ-కొలంబో

ఓ పక్క సీనియర్లు లేరు. మరో పక్క తొలి పోరులో ఓటమితో కాస్తంత ఒత్తిడి. ముక్కోణపు టీ20 సిరీస్, నిదాస్ ట్రోఫీలో యువభారత్ రెండ్రోజుల వ్యవధిలోనే రెండో పోరుకు సిద్ధమైంది. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమ్ ఇండియా ప్రేమదాస స్టేడియంలో బంగ్లాదేశ్‌తో నేడు తలపడనున్నది. టోర్నీలో హాట్ ఫెవరెట్‌గా బరిలో దిగిన భారత్‌కు తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక షాకిచ్చింది. ధావన్ ధనాధన్ మెరుపులు వృథా అయ్యాయి. అయితేనేం నేటి పోరులోనూ భారత్‌పైనే సగటు క్రికెట్ ప్రేక్షకుడి చూపు. కారణం టీ20ల్లో బంగ్లాదేశ్ పేలవ ప్రదర్శన. గత పది అంతర్జాతీయ పొట్టిపోరుల్లోనే బంగ్లా ఒకే ఒక్క మ్యాచ్‌లో గెలుపొందింది. ఇక భారత్ అన్ని ఫార్మాట్లలోనూ విజయఢంకా మోగిస్తూ లంకలో ముక్కోణపు సిరీస్‌కు సిద్ధమైంది. తొలిపోరు ఫలితం తమ ఆత్మవిశ్వాసాన్ని బలహీనపర్చదనే ధీమాతో రోహిత్ సేన నేడు బంగ్లాతో పొట్టిపోరుకు సమాయత్తమైంది. టోర్నీలో తొలి గెలుపుపై గురిపెట్టింది.

రోహిత్ రాణించాలి : గతకొద్ది రోజులుగా నిలకడ లేమితో సతమతమవుతోన్న రోహిత్ శర్మ.. సారథిగా బాధ్యతలు మోస్తున్నందున అతనిపై అంచనాలు పెరిగాయి. అంతర్జాతీయ టీ20ల్లో ఐదు సార్లు డకౌట్ అయిన చెత్త రికార్డును లంకతో మ్యాచ్‌లో రోహిత్ సొంతం చేసుకున్నాడు. విమర్శకుల నోళ్లకు తాళం వేయాలంటే బంగ్లాతో సమరంలో టీమ్ ఇండియా సేనాని రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. లంక అంటేనే గర్జించే రోహిత్.. ధావన్ జంటగా చెలరేగితే మిగిలిన బ్యాట్స్‌మెన్‌పై భారం తగ్గుతుంది. కీలకమైన అరడజను మంది సీనియర్లు జట్టులో లేనందున యువ బృందం తమ సత్తా ఏంటో నిరూపించుకోవాలి. తొలి మ్యాచ్‌లో దిగిన బృందంతోనే భారత్ నేడూ బరిలోకి దిగే అవకాశమున్నది. లంకతో పోరులో భారీగా పరుగుల సమర్పించుకున్న శార్దూల్ ఠాకూర్ స్థానంలో హైదరాబాదీ సీమర్ మహ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కొచ్చు. సురేశ్ రైనా ప్రపంచ కప్ వన్డే జట్టులో స్థానమే లక్ష్యంగా భారీ ఇన్నింగ్స్ కోసం ప్రయత్ని స్తున్నా.. నిలకడలేమి అతన్ని కూడా ఇబ్బంది పెడుతున్న సమస్య. తొలి పోరులో బరిలో దిగే అవకాశం ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు దక్కలేదు. నేడు వీలైతే తన సత్తా చాటాలని శంకర్ ఉవ్విళ్లూరుతున్నాడు. వాషింగ్టన్ మరో మెరుగైన ప్రదర్శనపై గురి పెట్టాడు. విజయ్ శంకర్, సురేశ్ రైనా బౌలింగ్ మెళుకువలో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టగలిగితే మంచిది. వాషింగ్టన్ సుందర్ అవసరమైన వేళ బ్యాట్‌తోనూ రాణిస్తే బావుంటుంది.

> మేం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. సానుకూల ధృక్పథంతోనే బరిలోకి దిగుతాం. మేం ఓడింది ఒకే మ్యాచ్, అదేమంత విషయం కాదు. తప్పిదాల నుంచి నేర్చుకుని సరిదిద్దుకుంటాం. నేటి పోరులో మా ఉత్తమ ప్రదర్శన చేస్తాం.
>
> \- రోహిత్ శర్మ, టీమిండియా కెప్టెన్

> జట్టులో మూడో స్థానంపై అనిశ్చితి నెలకొన్నది. అయితే సబీర్ రెహ్మాన్ ఆ స్థానానికి న్యాయం చేస్తున్నాడు. గత కొద్ది మ్యాచుల్లో మేం రాణించలేకపో యాం. పరుగులు చేయలేకపో యాం. అలాంటి పరిస్థితి ఎవరి కైనా సహజం లంకలోనూ అదే జరుతుందనుకోవటం లేదు.
>
> \- మహ్మదుల్లా, బంగ్లాదేశ్ కెప్టెన్

తొలిపోరులోనే ఒత్తిడి : గడిచిన పది టీ20 మ్యాచుల్లో ఓటములతో దెబ్బతిన్ని బంగ్లాదేశ్.. కీలక ఆల్‌రౌండర్ ఆటగాడు షకిబ్ అల్ హసన్ సేవలు లేకుండానే బరిలోకి దిగనున్నది. మిడిలార్డర్‌లో షకిబ్ లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తుందనటంలో సందేహంలేదు. ఇక మూడో స్థానంపై జట్టులో అనిశ్చితి నెలకొన్నా.. ఆ స్థానానికి సబీర్ రెహ్మాన్ న్యాయం చేకూరు స్తాడనే నమ్మకంలో మహ్మదుల్లా నేతృత్వంలోని బంగ్లాదేశ్ కోరుతోంది. గత 12 నెలల్లో బంగ్లా ఆరు అంతర్జాతీయ పొట్టి మ్యాచులు ఆడగా అందులో సౌమ్య సర్కార్, మహ్మదుల్లా, రహీమ్‌లు మాత్రమే శతకాలు చేశారు. అయితే శ్రీలంక గడ్డపై టాప్ ఆర్డర్‌లో తమీమ్ ఇక్బాల్ మెరుపులు చిమ్మాలని ఆశిస్తున్నాడు. భారీగా పరుగులు సమర్పించుకుంటోన్న బౌలర్లు ముస్తాఫిజుర్ రెహ్మాన్, తాస్కిన్ అహ్మద్‌లు ఆ పరిస్థితిలో మార్పు తీసుకొస్తే నిదాస్ టోర్నీలో బంగ్లా శ్రీలంక, భారత్‌లతో పోటీలో ఉంటుంది.

తుది జట్లు (అంచనా) : భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్/మహమ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్, యుజ్వేంద్ర చాహల్


బంగ్లాదేశ్ : మహ్మదుల్లా (కెప్టెన్), తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కేయిస్, ముష్ఫికర్ రహీమ్, సబీర్ రెహ్మాన్/ముస్తాఫిజుర్ రెహ్మాన్, రుబెల్ హుసేన్, తాస్కిన్ అహ్మద్, అబు హైదర్, నురుల్ హసన్, మెహదీ హసన్

పిచ్/వాతావరణం: పిచ్ తొలుత బౌలర్లకు సహకరించినా ఆ తర్వాత బ్యాట్స్‌మెన్‌కు అనుకూలిస్తుంది. ఉక్క వాతావరణం ఉన్నా, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశమున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన వారికి మైదానంలో తేమ ప్రభావం కనిపించొచ్చు.

గంభీర్‌కే ఢిల్లీ పగ్గాలు



న్యూఢిల్లీ : ఐపీఎల్‌లో ఈ ఏడాది ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకు గౌతమ్ గంభీర్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఆ జట్టు యాజమాన్యం వెల్లడించింది.. ఐపీఎల్‌లో మొదటి మూడు సీజన్లలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరపున ఆడిన గంభీర్ ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఐపీఎల్‌లో సొంతగడ్డకు ఆడాలని ఉందని గంభీర్ వేలానికి ముందు మనసులో మాట చెప్పాడు. తాజా సీజన్ కోసం జనవరిలో నిర్వహించిన వేలంలో డేర్‌డెవిల్స్ యాజమాన్యం రూ.2.8 కోట్లకు గంభీర్‌ను దక్కించుకోవటంతో ఏడేండ్ల తర్వాత గంభీర్ ఢిల్లీ జట్టులో చేరాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఫ్రాంఛైజీ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టు సారథ్య బాధ్యతలను బాధ్యతలను గౌతమ్ గంభీర్‌కు అప్పగించినట్లు ప్రకటించింది. ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు ముఖ్య కార్యనిర్వహణ అధికారి హేమంత్ దువా మాట్లాడుతూ..'గౌతం గత సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్. అతని వద్ద నాయకత్వ లక్షణాలకు కొదువలేదు. రికీ పాంటింగ్, గంభీర్‌లతో చర్చించాం. వారిద్దరి ఆలోచనలూ కలిశాయి. జట్టు నాయకత్వ బాధ్యతలు గంభీర్ మోయగలడనటంలో సందేహం లేదు.' అని తెలిపాడు. ఇక ఇదే కార్యక్రమంలో జట్టు ఆటగాళ్లు ధరించే జెర్సీని సైతం ఆవిష్కరించారు. గంభీర్‌తో పాటు మన్‌జోత్ కల్రా, నమన్ ఓజా జెర్సీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. కెప్టెన్సీ బాధ్యతపై గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. 'మరోసారి నా సొంత జట్టుకు ఆడటం ఎంతో ఆనందంగా ఉంది. నా కోరిక మేరకు జట్టులోకి తీసుకున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు. నా ఒక్కడి వల్లే జట్టుకు అదృష్టం రాదు. మా జట్టులోని ఆటగాళ్లంతా మేటి ఆటగాళ్లు. సీజన్‌లో సత్ఫలితాలు సాధిస్తామన్న నమ్మకముంది' అని తెలిపాడు.



పెరిగిన క్రికెటర్ల జీతాలు

కొత్త గ్రేడింగ్‌లో ధోని స్థాయి తగ్గింపు

న్యూఢిల్లీ : బీసీసీఐ క్రికెటర్లకు చెల్లించే వార్షిక వేతనాలను భారీగా పెంచింది. నూతన కాంట్రాక్టు గ్రేడింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 26 మంది ఆటగాళ్ల ఏడాది కాంట్రాక్టులను సుప్రీం నియమిత పాలకుల కమిటీ (సీఓఏ) బుధవారం ప్రకటించింది. దీని ప్రకారం.. గ్రేడ్ ఏ ప్లస్ కింద రూ. 7 కోట్లు, గ్రేడ్ ఏ కింద రూ. 5 కోట్లు, గ్రేడ్ బి కింద రూ. 3 కోట్లు, గ్రేడ్ సి కింద ఒక కోటి రూపాయిలు ఆటగాళ్ల వేతనంగా నిర్ణయించింది. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్, స్పిన్ మాంత్రికుడు రవి చంద్రన్ అశ్విన్‌లను గ్రేడ్ ఏ లోకి చేర్చింది. గ్రేడ్ ఏ ప్లస్‌లో కేవలం ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే చేర్చింది. విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్, భువనేశ్వర్ కుమార్, జశ్‌ప్రీత్ బుమ్రాలు వార్షిక వేతనంగా రూ.7కోట్లు అందుకోనున్నారు. కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్‌లు గ్రేడ్‌బిలో ఉన్నారు. ఇకపేసర్ మహమ్మద్ షమిని ఎందులోనూ చేర్చలేదు. మహిళా క్రికెట ర్లకూ గతంలో ఉన్న గ్రేడ్ఏ (రూ.50లక్షలు), గ్రేడ్‌బి (రూ.30 లక్షలు)తో పాటు గ్రేడ్‌సి కింద రూ.10లక్షలు చెల్లించనున్నారు.

టేలర్ విజృంభణ

ఇంగ్లాండ్‌పై ఐదు వికెట్లతో కివీస్ గెలుపు

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (181 నాటౌట్, 147 బంతుల్లో 17 ఫోర్లు, 6సిక్స్‌లు) అజేయ శతకంతో విజృంభించ టంతో ఇంగ్లాండ్‌తో నాల్గో వన్డేలో ఆ జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల సిరస్‌లో 2-2తో సమంగా నిలిచింది. ఇంగ్లాండ్ తరపున జానీ బెయిరిస్టో (138, 106 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్స్‌లు), జో రూట్ (102, 101 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలు వృథా అయ్యాయి. పరుగుల వరద పారిన మ్యాచ్‌లో టాస్ నెగ్గి న్యూజి లాండ్ ప్రత్యర్థులను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాట్స్‌మెన్ విఫలమైనా, టాప్ ఆర్డర్‌లో జో, జానీల శతకాలతో ఇంగ్లాండ్ నిర్ణీత ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 335 పరుగుల చేసింది. భారీ ఛేదనలో కివీస్ ఓపెనర్లు సున్నా స్కోరుకే పరిమితమయ్యారు. ఈ దశలో టామ్ లాథమ్ (71) సహారాస్ టేలర్ చెలరేగటంతో మరో మూడు బంతు లండగానే కివీస్ లక్ష్యాన్ని ఛేదించింది. ఇక సిరీస్ నిర్ణాయక ఐదో వన్డే శనివారం క్రైస్ట్ చర్చ్ వేదికగా జరుగనున్నది.





మలేసియా చిత్తు

● అజ్లాన్ షా హాకీ పోరులో 5-1తో భారత్ విజయం

న్యూఢిల్లీ : ఆఖరు క్వార్టర్లో అదిరిపోయే ప్రదర్శన చేసిన సర్ధార్ సేన.. సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన నాల్గో పోరులో 5-1తో మలేసియాపై ఘనవిజయం సాధించింది. టోర్నీలో భారత్‌కు ఇదే తొలి గెలుపు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం చలాయించింది. శిలానంద్ లక్రా తొలి క్వార్టర్‌లోనే అద్భుతమైన గోల్‌తో భారత్‌కు శు భారంభాన్నిచ్చాడు. అర్ధ సమయానికి భారత్ 1-0తో ఆధిక్యంలో ఉన్నది. అయితే 33వ నిమిషంలో ఫైజల్ సారి మలేసియా తరపున గోల్ కొట్టి 1-1తో స్కోరు సమం చేశాడు. ఈ దశలో భారత్ పుంజుకున్నది. ప్రత్యర్థికి మరో పాయింట్ కోల్పోకుండా వరుసగా నాల్గు పాయింట్లు సొంతం చేసుకు న్నది. 42, 48, 54, 57 నిమిషాల్లో భారత్ గోల్స్ సాధించింది. అంతకుముందు లీగ్ మ్యాచుల్లో అర్జెంటీనాతో 2-3తో ఓడి ఇంగ్లాండ్‌తో 1-1తో డ్రా చేసుకున్న భారత్, ఆస్ట్రేలియా చేతిలో 2-4తో ఓడింది. అయితే తాజా గెలుపుతో భారత్ ఫైనల్ ఆశలు మరోసారి చిగురించాయి. అయితే అది ప్రత్యర్థుల ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది. శుక్రవారం ఆఖరు లీగ్ మ్యాచ్‌లో భారత్.. ఐర్లాండ్‌తో తలపడనున్నది.



స్వర్ణం ఎక్కుపెట్టారు

- ముస్కాన్, ప్రొమిలాకు బంగారు పతకాలు
- ఆర్చరీ ఆసియాకప్

న్యూఢిల్లీ : భారత మహిళా విలు క్రీడాకారిణీలు ముస్కాన్ కిరార్, ప్రొమిలా డైమారిలు ఆర్చరీ ఆసియాకప్‌లో స్వర్ణ పతకం సాధించారు. బ్యాంకాక్‌లో జరుగుతోన్న పోటీల్లో మహిళల ఈవెంట్లలో బుధవారం అత్యుత్తమ ప్రదర్శన చేసి.. భారత పతకాన్ని రెపరెపలాడించారు. మలేసియా అమ్మాయి జకారియా నదిరాను 139-136తో ఓడించిన ముస్కాన్ కాంపౌండ్ విభాగంలో స్వర్ణం సాధించింది. ప్రొమిలా డైమేరి 7-3తో రికర్వ్ ఈవెంట్ ఫైనల్ పోరులో రష్యా క్రీడాకారిణి ఎర్డినెవా నటాలియాపై గెల్చి పసిడి సొంతం చేసుకున్నది. మహిళల రికర్వ్ ఈవెంట్లో మధు వేద్వాన్, పురుషుల విభాగంలో గౌరవ్ ట్రాంబక్ లంబేలు భారత్ ఖాతాలో కాంస్య పతకాలు చేర్చారు.

యుకీ x రామ్‌కుమార్

● ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్

ఇండియన్ వెల్స్ (అమెరికా) : భారత టాప్ సింగిల్స్ ఆటగాళ్లు యుకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్‌లు ఇండియన్ వెల్స్ మాస్టర్స్‌లో శుభారంభం చేశారు. తొమ్మిదో సీడ్ యుకీ 7-5, 7-తో స్థానిక ఆటగాడు డెనిస్ నొవికోవ్‌ను ఓడించగా, 20వ సీడ్ రామ్‌కుమార్ 6-3, 7-5తో మిచెల్ మోపై గెలుపొందాడు. తొలిఅర్హత రౌండ్లలో వరుస సెట్ల విజయాలతో రెండో రౌండ్ చేరిన వీరిద్దరూ ప్రధాన టోర్నీలో స్థానం కోసం నేడు తలపడనున్నారు.

వార్నర్‌కు జరిమానా



డర్బన్ : ఆసీస్ వైస్ కెప్టెన్ డెవిడ్ వార్నర్ దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో ఆడనున్నాడు. సఫారీ వికెట్ కీపర్ క్వింటన్ డికాక్‌తో వాగ్వాదం పెట్టుకున్న వార్నర్.. ఐసీసీ క్రమశిక్షణా నియమావళి అనుసారం మ్యాచ్ ఫీజులో 75 శాతం కోతకు గురయ్యాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసిన అంతర్జాతీయ క్రికెట్ పాలక సంస్థ.. వార్నర్ లెవల్ 2 తప్పిదాన్ని ఒప్పుకోవడంతో మ్యాచ్ ఫీజులో కోత మాత్రమ వేసి ఊరుకున్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.